౨౩ అక్టోబర్

జ్యోతి

వెల-౨౦ న.పై






గోకుల్ ప్రొడక్షన్స్
శ్రీ తిరుపతమ్మ కథ
దర్శకత్వం: బి.యస్.నారాయణ
నిర్మాత: దోనేపూడి కృష్ణమూర్తి
STUDIO Ketna
డిస్ట్రిబ్యూటర్స్
ఆంధ్ర: శ్రీ కృష్ణా + సీడెడ్, నైజాం: పూర్ణా
REVATHI


పాఠకులకు మా దసరా శుభాకాంక్షలు

రమణగా రబ్బాయి బుడుగు కాటోలు
రెండు జడలున్నట్టి సీత కడకేగి
కాలేడకెళ్ళేటి కొమ్మసీతమ్మ !
కలము నీ కిదిగోను ఘనమైనదనుచూ
"రామ్‌సన్" యని యేటి రంగైన కలమూ
రయముగా గొనుమనుచు రమణితో జెప్పె.
జయాభి జైభవ !
దిగ్విజయీభవ !!



RAMSON Pens

చిరునామా: బడీచావడి, హైదరాబాదు-1.



పంకజ్ శాండల్ సోప్
మీకు నూతన శోభ చేకూరుస్తుంది

పంకజ్ శాండల్ సబ్బు మీ చర్మ సౌందర్యాన్ని ఇనుమడింపజేసి యవ్వనశోభ ప్రసాదిస్తుంది. దాని మనోహరమైన చందన పరిమళం రోజంతా మిమ్మల్ని ఆనందపరుస్తుంది.

పంకజ్ సోప్స్ & ఆయిల్ మిల్స్, కొచ్చిన్

విటమిన్లు కలిసిన ఆదర్శప్రాయమైన ఆహారపానీయము

మిక్కిలి —ఆరోగ్యకరము
—పుష్టికరము
—రుచికరము
—ఆహ్లాదకరము



సిరిటోన్

సిరిస్ వారి ఉత్పత్తి

సిరిఫార్మా, సిరినగర్, విజయవాడ-7.

జ్యోతి
సచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్‌పేట, విజయవాడ-2.

మేనేజింగ్ ఎడిటరు : వి. వి. రాఘవయ్య
విడిప్రతి వెల : 60 న.పై. ఏడాది చందా ఏడు రూపాయలే
సంపుటి **1** అక్టోబరు **1963** సంచిక **9**

పాఠకౕ మహాశయా ! ఈ నెల

ఇదో వరస....

ముఖచిత్రం : బాబూమువీస్‌వారి "మూగమనసులు"లో నాగేశ్వరరావు, జమున

సంపాదక వర్గం :
నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకటరమణ,
బాపు, వి. ఎ. కె. రంగారావు, రావి కొండలరావు

Edited and Published by V. V. Raghavaiah and Printed by him at
Thrinadh Art Printers for Andhra Printers Ltd.,
Buckinghampet post, Vijayawada-2.

తొలిమాట

రానున్నది దీపావళి సంచిక. కొత్త శీర్షికలతో, ప్రత్యేకాకర్షణలతో వెలువరచాలని మా ఆశయం.

దీపావళి సంచికను పురస్కరించుకుని వ్యాసాల పోటీ పెడుతున్నాము. (8 వ పేజీ చూడండి). అవ్యవధికంగా ఈ పోటీని ప్రకటిస్తున్నప్పటికి, అందులో కాలేజీ విద్యార్థినీ విద్యార్థులు విరివిగా పాల్గొని పోటీని జయప్రదం చేయాలని కోరుతున్నాము.

ఈ సంచికలో ప్రచురించిన ఆరు కథలూ ఆణిముత్యాలే. ఒక్కొక్కదానిలో ఒక్కొక్క ప్రత్యేకత. చదివి ఆనందించండి. అభినందించండి (రచయితలను).

కలం పట్టిన ప్రతి రచయిత కథో, గేయమో, నాటికో వ్రాయడం జరుగుతోంది. కథలకు బహుళ జనాదరణ వున్నమాట నిజమేగాని, అందరూ అవే వ్రాయాలా ? వ్రాయాలనే కోరిక, తీరిక, ఓపిక వుంటే లోకంలో ఎన్ని రచనావస్తువులు లేవు ? కథలంత కుతూహలం కలిగించే శైలిలో కథేతర (నాన్–ఫిక్షనల్) వాఙ్మయం మన భాషలో ఎందుకు రావడం లేదు ? అన్నది సారస్వతాభిమానులు ఆలోచించదగిన ప్రశ్న.

దీపావళి సంచిక

వ్యాసాల పోటీ

బహుమతి 100 రూపాయలు

"జ్యోతి" దీపావళి సంచికకు వ్యాసాల పోటీలు పెడుతున్నాము. వాటిలో కాలేజీ విద్యార్థులు, విద్యార్థినులు మాత్రమే పాల్గొనవచ్చు. ఉత్తమరచనలకు ఒక్కొక్కదానికి 50 రూపాయల చొప్పున రెండు బహుమతులివ్వబడతాయి. రచనలు దీపావళి సంచికలోనే ప్రచురిస్తాము. బహుమానార్హత విషయంలో సంపాదకులదే తుది నిర్ణయం. దానిపై ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు. విషయమెంత ప్రధానమో, విషయ వివరణశైలి కూడా అంత ప్రధానమని, అంత ఆసక్తికరంగా వుండాలని గమనింప ప్రార్థన.

ముఖ్య నిబంధనలు :

1. రచన దీపావళి సంచికలో (మామూలు "జ్యోతి" సైజుకు రెట్టింపు సైజు) రెండు పేజీలకు మించరాదు.

2. రచనలు 15-10-63 లోగా మాకు చేరాలి. ఆ తరవాత వచ్చిన రచనలు పోటీకి స్వీకరింపబడవు. వ్యవధి తక్కువగనుక త్వరగా రచనలు పంపండి.

3. రచయిత(త్రు)లు తమ రచనలతో పాటే తమ పేరు, చదువుతున్న తరగతి, కాలేజీ (లేక యూనివర్సిటీ), పూర్తి చిరునామా వ్రాసి పంపాలి.

4. బహుమతికి నిరాకరింపబడిన రచనలు త్రిప్పిపంపబడవు.

విద్యార్థులకు పోటీ విషయం

ఉత్తమ రచనకు బహుమతి : **50** రూపాయలు.

నేటి విద్యార్థులలో క్రమశిక్షణ లోపించిందని కొందరు పెద్దలు చెబుతున్నారు. నిజమేనా? నిజమైతే ఎంతవరకు నిజం? దానికి కారణమేమిటి? ప్రస్తుతవిద్యావిధానానికి దాని బాధ్యత ఎంతవరకు వుంది? దాన్ని ఎలా సంస్కరిస్తే క్రమశిక్షణకు దోహదకారి కాగలదు? మొదలైన ప్రశ్నలను చర్చిస్తూ అచ్చులో రెండు పేజీలకు మించని వ్యాసం వ్రాయండి.

విద్యార్థినులకు పోటీ విషయం

ఉత్తమరచనకు బహుమతి : **50** రూపాయలు

మీరు విద్యాభ్యాసం పూర్తికాగానే ఏంచేయాలని మీ సంకల్పం? గృహిణీజీవితాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకోవడమా? లేక మీకునచ్చిన ఉద్యోగంలో చేరి, మీ చదువును సార్థకపరచుకోవడమా? గృహిణీజీవితంలో మాత్రం చదువును సార్థకం చేసుకోవడానికి అవకాశం లేదా? మొదలైన విషయాలను చర్చిస్తూ మీ అభిప్రాయాలను రెండు పేజీలకు మించని వ్యాసంగా వ్రాసి పంపండి.

ఉత్తరాయణం

కథలు

"సీతాపతికథ"లో సీతాపతిని అత్యుత్తమంగా సృష్టించారు తిలక్‌గారు. మీరన్నట్టుగా వారి అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలే సుమండి. "జ్యోతి" బావుంటుందా? లేక "జ్యోతి" లో తిలక్ గారి కథలు బావుంటాయా అన్నది నాకు చిక్కుప్రశ్నే. నాకేమిటి? అందరికీని.

"బావు" కథ చూసి ఇదేదో చచ్చు కథ అనుకున్నాను, కాని చచ్చేంత బావుందండీ వివేకానంద మూర్తిగారి కథ.

రాధికాప్రసాద్, గుంటూరు.

అవతరణ, నిదురలేవని దేవుడు కథలు బాలా బాగున్నాయి. అవి రాసినవారికి నా ధన్యవాదాలు. వెయ్యి నూటపదహార్ల పోటీని ఎందుకు నిలిపివేశారో అర్థం కావడంలేదు. దయచేసి కొనసాగించండి.

చెన్నూరి కమలాకర్, పెద్దపల్లి.

అరవై రోజుల్నించి ఎదురుచూస్తున్న తిలక్‌గారి కథ "సీతాపతి కథ" చెత్తకు ఉండువుగా వుంది.

"ఎన్సార్", రాజమండ్రి.

"బావు" కథ తెలుగు కథాసాహిత్యంలో ఒక ముత్తయిదువ.

"నర్సింబాబు", విశాఖ.

తిలక్‌గారి కథ. వివేకానందమూర్తిగారి కథ, మరీ ముఖ్యంగా ముఖచిత్రం బాగున్నాయి. రచయితలకు, చిత్రకారునికి అభినందనలు,

శోభశ్రీ, రామన్నపాలెం, (నెల్లూరుజిల్లా).

అట్టమీదిబొమ్మ చాలా బావుందండీ. దాని గురించి అరిగే రావూరావుగారు రాసిన "ఆడమనసు" కథ "బావు" అనే ఇంకొక కథ నాకెంతో నచ్చాయి.

మీ జోక్‌లు తలుచుకున్నకొద్దీ నవ్వొక్కిస్తున్నాయి.

గుండుమళ్ళ వెంకటరామారావు, శ్రీకాకుళం.

బాపుగారి ముఖచిత్రం, దానికథ, వివేకానందమూర్తి గారి "బావు" కథ నాకెంతో నచ్చాయి.

రమణమూర్తి, (సినీనటుణ్ణికాదండోయ్) బందరు.

ముఖచిత్రం ఏమంత గొప్పగా లేదు. పోతే, వ్యంగ్య కార్టూనులు కడుపుబ్బ నవ్విస్తున్నాయి.

ఎం. ఎన్, రావ్, పూలపల్లి

రాజకీయ వార్తలు దిన పత్రికలలో చదవటానికన్న మీ "జ్యోతి" లో చదవటానికే ఆసక్తి ఎక్కువగా వుంటోంది. పరిస్థితులన్నిటినీ ముచ్చటిస్తారు. హాస్యంగా ఉండుట వలన వదలకుండా చదవబుద్ధవుతున్నది.

బి. నిర్మల, అనకాపల్లి.

స్వరలహరి

సెప్టెంబరు సంచికలో శ్రీనివాస్వరలహరియందు ఎస్. రాజేశ్వరరావుగార్ని

గురించి చక్కగా విపులీకరించారు. రచయితకు ధన్యవాదాలు.

బచ్చు వీర్రాజు, ముక్కామల.

శ్రీనివాస్‌గారి "స్వరలహరి" లో ఒక ఘోరమైన పొరపాటు. అదేమిటంటే రాజేశ్వరరావుగారు సంగీత దర్శకత్వం వహించిన చిత్రాల లిస్టులో "మాయాబజార్" చిత్రంకూడా చేర్చారు. కాని, దానికి ఘంటసాలగారు కదా సంగీత దర్శకత్వం వహించింది?

సిహెచ్. గుర్రాజు, విజయపురి నార్తు.

సంగీత దర్శకులపై మొదటి పి. బి. శ్రీనివ్యాసం వారి వాయిస్ లాగే ఆహ్లాదకరంగా వుంది. కాని "దారితప్పి" సంగీత దర్శకులు కాపీకొట్టుట అనే అంశానికి వచ్చినప్పుడల్లా అయిష్టంగానే అతి కష్టంతోనే మొహమాట పడిపోయా రనుకుంటాను.

"ఏ కళాకారుడూ...." ఇంకొకరి "కళా సృష్టి" లాంటి బరువుమాటల్ని వదిలేస్తే చిన్నప్పటినుంచీ సినిమా సంగీతాన్ని శంఖు తీర్థంలా పుచ్చుకుంటున్న నాకు తేలిందేమంటే, అటు హిందీ సంగీత దర్శకులే కానివ్వండి, ఇటు మనవాళ్ళే కానివ్వండి — దొరకనంతవరకు దొరలే.

ఉదాహరణకు : "సత్యవాన్ సావిత్రి" అనే గుజరాతీ సినిమాలో మహమ్మద్‌రఫీ, లతా పాడిన ఒక పాట, శ్రీనివాస్‌గారు మనోహరంగా పాడిన "కాలంగళిల్ అవళ్ వసంతం" పాటకు మక్కికిమక్కి. సంగీత దర్శకుడు శ్రీ దిలీప్ ధోలకియా శ్రీనివాస్ గారి పాటని విని ఉంటడని అనుకోడానికే అవకాశం ఎక్కువ.

బొంబాయిలో "స్ట్రాండ్" సినిమా పునర్నిర్మితం కాకమునుపు ఆ థియేటరుతో విశ్రాంతి సమయంలో ఎక్కువ భాగం స్పానిష్-ఇటాలియన్ జంత్ర సంగీతపు రికార్డులువేసే వారు. వాటిని విని "ప్రేరణ" పొందిన కొంతమంది హిందీ సినిమా దర్శకులు మర్నాడుధయం కొత్త ట్యూన్ రిహార్సల్ ప్రారంభం చేసేవారని యిక్కడ పెద్ద రూమర్. అలాంటివి మనం నమ్మకూడదనుకోండి.

ఎస్. వి. యన్. శాస్త్రి, బొంబాయి.

కృష్ణ "జ్యోతి" లో నేను వ్రాసిన స్వరలహరి గురించి రెండు లేఖలు గత మాసం ఉత్తరాయణంలో ప్రచురించారు. విశాఖపట్టణం కృష్ణగారికి: "దాంపత్యం" చిత్రంలో మొట్టమొదట వినబడిన "గుడీవినింగ్ రార కృష్ణ" అను పాట ఎం. ఆర్. ఎ. పతాకం క్రింద అనాటి అభినేత్రి కృష్ణవేణి నిర్మించాలనుకున్న "గుడ్ ఈవినింగ్" చిత్రంకోసం రికార్డు చేయబడినది. ఆచిత్రం ఆపివేశారు కాబట్టి దానిని "దాంపత్యం" లో ఉపయోగించుట జరిగింది. శ్రీ రమేష్ నాయుడికి ఈ పాటకూ ఏమీసంబంధంలేదు.

వాల్తేరు రామచంద్రరావుగారికి: సందర్భానుసారం కృష్ణపరమైన కొన్ని పాటలు ఉదహరించడం జరిగిందికాని అన్ని పాటలు గాని, కనీసం అన్ని మంచి పాటలుగాని ఉదహరించాలని గాని ఉద్దేశంలేదు. నిజానికి "అలిగిన వేళనె చూడాలి" సంగీత సాహిత్యాల పరంగా చాలా అందమైన పాట.

శ్రీమతి రాధికా ఆనందకృష్ణ.

"నువ్వింత పొగిడి అలిసి పోతున్నావు గాని ఆ జ్యోతిలోవున్న గొప్పేవిట్రా" అని నిలేసి అడిగేశాడు మాకృష్ణ వల్లిగ్గా నడి రోడ్డుమీద.

"ప్రతినెలా ఒక్కొక్క కొత్త శీర్షిక ఉండటమే ప్రత్యేకత.

కావలిస్తే సెప్టెంబరు పత్రిక వస్తుందిగా, చూస్కో" అని సవాలుచేశాను.

నా పరువు నిలబెట్టారు, 28, 29, 98 పేజీలే అందుకు నిదర్శనం.

నేను కొన్న సంచికలో (అలాగే మా కృష్ణ కొన్నదానిలో కూడా) చైత్రయాత్ర మరోఫారం ఎక్కువ బైండు అయింది. "అదీ ప్రత్యేకతేనా" అన్నాడు వాడు. "అవును. ఎప్పుడైనా అమ్ముకుంటే తూకం హెచ్చుదా ?" అని సర్ది చెప్పాల్సెండి.

మాష్టర్ రవి, రాజాం.

"నేతి_నేతి" చదివినతర్వాత ఎంత అర్థం లే (కా) కుండా రాస్తే అంత మంచి కవిత్వం రాసినట్టు అని తెలిసింది.

వె. మాంచాల, మద్రాసు.

రంగారావు గారూ: G E 189047 ఏమిటో చెబుతారా ?

వి. విశ్వేశ్వరరావు, విశాఖ.

"జ్యోతి" పత్రిక "కొని" చదివిన మానవమాత్రు దెవడూ "జ్యోతి" బావుం టోందోహో. కథలు బావున్నాయోచ్" అన డానికి వీల్లేకపోతోందిసార్— "ఏదీ నాకో సారివ్వు. చదివిచ్చేస్తాను" అని పక్క వాడు అడిగి లాగేసుకుపోతాడనే భయం చేత.

బొప్పన రామకృష్ణ, విజయవాడ.

సంపాదక మహాశయా, మీ పత్రికలో అచ్చు తప్పులు హెచ్చుతున్నాయి. ఇలా గైతే మీ పత్రిక కనడం మానేస్తాము.

ఇట్లు, పాఠక మహాశయులు (ప్రస్తుతా నికి).

దా. సత్యనారాయణ, మ. రామకృష్ణ, చెన్నపురి.

*[ఈమోసంఎక్కువ వేలు. సారీ. లేవు.]

రమణమూర్తిగా రన్నట్టు అచ్చు తప్పులే కాదు, హల్లు తప్పులుకూడా ఎక్కువే.

ఎన్. పార్ధసారధి, మద్రాసు.

"అది గోదారి" అంటూ చివరికి "స్వర్గా నికి దారి" చూపించారుగాని, "జ్యోతి" కొన డానికి బుక్‌షాపు దారి చూపించలేదేమండి. అలాగే "మంత్రి పదవికి దారి" కూడా చూపించలేదేం ?

సూర్యదేవర గిరిజాప్రసాద్.


తుమ్మపూడి (గుం॥జి॥)

ఒక చిన్న విట్‌బిట్: - తండ్రి కొడు కుతో: "చీకట్లో ఏమిట్రా చూస్తున్నావ్ ?"

కొడుకు : 'జ్యోతి'

ఎస్. ఎస్. సి. శర్మ, గురజాల.

□□□





రాజకీయ వాతావరణం

ప్రజావాణిని మన్నించిన మార్పులు

ఈమధ్య ఒకానొక శనివారం (సెప్టెంబరు 21 వ తేదీ) నాడు లోక్‌సభలో మిన్ను ముట్టే హర్షధ్వానాలు చెలరేగాయి. కారణం: ఆర్థికమంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారిగారు చేసిన ఒకానొక ప్రకటన: నిర్బంధపు పొదుపు పథకాన్ని, బంగారం కంట్రోల్ నిబంధనల్ని సడలిస్తున్నామని.

నిర్బంధపు పొదుపు పథకాన్ని ఏ దుర్ముహూర్తాన మాజీ ఆర్థికమంత్రి శ్రీ మొరార్జి దేశాయి పార్లమెంటులో ప్రవేశపెట్టారో గాని, దానికి మొదటినుంచీ ప్రతిఘటనే ఎదురైంది. దేశరక్షణ పాటవాన్ని అధికం చేయడానికి కావలసిన ధనాన్ని కూర్చుకొన డానికి ఈ పథకాన్ని పాపం ఆయన ప్రారంభించారు. ఊహ మంచిదే. కాదని ఎవ రంటారు ? కాని, ఆచరణలో ఇది ఎంత కష్టసాధ్యమో నెమ్మదిమీదగాని తెలియలేదు.

ఈ పథకంలో మొత్తం అయిదు విభాగాలున్నాయి: రాబడి పన్ను చెల్లించేవారినుంచి వసూలు చేయవలసింది మొదటిది. రాబడి పన్ను చెల్లించనవసరంలేని చిన్న ఉద్యోగస్తులనుంచి వసూలు చేయవలసింది రెండవది. పట్టణాలలో స్థిరాస్తులు కలవారినుంచి, అమ్మకం పన్ను చెల్లించే చిన్న వర్తకుల నుంచి, పల్లెలలో వ్యవసాయదారులనుంచి వసూలు చేయవలసినవి మిగతా మూడు విభాగాలు.

ఈ పథకంనుంచి దాదాపు అరవైకోట్ల పైగా ఆదాయం రాగలదని అంచనా వేయబడింది. ఇందులో నూటికి ఇరవైవంతులు పథకం నిర్వహణకే ఖర్చయిపోతుందని మరొక అంచనా. ఇంత భారీఖర్చు, భారీ ప్రయాసపడి ఈ పథకాన్ని అమలు చేయడం వివేకమేనా ?

చివరి మూడు విభాగాలను అమలుచేయవలసిన బాధ్యత రాష్ట్రప్రభుత్వాలది. కాని, ఈ బాధ్యత నుంచి తప్పించుకొనడానికే రాష్ట్ర ప్రభుత్వాలన్నీ ప్రయత్నించాయి. పథకాన్ని అమలుచేయడం కష్టమని కేంద్రానికి స్పష్టంచేశాయి,

కాని, అసలు కారణం అది కాదు. పథకానికి రానురాను దేశమంతటా ప్రాతికూల్యం ఎక్కువైపోయింది. ప్రతిపక్షాలన్నీ ఈ పథకాన్ని సాకుగా తీసుకుని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పార పట్టాయి. అసలే పన్నులభారంతో, ధరలభారంతో కుంగిపోతున్న ప్రజలు ఈ తూర్పార పట్టడంలో చేతులు కలిపారు. తీవ్రమైన అసంతృప్తి ప్రబలిపోయింది. ముఖ్యంగా 1500-3000 మధ్య రాబడి వచ్చే చిన్న ఉద్యోగులలో

ఈ అసంతృప్తి మరీ ఎక్కువై పోయింది. ప్రతిపక్షాలు తమ పలుకుబడిని పెంచుకొనడానికి ఈ అసంతృప్తి మహదవకాశంగా దొరికింది. కమ్యూనిస్టుపార్టీ కోటీ రెండున్నర లక్షల సంతకాలు సేకరించి ఢిల్లీలో పార్లమెంటుకు మహావిజ్ఞాపన పత్రాన్ని సమర్పించింది.


ఈ హడావిడి అంతా చూసి కాంగ్రెసువాదులకుకూడా గుండె బేజారై పోవడం సహజం. కాంగ్రెసు పార్లమెంటరీపార్టీలో కూడా అధిక సంఖ్యాకులు ఈ పథకాన్ని వ్యతిరేకించడం మొదలుపెట్టారు.

స్వ పక్షంనుంచి, పరపక్షాలనుంచి కూడా వచ్చిన ఈ ఒత్తిడిని ప్రభుత్వం తట్టుకోలేకపోయింది. అందుచేత ఒకానొక శుభోదయాన ఆర్థికమంత్రి చల్లగా ఒక ప్రకటన చేశారు. రాబడి పన్ను చెల్లించేవారికి మాత్రం పథకం మిగిల్చి, మిగతా నాలుగు విభాగాలవారికి దాన్ని రద్దుచేశారు. దీనివల్ల ప్రభుత్వానికి రాగల ఆదాయంలో 40 కోట్ల రూపాయలదాకా తగ్గిపోగలదట. కావచ్చు గాని, దేశం ఒక నిట్టూర్పు విడిచింది.

అదే విధంగా బంగారం కంట్రోల్ నిబంధనలలో జరిగిన మార్పులు. బంగారం కంట్రోలు చాలా విప్లవాత్మకమైన చర్య. దేశంలోకి ఏటేటా దిగుమతి అవుతున్న దొంగ బంగారాన్ని అరికట్టడానికి ఈ చర్య ప్రధానంగా ఉద్దేశింపబడింది. దొంగ బంగారం రవాణావల్ల దేశానికి ఏటా యాభై, అరవై కోట్లదాకా విదేశీ మారకపు ద్రవ్యం వృథా అయిపోతోంది. బంగారం పూరికే ఆదేపనిగా దేశంలోకి వచ్చి పడుతుండడం వల్ల ప్రజలలో బంగారంమీద వ్యామోహం పెరిగిపోవడం, అక్రమంగా సంపాదించిన ధనాన్ని ప్రభుత్వంనుంచి దాచుకొనడానికి ఒక సాధనంగా వినియోగపడడం తప్ప వేరేమీ జరగలేదు. ఈ అనర్థాన్ని ఎలా అరికట్టడం? ప్రజలవద్ద దాగిన బంగారాన్ని ఎలా బయటపెట్టించడం? అని ఆలోచించి శ్రీ మొరార్జిదేశాయి బంగారం కంట్రోల్‌ను ప్రవేశపెట్టారు.

ఈ ఊహకూడా మంచిదే. కాని, అది కేవలం శ్రీ మొరార్జి ఊహాగానంగానే మిగిలిపోయింది. దొంగ బంగారం రవాణా పెద్దగా తగ్గలేదు. ప్రజలవద్ద దాగిన బంగారం పెద్దగా బయటపడలేదు. బంగారంమీద జనానికి మోజు తగ్గలేదు. పోతే, జరిగిందేమిటంటే అయిదారు లక్షల మంది స్వర్ణకారులకు జీవనోపాధి పోయింది. అనేకులు తమ కొట్లు కట్టేశారు. పస్తులున్నారు. ప్రదర్శనలు చేశారు. ఊరేగింపులు చేశారు. నిరాహారదీక్షలు వహించారు. మహజర్లు పెట్టుకున్నారు. చివరికి కొందరు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు.

వారి మొరలు, అర్జీలు మొరార్జీగారికి వినబడకపోలేదు గాని, "అయిదు లక్షల మందికి జీవనోపాధి పోయిందంటే, నేనేం చెయ్యను." అని నిస్పృహాయతను ప్రకటించారు. "ప్రజలకు బంగారం అనవసరం, ప్రభుత్వానికి అవసరం. ప్రజల మెడలలో, వేళ్ళమీద, చెవులమీద, ఇనప్పెట్టెలలో, పాతర్లలో మూలుగుతున్న బంగారాన్ని బయటపెట్టించడానికి మరొక మార్గమేది?" అన్నారు.



సెప్టెంబరు 5 వ తేదీన 75 వ జన్మదినోత్సవ సందర్భంలో రాష్ట్రపతి రాధాకృష్ణన్‌ను అభినందిస్తున్న ప్రధాని నెహ్రూ.

మరొక మార్గం లేదన్నమాట నిజమే. కాని ఆ మార్గాన్ని అనుసరించేముందు, అయిదు లక్షలమంది స్వర్ణకారులు నిరుద్యోగులైపోతారే అనే సమస్యను ఆలోచించవలసింది. వారేమైతే నాకేం? అనేది ప్రభుత్వం అనవలసినమాట కాదు.

యథాప్రకారం ప్రతిపక్షాలవారు బంగారం కంట్రోల్‌ను వ్యతిరేకించారు. ఈ వ్యతిరేకత ఒత్తిడి కాంగ్రెసుపార్టీకి కూడా తగిలింది. నిబంధనలను సవరించక తప్పలేదు. ముఖ్యమైన సవరణ–

14 క్యారట్ల బంగారపు ఆభరణాలను చెడగొట్టి కొత్తవాటిని పూర్వపువన్నెలోనే చేయించుకోవచ్చు. అలా చేయడానికి వ్యక్తిగతంగా పనిచేసుకునే స్వర్ణకారులను ప్రభుత్వం అనుమతించింది. దీనివల్ల కొంతమంది స్వర్ణకారులకైనా కొంత జీవనభృతి లభిస్తుంది. గుడ్డిలోమెల్ల.

ఈ మెల్ల కూడా శ్రీ మొరార్జీ దేశాయిగారే మంత్రిగా వుంటే వచ్చేది కాదు. తన చేతులతో తాను ప్రవేశపెట్టి, తాను అంత ఖచ్చితంగా సమర్థించిన పథకాలను ఆయనే

ఎలా ఉపసంహరించుకో గలరు ? పథకా లను సవరించుకొనడమే మో తప్పనిసరి అని ఎప్పుడో తేలిపోయింది. అందుకే మొరార్జీ దేశాయిగారు పదవినుంచి తప్పుకున్నారా ?

అసలు కొందరు మంత్రులను తప్పించడానికీ, వారి విధానాలను సవరించడానికే కామరాజ్ పథకం వినియోగపడిందా ? కామరాజ్ పథకం ఆంతర్యం అదేనా? అనేది ఎప్పటికీ తేలని సమస్య. సీనియర్ మంత్రులు రాజీనామాలిచ్చి కాంగ్రెసు సేవ చేయాలని శ్రీ కామరాజ్ చేసిన ప్రతిపాదన సదుద్దేశంతోనే చేసింది కావచ్చు. కాని, అది ఆచరణలోకి వచ్చేసరికి దానిపై అనేకఅనుమానాలు కలిగిన మాట నిజం. ఈ ముక్కే శ్రీ ఎస్. కె. పాటిల్ పైకి అనేశారు. కొందరు మంత్రులను - ఇష్టం లేనివారిని - తొలగించడానికి కామరాజ్ పథకం ఉపయోగపడిందని ఆయన వాపోయారు. దీనికి దాఖలాగా శ్రీ మురార్జి తప్పుకోగానే, ఆయన విధానాలను శ్రీ కృష్ణమాచారి సవరించడం జరిగింది.

ఇంతకీ, ఇది ప్రతిపక్షాల విజయమా ? ప్రజల విజయమా ? కావచ్చుగాని, అంతకంటె ఎక్కువగా శ్రీ టి.టి.కె. విజయమని కొందరంటున్నారు. ప్రజలలో తన పలుకుబడిని పెంచుకొనడానికి ఆయన కింతకంటె గొప్ప అవకాశం ఎలా లభిస్తుందీ ?

● ● ●

పాకిస్తాన్

ఇండో - పాకిస్తాన్ సంబంధాలు ఈ మధ్య మరింత చెడిపోయాయి. ఢిల్లీలోని పాకిస్తాన్ రాయబారకార్యాలయం సాగిస్తున్న గూఢచారి చర్యలు బయటపడ్డాయి. దానిలోని నలుగురు ఉద్యోగులను ఉపసంహరించుకోవలసిందిగా భారతప్రభుత్వం రావల్పిండిని కోరింది. పాకిస్తాన్ హైకమిషనర్ తన ప్రభుత్వాన్ని సంప్రతించడానికి కొంత వ్యవధి కావాలని కోరాడు. భారత ప్రభుత్వం మర్యాదకోసం సరేనన్నది. అరెస్టుచేసిన ముగ్గురు పాక్ ఉద్యోగస్తులను విడిచిపెట్టింది కూడా.

ఈలోగా, పాకిస్తాన్ ప్రభుత్వం కరాచీలోని ఇండియన్ హైకమీషన్ కూడా గూఢచారిచర్యలు చేస్తోందని ఆరోపించింది. మన ప్రభుత్వం వలెనే సరిగ్గా నలుగురు భారతీయ ఉద్యోగస్తులపై, సరిగ్గా మనం చేసిన ఆరోపణలవంటివే చేసింది. వారిని ఉపసంహరించుకో వలసిందని కోరింది.

మన ఉద్యోగస్తులు గూఢచారి చర్యలులను చాల కాలం నుంచే జరుపుతున్నారని పాకిస్తాన్ ఆరోపణ. అయితే సరిగ్గా మనం ఆరోపణచేసిన తరువాతే ఆ విషయం ఎందుకు బయటపెట్టిందో ? అంతకు ముందునుంచి ఎందుకు పూరుకుందో ? కేవలం అది చర్యకు ప్రతిచర్యగా చేసిన

● జ్యోతిష్కుడు : "మీకు నల ఏళ్ళు వచ్చేవరకూ సిరిసంపదలు, సుఖశాంతులు ఏమీ వున్నట్టు కన్పించడంలా."

ఆసామి : "పోనీ, ఆ తరవాతైనా........"


జ్యోతిష్కుడు : "ఆ తరవాత అవి లేకపోవడం ఎలాగూ మీకు అలవాటై పోతుంది."

—ఎమ్. సుశీల. విశాఖపట్నం.

పనేనని తెలిసిపోతున్నది. దాన్ని ఎవరైనా నమ్ముతారా. నమ్మరా అనే భయం పాకిస్తాన్‌కు లేదు. ఎవరునమ్మినా నమ్మకపోయినా, తన ప్రజలు నమ్ముతారు; నమ్మినట్టు నటిస్తారు. అది చాలు, పాకిస్తాన్‌కు ఇండియాపై దెబ్బతీయడానికి.

అంతేకాదు. మరొకపక్క పాకిస్తాన్, కాశ్మీర్‌లోను, అస్సాం, త్రిపుర సరిహద్దులలోను భారీఎత్తున సైన్యాలనుసమీకరిస్తోంది. యుద్ధ సన్నాహాలు చేస్తున్నది. ఇందులో కూడా దాని "ఒరిజినాలిటీ" కనిపించడం లేదు. చైనాను అనుకరిస్తున్నది. చైనాకూడా ఉత్తరపు సరిహద్దులలో సైనిక సన్నాహాలు చేస్తోందికదా. వాటికి తానుకూడా మద్దతు ఇవ్వాలిగదా. చైనా ఏ క్షణంలో ఇండియాపై దాడి చేస్తుందో. తానుకూడా సిద్ధంగావుండాలి గదా.

తన సైనిక సన్నాహాల రుచిని పాకిస్తాన్ చూపించకుండా వదల్లేదు. అస్సాం సరిహద్దులో ఇటీవల అయిదారు రోజులపాటు వరసగా మన గస్తీదళాలపై భారీ ఎత్తున కాల్పులు సాగించింది. అస్సాంలోని సరిహద్దు గ్రామాలు కొన్ని తమవేనని పాకిస్తాన్ ప్రభుత్వం బుకాయిస్తోంది. అదేదో చర్చల ద్వారా నిర్ణయించుకొందామంటే సరేననడమే గాని చర్చలకు రాదు. ఈలోగా కొన్ని నెలలుగా అడపా తడపా ఉభయసైన్యాల మధ్య సంఘర్షణలు జరగడం పరిపాటైపోయింది. కాని సెప్టెంబరు 15, 16 తారీఖులలో పాకిస్తాన్ చేసిన కాల్పులు మరీ దారుణంగా వున్నాయి. యుద్ధం ప్రారంభమవుతుందా అనే భ్రాంతిని కలిగించాయి. ప్రస్తుతానికి సద్దుమణిగినా, ఏ క్షణంలో ఏ అవాంతరాని



ఇటీవల కీర్తిశేషులైన
ఆంధ్ర కాంగ్రెసు నాయకుడు
శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు.

చైనా ఇండియా సిద్ధంగా వుండక తప్పని స్థితి ఏర్పడింది.

* * *

రష్యా, చైనా

రష్యా, చైనా సంబంధాలలో కొత్త పరిణామమేమీ రాలేదుగాని, పాత పరిణామమే మరింత విషమించింది. వాటి మధ్య వాగ్యుద్ధం తీవ్రమైంది. దాదాపు ఒకరినొకరు ప్రతికలద్వారానో, లేఖలద్వారానో, నాయకుల ప్రసంగాలద్వారానో దూషించుకోని రోజంటూ వుండడంలేదు. ఏమీ దాపరికం లేదు, మొహమాటం లేదు, బిడియంలేదు. తెగబడి తిట్టుకొనడమే. ఈరెండు మహాదేశాల అంతఃకలహం ప్రపంచానికి అత్యంత విస్మయకరంగా తయారైం.

కమ్యూనిజం విస్తరణ గురించిన సిద్ధాంత విభేదాల సమస్య ఏనాడో దాటిపోయింది. ఇప్పుడు రోజు రోజుకు ఒకకొత్త కలహకారణం బయటపడుతోంది. రష్యా చైనాకు ఆర్థికసహాయాన్ని ఉపసంహరించివేసింది. పైగా ఇండియావంటి అలీనదేశాలకు ఆర్థికసహాయం చేస్తోంది. తనకు అణ్వస్త్రాలివ్వవలసిందని చైనా నోరు తెరిచి అడిగినా రష్యా ఇవ్వలేదు. తనకు ఆయుధ సహాయం చెయ్యలేదు. పైగా ఇండియాకు మిలిటరీ సహాయం (?) చేస్తోంది. ఇంకా ఇలాంటివే ఎన్నో కారణాలు.


అన్నిటికంటె పెద్ద కారణం ఇటీవల బయటపడింది. సింకియాంగ్ రాష్ట్రంలో అల్పసంఖ్యాకులైన ముస్లిములు, తదితర జాతులవారు పెకింగ్ దమననీతిని భరించలేక తిరుగుబాటు చేశారు. చాల మంది తిండి కొరతను భరించలేక సరిహద్దు దాటి సోవియట్ యూనియన్‌లోకి పారిపోయారు. అలా పారిపోయివచ్చిన కొన్ని వేలమందిని రష్యా ఆదరించింది. ఇది చైనాకు హృదయకంటకమైంది. తన దేశంలో రష్యా తిరుగుబాటులను రెచ్చగొడుతోందని ఆరోపించింది.

అంతేకాదు: రష్యాతో సరిహద్దుతగాదాను కూడా రేకెత్తిస్తోంది. ఎప్పుడో జారిస్టు కాలంలో, గత శతాబ్దంలో జరిగిపోయిన సరిహద్దు సర్దుబాట్లను ఇప్పుడు తిరగదోడాలంటోంది. తాను బలహీనంగావున్న కాలంలో జరిగిన ఒడంబడికలను ఇప్పుడు సవరించాల్సిందేనని వాదిస్తోంది. ఈ వాదన ఫలితంగా రష్యన్-చైనీస్ సైన్యాలమధ్య కొన్ని సంఘర్షణలుకూడా జరిగినట్టు కొన్ని వార్తలు బయటపడ్డాయి.

చైనా సరిహద్దు వివాదాలను ఎలా రేకెత్తిస్తుందో ప్రపంచానికి తెలియనిది కాదు. ఇండియాపై దాని దురాక్రమణ సందర్భంలోనే దాని స్వభావం తెలిసిపోయింది.

అందుచేత సోవియెట్ యూనియన్ చైనా వాదనలను నిర్మొహమాటంగా తిరస్కరించింది. "దెబ్బకు దెబ్బతీస్తాము, జాగ్రత అని" "ప్రావ్దా" పత్రిక హెచ్చరించింది. ఇండియాపై జరిపిన దురాక్రమణ ప్రసక్తితెచ్చి చైనా నిజస్వరూపాన్ని బయటపెట్టింది.

"ప్రావ్దా" వాదన స్థూలంగా ఇది: ఇండియా శాంతికాముక దేశం. దానితో చైనాకు సరిహద్దు వివాదం వస్తే వచ్చివుండవచ్చు. కాని దాన్ని శాంతియుతంగా పరిష్కరించుకోవచ్చుగదా. తాను సోషలిస్టుదేశాన్నని చెప్పుకుంటూ కూడా చైనా ఇండియాపై ఎలా దాడిచేసింది? అది తప్పుకాదా? దీనివల్ల మొత్తం సోషలిష్టు దేశాల నైతికస్థాయినే చైనా దించివేసినట్టు, సామ్రాజ్యవాద దేశాలకు దుష్ప్రచారానికి మరొక పాయింటు అందించినట్టు కాలేదా? ఆఫ్రో - ఆసియన్ దేశాలలో గందరగోళం సృష్టించినట్టు కాలేదా? కొలంబో ప్రతిపాదనలను ఇండియా పూర్తిగా, మినహాయింపులు లేకుండా ఆమోదించగా, చైనా "సూత్రప్రాయంగా" ఆమోదిస్తున్నానని మాత్రమే ప్రకటించింది. "చాలా మంచి ప్రతిపాదనలు" అంటూ ఆఫ్రో - ఆసియన్ రాజ్యాల కృషిని మెచ్చుకుంటూనే వాటిని తిరస్కరించింది. ఇదిమోసం, వంచనకాక మరేమిటి?



ఆగస్టు 28 వ తేదీన అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో వాషింగ్టన్ మాన్యుమెంట్ వద్ద చేరిన రెండు లక్షలమంది నీగ్రో ప్రదర్శకులు.

పైగా కొలంబో రాజ్యాలు చైనా సేనలను మాత్రమే వెనక్కి ఉపసంహరించుకోమని చెప్పడంలో ఉద్దేశమేమిటి? దురాక్రమణ చేసింది చైనా అనే కాదా?

ఇంత సూటిగా చైనాకు రష్యా ప్రశ్నలు వేయడం, ఇంత దాహటంగా దాని చర్యలను ఖండించడం ఇండియాకు హర్షకారణమే. ...మన విధానాలకు, వాదనకు ఘన విజయమే. చైనాకు కమ్యూనిస్టు దేశమైన రష్యానుంచి ఈ చెంపపెట్టు తగలడం మన వాదనలోని నిజాన్నే సమర్థిస్తున్నది. ఇంతవరకు చైనాపట్ల లోలోపల సానుభూతి చూపుతున్న కొన్ని ఆఫ్రో ఆసియన్ దేశాలకు, చైనా చర్యను ఖండించలేకపోయిన వాటికి కూడా ఇది కనువిప్పు కాగలదు.

నీగ్రో యాత్ర

అమెరికాలో నూరేళ్ళ కిందట ప్రారంభమైన అంతర్యుద్ధం ఇంకా పూర్తి కాలేదని ఒక నానుడి వుంది. 1863 లో అబ్రహాం లింకన్ నీగ్రోలకు బానిసతనంనుంచి విముక్తి ప్రసాదించాడు. దాన్ని దక్షిణ రాష్ట్రాలవారు ప్రతిఘటించారు. తత్ఫలితంగా అంతర్యుద్ధం జరిగింది. ఈ "అంతర్యుద్ధం" ఈ వంద సంవత్సరాలుగానూ సాగుతూనే వుంది. నీగ్రోలకు బానిసతనం తొలగిపోయినా, స్వేచ్ఛ మాత్రం లభించలేదు. వారికి లభించిన స్వేచ్ఛ చాలా పరిమితమైంది. చాలా దక్షిణ రాష్ట్రాలలో, వారికి తెల్లవారితో సమానమైన రాజకీయపు హక్కులు లేవు. తెల్లవారి బస్సులలో, థియేటర్లలో, హోటళ్ళలో, అంగళ్ళలో, స్కూళ్ళలో, యూనివర్శిటీలలో, ఉద్యోగాలలో వారికి ప్రవేశంలేదు. దక్షిణ రాష్ట్రాలలోనే కాదు, ఈ పరిస్థితి అమెరికాఅంతటా కొద్ది హెచ్చు తగ్గులతో వున్నదే.

నీగ్రోలలో క్రమంగా చైతన్యం వస్తున్నది. తమ దుర్భర పరిస్థితులనుంచి విముక్తి సాధించడానికి వారు ఉద్యమం ప్రారంభించారు. ఈ ఉద్యమం మార్టిన్ లూథర్ కింగ్ వంటి నీగ్రో మతాధికారుల నాయకత్వాన శాంతియుతంగా జరుగుతున్నది. గాంధీమహాత్ముని సత్యాగ్రహ పద్ధతిలో సాగుతున్నది. నిరాయుధులు, అల్పసంఖ్యాకులు అయిన నీగ్రోలకు అంతకంటె వేరే మార్గంలేదు. శ్వేతజాతీయులలో హృదయ పరివర్తన కలిగించడంద్వారానే వారు తమ హక్కులను సాధించుకోవలె తప్పదు. కెనెడీ ప్రభుత్వం, సుప్రీంకోర్టు వారిపట్ల సానుభూతితోనే ప్రవర్తిస్తున్నాయి. వీలైనప్పుడల్లా, శాసనాలద్వారా నీగ్రోల హక్కులను సంరక్షిస్తూ కొత్త హక్కులను సాధిస్తూనే వున్నాయి. కాని, అది నెమ్మదిగా జరిగేపని. అందుచేతనే నీగ్రోలు కోర్టులద్వారా జరిగే అభివృద్ధితో తృప్తిపడక శాంతియుతమైన ప్రత్యక్ష చర్యలకు దిగుతున్నారు.

అగస్టు 28 వ తేదీన వాషింగ్టన్‌లో జరిగిన "నీగ్రో మార్చ్" చరిత్రాత్మకమైంది. నీగ్రో ఉద్యమం ఆ యాత్రతో పరాకాష్ఠను, పతాకస్థాయిని చేరుకుంది. దేశం నలుమూలల నుంచి వేనవేలు నీగ్రో స్త్రీ, పురుషులు వాషింగ్టన్ చేరుకున్నారు. రెండు లక్షల మంది నీగ్రోలు స్వాతంత్ర్య గీతాలు పాడుతూ, నినాదాలుచేస్తూ లింకన్ స్మారక చిహ్నంవద్ద సమావేశమయ్యారు. శతాబ్దాల తరబడి బానిసలుగా, రెండవ తరగతి పౌరులుగా బ్రతుకుతూ తమ నికృష్ట జీవితంపై వారు చేసిన శాంతియుతమైన తిరుగుబాటు, స్వేచ్ఛకోసం వారి ఆవేదన, తపన, తపస్సు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినవి. వారి ఆవేదన ఎన్నటికీ వృథా పోదు, పోరాదు. ▢▢▢

● యజమాని : ఒరేయ్, మనింట్లో దొంగలుపడితే ఏం చేస్తావురా !

నౌకరు : కిటికీలోంచి దూకి పారిపోతానండి.

—గవ్వా కన్నారావు, కాకినాడ.

కాయిదా ఖాతాఖానా

పాఠక మహాశయులారా !

అచ్చాణీ ముత్యాలవంటి మహానిభావులు మాటలాడుతున్నప్పుడు రత్నాలవంటి సుభాషితాలు జారిపడతాయి. కొందరు డ్రామట్విస్టులు వీటిని తమ నాటకేల సంగ్రహించారు. (సంస్కృతంలో వికారుని శకారాలూ, ఇంగ్లీషులో మాలప్రోపమ్మ తికమక మాటలూ ఇటువంటివే). డాక్టరు స్పూనరు అనే తెలివి ఎక్కువ ఆసామి రోలు తిరగక ఇక్కడి మాటలు అక్కడ నొక్కి వక్కాణిస్తాడు. ఏవంవిధమైన మహా పాత్రల కొలచుకొని ఈసారి తచ్చు అప్పులు నివేధిస్తాను.

క్రూరమృగాల స్వభావాలు కొంతమంది మనుజాలలో కనబడతాయి.

చంద్రుని భార్యలు చిక్కని చుక్కలు. అధికార కామరాజులను పదవీ త్యాగరాజులను చేసే పథకం కాంగ్రెసు పెద్దగుర్రానికి నాడాల ప్లాను.

తెల్లనివన్నీ పేలు కావు.

దండగారణ్యం రామాయణంలో పీడకల పేట.

పేదవాడి కోపం పదవికి చేటు అని ప్రజాసామ్యంలో మంత్రులు గుర్తిస్తారు.

చిత్రగించవలెను.
భవదీనుడు
పూర్ రీడరు.

రాజధాని కైఫీయత్

"మా పూర్వీకులు మీకు 'రామ రాజ్యాన్నిస్తామన్నారు; ఇచ్చినా, ఇవ్వక పోయినా ఇప్పుడు మీకు 'కామరాజ్యాన్ని' ఇస్తున్నాం...." అన్నాడొక కాంగ్రెసు పెద్ద మనిషి, రాజధానిలో కామరాజ్ ప్లాన్‌మీద ఛలోక్తి వేస్తూ —

రాజధానిలో రాజకీయానికి టైఫాయిడ్ జ్వరం పట్టుకుంది. టెంపరేచర్ హెచ్చు స్థాయిలో స్తిమితంగా నిలబడింది. అంతా అస్తవ్యస్తం. గత మాసం కైఫీయత్ రాసిన నాటికి, నేటికి "రాజకీయ కైఫీయత్"లో యెటువంటి కదలిక లేదు. "అమావాస్య, పున్నమికి," రోగలక్షణాలు కాస్తంత ముదురుతూ మాత్రం వున్నాయి.

● ●

కామరాజ్ ఫార్ములా ప్రకారం, పార్టీ కోసం బయటకు వచ్చిన వాళ్ళే "కాకలు తీరిన" వాళ్లయితే, లోపలున్న వాళ్ళంతా "కాకలు తీరనివాళ్ళ, లేని వాళ్ళ" అనా అర్థం? అని వెఱ్ఱి ప్రశ్న వేశాడు ఒక గడుగ్గాయి.

"అదికాదు గడుగ్గాయీ! ఆ ఫార్ములా ఇప్పుడు రివర్సుగేర్‌లో పనిచేస్తోంది. ఎంతో కాకలు తీరిన వాళ్ళే లోపలుండి పోగలగడానికి మేనేజ్ చేసుకో గలుగుతున్నారు." అంటూన్నాడు — ఆ పక్కనున్న "రాజకీయ పరిశీలకుడు" గల గల నవ్వుతూ.

గురజాడఅప్పారావు గారొక కథరాశారు- "మీపేరేమిటి?..."

'మనుషులు చేసిన దేముళ్ళారా! దేముడు చేసిన మనుషుల్లారా, మీపేరేమిటి....?"

కథలో, వీరశైవులంతా నిప్పులు తొక్కుతుంటే, అది చూసి రావినాయుడు వాళ్ళ వైపే మొగ్గితే, పెరుమాళ్ళకు పులిహోరా ఇచ్చేదాత లెవరూ వుండరని, సాతాని మన వాళ్ళయ్య వుక్రోషం పట్టలేక, శ్రీవైష్ణవాచార్యుల వారిని కూడా నిప్పుల్లోకి దూకమంటాడు.

రివర్సు గేర్‌లో పనిచేస్తున్న కామరాజ్ పథకాన్ని చూస్తుంటే .. కొండొకచో మీ పేరేమిటని నాకూ అడగాలనిపిస్తోంది.

● ● ●

"లక్కీమాన్" సంజీవయ్య యిటీవల ఆంధ్రరాజధానికి వచ్చారు. పెళ్ళికొడుకు కావడానికి అన్ని క్వాలిఫికేషన్స్ ఆయన కున్నాయి. "నేను కానప్పుడు నువ్వు మాత్రం యెందుకు కావాలి...." అనే మీమాంసమీద, ఇద్దరూ కలిసి, ఢిల్లీలో మళ్ళీ సంజీవయ్యనే పెళ్ళికొడుకును చేస్తారట. మాసిపోయి, పాత బడిపోతున్న ఆ "కాంగ్రెస్ కోటు"నే మరిన్ని మాసికలు వేసి ఆయనకు తొడుగుతారని యిక్కడ ప్రతిధ్వనులు.

ఆయన అక్కడ అందరికీ ఇష్టుడు. ఎందుకంటే - ఆయన యెవరి తీగెలు

[illegible]. ఎవరి డొంకలు కదల్చరు. కాని ఆట తీగెలను కదల్చకుండా మాత్రం వూరు [illegible].

రక్షణమంత్రి చవాన్ రాజధానికిరావటం- రాజకీయ రాయబారాలు....సరిచేసి,ఆట,మళ్లీ ప్రారంభం....

దీనికి తోడు మరొకటి.

హైదరాబాదు కార్పొరేషన్‌లో వున్న అరవైఆరుగురు కాంగ్రెసు సభ్యులలోనూ, ముగ్గురు మంత్రులు నాలుగోమాజీమంత్రితో కలిసి నాలుగు గ్రూపులు కట్టుకున్నారు. నాలుగు స్తంభాలాటాడుకుంటున్నారు. ఆట, మొన్న శ్రుతిమించి రాగచ్ఛాయలు సంతరించుకుంటే పి. సీ. సీ. కళ్ళెఱ్ఱచేసింది — 'కాంగ్రెసు'కు పోటీ కాంగ్రెస్.

సంజీవయ్యగారు లాగడానికి మరో తీగె దొరికింది.

'లక్కీమాన్' సంజీవయ్య!

● ● ●

"మిస్టర్ సంజీవరెడ్డికి, గ్రీన్‌లాండ్స్‌లోని మినిస్టర్ సంజీవరెడ్డికి అంతరం యెంత? ..."

అన్నారు శ్రీ గో. రా. సత్యాగ్రహం చేశారాయన.

గ్రీన్‌లాండ్స్ ఆడంబరాలనుంచి ఆ మిస్టర్‌ను తప్పించాలి.

"మీ ఆలోచనలు నాకు తెలుసు. లోపలికి రండి. భోంచేసి మాట్లాడుకుందాం ..." 'గ్రీన్‌లాండ్'లోంచి పిలుపు —

"ఆ పిలుస్తోంది 'మిస్టర్ సంజీవరెడ్డే.' పాపం వెళ్లి భోంచేద్దాం" అంటూ శ్రీ గోరా లోపలకు వెడుతుంటే....

"అయ్యో గ్రీన్‌లాండ్స్‌లోకే వెళ్ళేది; చేసిందానికి, చేస్తున్నదానికి పొత్తు పొసగడం



ఇటీవల కీర్తిశేషులైన ప్రముఖ రంగస్థలనటుడు, చలనచిత్ర దర్శకుడు డాక్టర్ జి. రాజారావు.

లేదు...." అంటూ సత్యాగ్రహికి ప్రతి సత్యాగ్రహం చేశారు ఆ పక్కనున్నవాళ్లు.

మినిస్టర్ సంజీవరెడ్డి చాలా గడసరిసుమా! అనుకున్నాడు వీథి మానిసి రాజధానిలో.

● ● ●

"కురుక్షేత్రా"నికి ముసలితనం వచ్చిందట - ఇప్పటిదా మరి, లక్ష ప్రదర్శనలు పైనే పడ్డాయి. ధర్మరాజు, అర్జునుడు మరీ ముసలివాళ్లైపోయారు. అయినా, పాపం వాళ్లకు పద్యాలు పాడి, "చెల్లియొ, చెల్లకో" అంటూంటే వింటూ యుద్ధాలు చెయ్యడం ఉండటం తప్పటల్లేదు — మొన్న ఆ కురుక్షేత్రం రాజధానిలో "రవీంద్ర భారతి"లో వేస్తే, పద్యాలు పాడి యుద్ధంచేసే ముసలి అర్జునుడికి దగ్గు తెరొచ్చింది. "వన్స్ మోర్" తాకిడీ తట్టుకోలేక, ధర్మరాజు మగతగా (వయోభారంచే) కునికిపాట్లు తీశాడు.

—అనంతం.

కవితామయమే అన్నీ....

ఏమున్నది రాసేందు కివాళా
ఖావాలే తీశాయి దివాలా
ఏవి స్పృశింపని క్రొత్త సంగతులు ?!
ఏమి మిగిల్చిరి మన దివంగతులు ?!
వీరగాధలా . . . తత్త్వబోధలా . .
లైలా మజ్నూ ప్రేమ బాధలా . .
ఏమున్నవి రాసేందు కివాళా
నన్నయ భట్టూ . . చిన్నయసూరీ . .
అన్నమాచార్యు లెవరైతేనేం
అంతా ఔట్ ఆఫ్ డేట్
బజార్ల నిండా క్రోటన్ పువ్వులు
నమస్కరించే సిగ్నల్ రెక్కలు
సినిమా పోజులు సిగరెట్ టిన్నులు
బ్రాందీ పెగ్గులు గాంధీ సూక్తులు
గాలి జాడలూ పేకమేడలూ
గోల్డుఫ్లేక్‌లో ఛార్మీనారూ
వృద్ధ యువకులూ యువక వృద్ధులూ
ముసుగుల్లో వినిపించే సుద్దులు
అన్నీ కవితామయమే నంటాం
మహాకవుల ప్రోక్తంబులు వింటాం
శూన్యంతో శూన్యాన్ని ముడేస్తాం
శూన్యానికి గ్రంథాలు రచిస్తాం
టీకా టిప్పణి కావాలంటే
శ్రీ శ్రీ గార్కి సిఫారసు చేస్తాం
మనిషి పారడీ కవిత గారడీ
శీతల యుద్ధం బ్రతుకు బీ - రెడీ

— "కమ్మిశెట్టి"

మచ్ఛర చంద్ర

శరత్‌బాబు మేనమామ పేరు విద్యాదాసు గంగోపాధ్యాయ! ఆయన వ్యాకరణ శాస్త్రంలో మహా పండితుడట! ఒక పర్యాయం ఈయన కలకత్తా నుంచి భాగల్‌పూర్‌లోవున్న శరత్‌బాబుకు ఒక ఉత్తరం రాశాడట! చిరునామా కొంచెం త్వరగా వ్రాయడం వలన "శ్రీమత్" "శరచ్చంద్ర" రెండూ కలిసిపోయాయట!

ఆ పేరును పోస్టుమాన్ 'శ్రీ మచ్ఛరచంద్ర చట్టోపాధ్యాయ' అని చదువుకున్నాడు. "మచ్ఛర "అంటే దోమ అని అర్థం! పోస్టుమాన్ ఆ ఉత్తరం పుచ్చుకొని ఆ పట్నంలోని వాళ్ళందరినీ అడిగాడు – 'అయ్యా, ఇక్కడెవరైనా మచ్ఛర్ చంద్రబాబు వున్నాడా' అని, కాని ఎవరూ చెప్పలేదు.

అనుకోకుండా ఆ పోస్టుమాన్‌కు శరత్‌బాబు కన్పించాడట! పోస్టుమాన్ మరల అదేప్రశ్న వేశాడు – 'ఇక్కడెవరైనా మచ్ఛరచంద్రబాబు వున్నారా' అని!

"మచ్ఛరచంద్రబాబా? ఇదేం పేరోయ్! .... మనుష్యులు దోమల పేర్లూ, ఈగల పేర్లుకూడా పెట్టుకుంటారని నా కీ రోజు తెలిసింది! అటువంటి దోమగారెవరూ ఈపేటలో లేరయ్యా! అవతలపేటలో ఎవరైనా వున్నారేమో తెలుసుకో!' అని శరత్‌బాబు చెప్పి ముందుకు సాగాడు.

"ఈ వుత్తరం ఎవరో బెంగాలీబాబు దనుకుంటానండి!" అని పోస్టుమాన్ ముందుకు సాగాడు!


శరత్‌బాబు పోస్టుమాన్‌ను వెనక్కి పిలిచి – "ఏది ఆ వుత్తరం ఒకసారి చూపించు :" అని అన్నాడు.

"అరెరె! ఈ వుత్తరం నాదేనయ్యా!' అని అన్నాడు శరత్‌బాబు కొంచెం సిగ్గుపడుతూ!

"ఓహో: మచ్ఛరచంద్ర చట్టోపాధ్యాయ మీరేనన్నమాట! మరి ఇంతకుముందు చూసి ఎవరోతెలియదన్నారుగా!' అని అన్నాడు పోస్టుమాన్!

"వ్యాకరణానికి సంబంధించిన గొడవతో – నాపేరుకాస్తా అలా మారిపోయిందిలేవయ్యా!" అని శరత్‌బాబు ఆ వుత్తరం చించాడు చదువుకొనడానికి!

— శ్రీధర్



కాసిన వెన్నెల


వరసగా వారం రోజులు ప్రాణం విసిగేట్లు ఆఫీసులో పనిచేసిన సీతారామయ్య ఆదివారం అంటే స్కూలు విద్యార్థిలాగ ఎగిరి గంతులేస్తాడు. అందులో ఆ ఆదివారంనాడు ఏదైనా వుల్లాసకరమైన చిత్రం చూడటంగాని, ఉత్తమగ్రంథం చదవటంగాని జరిగితే ఏదో నూతన శక్తితో వచ్చేవారం అంతా గడిపి వెయ్యకల్గుతాడు.

సీతారామయ్యని మీరు ఎక్కడోఅక్కడ చూసేవుంటారు. ఒతి సాదాబట్టలు వేసుకుంటాడు. పత్రికలు అమ్మే దుకాణం ముందు ఆగి, పత్రిక కొనేముందు అన్ని పత్రికలహెడ్‌లైన్సు ఒకసారిచూసి కొంచెం ఆలోచించి, ఆఖరికి ఎక్కువ పేజీలున్న పత్రికే ఆరోజున కొంటూవుంటాడు. ఎంత వర్షంవచ్చినా, ఎండకాసినా చేతిలో గొడుగు వుండదు. జేబురుమాలుతోనో న్యూస్‌పేపర్ తోనో పని గడుపుకోగల్గ సమర్థుడు. ఒకపక్కన 'హీల్' అరిగిపోగా, మళ్ళీ 'హీల్' వేయిస్తే, అది మళ్ళీ అరిగితే, యింకా మళ్ళీ 'హీల్' వేయించనని ప్రతిజ్ఞ పట్టి, ఎంత ఎండాకాలంలోనైనా ఆ అరిగిన చెప్పులతోనే కాలాన్ని దొర్లించగల ప్రతిభావంతుడు. పొద్దున్నే ఇంట్లో కాఫీ తాగి, పత్రికకోసం బయటికివచ్చి, ఆకలివేసినా పెయ్యకపోయినా, కాఫీహోటలు కన్పిస్తే

'శివారం'

గాపలదూరి. దాగుండదని ఓ జత యిక్లీ-తిని కాఫీ తాగి బయటపడే నిసలైన ఆంధ్రుడు. హోటల్‌లోనుంచి బయటికి రాగానే, నోరు దాగుండలేదని ఓ అర్దణా పెట్టి వక్కపొడి కొనుక్కుని, మరంత డబ్బుతో ఓ సిగరెట్ కొనుక్కుని, పొగవదుల్తూ రోడ్డు మీది విచిత్రాలు చూసుకుంటూ, తనలో తనే నవ్వుకుంటూ పోతూంటాడు. సీతారామయ్యని పోలీసులు పేవ్‌మెంట్ మీదకి నడవమని బెదిరిస్తారు. పేవ్‌మెంట్ మీది 'హాకర్సు' కిందకి పొమ్మని నిందిస్తారు, రోడ్డుమీద రిక్షావాళ్ళు కళ్ళు తెరుచుకుని నడవమని శాసిస్తారు. లారీలవాళ్ళు అతన్ని దూసుకుని పోతుంటారు, కార్లవాళ్లు బురద చిమ్ముకుంటూ పోతారు, లెప్పర్స్, ఇతర 'బెగ్గర్స్' పైసాయే రాల్చేడని తిట్టుకుంటారు. ఇప్పటికైనా గుర్తుపడితే శుభం! కథ ప్రారంభిద్దాం.

ఆ ఆదివారం సీతారామయ్య ఒక మిత్రుడి కోసం, చూసిచూసి విసుగెత్తి, యింక కాలాతీతం అవుతుందని సినిమాకి బయలుదేరాడు. బయలుదేరేడన్న మాటేగాని లోపల మిత్రుడు రాలేదే అని విచారంగానే వుంది కాని ఏంచేస్తాడు. ఆలస్యంచేస్తే టికెట్లు కూడా దొరకవు. అప్పటికే అయిదున్నర దాటింది. హడావిడిగా ఇంట్లోంచి బయటికొచ్చి అటూయిటూ చూసేడు. ఎక్కడా ఒక రిక్షా అయినాలేదు. మరో నాలుగు అడుగులు వేసి అటుయిటు చూసేడు. స్టేషను నుంచి వచ్చే జనం సామాన్లు తమ నెత్తిన పెట్టుకునో, కూలీల నెత్తినపెట్టో పాదయాత్ర చేస్తున్నారు. ఏమిటి సంగతని విచారించాడు. ఆ దినం ఆగస్టు 15 గనక రిక్షాలు నడవవు,



అని చెప్పేరు. సీతారామయ్య స్వాతంత్ర్య ఉత్సవ సందర్భంలో ఆంధ్రుల అకుంఠిత దేశభక్తికి మురిసిపోతూ త్వర త్వరగా పాదయాత్ర సాగించి సినిమాహాలుకు చేరుకున్నాడు.

సినిమాహాలుకు చేరుకున్న సీతారామయ్య అక్కడి దృశ్యాన్ని చూసి తన కళ్ళను తానే నమ్మలేక పోయేడు. రూపాయి కౌంటర్‌వద్ద వుండే క్యూ రోడ్డు మీద S ఆకారంలో ట్రాఫిక్‌ను ఆపేసే స్థితిలోవుంది. టైంచూచుకున్నాడు. టైం ఆరు అవుతోంది. ఇంకో అరగంటలో ఆట మొదలుపెడతారు. ఆకాశంవంక చూసేడు. మబ్బులు నల్లగా ముసురుకుని వస్తున్నాయి నలుమూలల్నుంచి. చల్లటిగాలి జివ్వున వేస్తోంది. కాస్సేపట్లో వర్షం తప్పదు. అట్టే ఆలోచనతో టైం వృథా చెయ్యక 1.50 కౌంటర్ వద్దకి వెళ్ళాడు. అక్కడ 15.20 మంది మాత్రం వుంటారు. పోలేపోయింది. అనుకుంటూ 1.50 క్యూలో నిలబడ్డాడు సీతారామయ్య. వెంటనే తన తాహతుకి 1.50 టికెట్ ఏమిటి అనుకున్నాడు. ఇవ్వాళ 1.00 టికెట్ యింపాసిబుల్. ఇంటికి వెళ్ళిపోవలసిందే. సినిమా మంచిదికనుక రేపు అయినా తిరిగివచ్చి చూడాలి. రేపు వస్తే రిక్షాలు వుంటాయి.రానుపోను అర్ధరూపాయి అయినా యివ్వాలి. అది యివ్వాళ రిక్షాకి యిచ్చేననుకుని 1.50 కొనుక్కుంటే ఏం? అని సరిపెట్టుకున్నాడు మనస్సుని. పైగా తన కంటే తక్కువజీతం సంపాదిస్తున్న గుమాస్తాల మొహాలు 1.00 క్యూలో వుండటం చూసేడు. వాళ్ళే 1.00 కి రాగా, తను యీ వక్కసారికే 1.50 కి వెళ్తే ఏం? అనుకున్నాడు. వెనక్కి చూసేడు. తనవెనక ఎవరైనా వున్నారేమోనని. అప్పటి కప్పుడే తన వెనక హైస్కూల్ హెడ్‌మేష్టర్ చేరాడు. ఆయన వెనక యింకో పాతిక మంది చకచకా మిలిటరీ సిపాయిల్లా లైనులో నిలబడి పోతున్నారు. తను ఒక్క ఐదు నిమిషాలుముందు రాబట్టి సరిపోయింది గాని, లేకపోతే ఆ పాతికమందికి వెనక నిలబడవలసి వచ్చేవాడు. ఇప్పుడు తనకి గ్యారంటీగా టికెట్ దొరికి తీరుతుంది అనే ఆలోచన ఎక్కడలేని వుత్సాహాన్ని యిచ్చింది. సినిమాహాలు గడియారం ఆరు గంటలు కొట్టింది. టిక్కెట్లు యివ్వడం ప్రారంభించేరు. కౌంటర్‌లోని పెద్దమనిషి. నిలబడ్డ జనం మొహాల్లో ఏదో చిన్న సంతోష రేఖ!

కదలవలసినంత త్వరత్వరగా క్యూలోని జనం కదలడంలేదు. ఏమిటా యింత ఆలస్యం అనుకుంటూ సీతారామయ్య సిగరెట్ వకటి ముట్టిస్తూండగా రెండు చినుకులు మొహంమీద వచ్చిపడ్డాయి. మరోక్షణంలో చినుకులు త్వర త్వరగా పడుతూ వానగా మారిపోయింది. క్యూలోని జనం ముందు

● అమావాస్య అర్ధరాత్రివేళ మర్రిచెట్టుమీద కూర్చున్న ఒక దయ్యం ఇంకోదాన్ని అడుగుతోంది :

"అసలు మనుషులనేవాళ్ళు వున్నారంటావా?"

—ఎమ్. సుశీల, విశాఖపట్నం.

వాళ్ళు ఎవ్వరూ చలించలేదు. సీతారామయ్య కూడా చలించక జేబులోని చేతిరుమాలు తీసి తలపై కప్పుకున్నాడు. ఫిరంగి గుండ్లువచ్చి మీద పడుతున్నా కదలని సిపాయిలా, అట్లాగే నిలబడ్డాడు. 'క్యూ' బహునెమ్మదిగా కదులుతోంది. సీతారామయ్య అంత వానలోనూ సిగరెట్‌కి చేతిని అడ్డుపెట్టుకుని, నెమ్మదిగా వక దమ్ములాగి, పొగ వదుల్తూ వెనక్కి చూసేడు. వెనకాల తనిందాక చూసిన హెడ్మాష్టర్ లేడు. ఆ స్థానంలో ఎవరో షాహుకార్ గారున్నారు. వారి వెనకాల ఎవరో విద్యార్థి వున్నాడు. పక్కనే వున్న వరండావైపు చూసేడు సీతారామయ్య కుతూహలంగా. అక్కడ వంటరిగా నిలబడి వున్నాడు హెడ్మాష్టర్‌గారు. పాపం వానకి భయపడినట్లున్నారు అనుకున్నాడు సీతారామయ్య. తనెట్లాగా వానలో తడుస్తూ నిలబడ్డాడుకనక ఆయనకి తెస్తేనేం అన్పించింది అతనిలోని మంచితనానికి.

హెడ్మాష్టర్ అటు యిటు దిక్కులు చూస్తున్నాడు. తనవైపు చూస్తే పర్వాలే. తనే అడుగుతాడు. క్యూ కొంచెం కదలింది ముందుకు. సీతారామయ్య ఒక దమ్ములాగి, ముందుకి రెండడుగులు వేసి, పేంట్ జేబులో చెయ్యి పెట్టుకుని, వేళ్ళతో డబ్బుని పట్టుకున్నాడు. తనముందు యింకో అయిదారుగురు వున్నారు. కౌంటర్‌లో ఆయన ఏదో టిక్కెట్లపైన రాస్తున్నాడు. బహుశా సీట్లకి నంబర్లు యిచ్చినట్లున్నారు. చినుకులు వక్కసారిగా పడటం ఆగిపోయేయి. సీతారామయ్య హెడ్మాష్టర్‌వైపు చూసేడు. ఆయన బిక్కుబిక్కుమంటూ అట్లాగే వరండాలో నిలబడి వున్నాడు ఒక్కడూ! అందరి మొహాలు చూస్తున్నాడు. అడగడానికి బిడియపడ్తున్నట్లున్నాడు, అనుకున్నాడు సీతారామయ్య. "మీకెన్ని కావాలి?" అన్నాడు హెడ్మాష్టర్‌ని వుద్దేశించి సీతారామయ్య. ఒక్కటి అన్నట్లు చూపుడు వేలు చూపించేడు హెడ్మాష్టర్. "డబ్బిట్లా యివ్వండి తెస్తా." అన్నాడు సీతారామయ్య. హెడ్మాష్టర్ రెండు రూపాయల కాగితం యిచ్చేడు.

'క్యూ' కదిలింది సీతారామయ్య వంతు వచ్చింది. సీతారామయ్య సిగరెట్ అవతల పారేసి, డబ్బులిచ్చి రెండు టిక్కెట్లు తీసుకుని చూసుకున్నాడు. టిక్కెట్లపైన 34, 35 నంబర్లు వేసి వున్నాయి. ఒక టికెట్ హెడ్మాష్టర్‌కిచ్చి, ఆయనకి రావలసిన అర్ధరూపాయి ఆయనకి యిచ్చేడు సీతారామయ్య. హెడ్మాష్టర్ చిరునవ్వుతో 'థాంక్సు' అంటూ వాటిని తీసుకుని, వరండాలోవున్న రాబోయే చిత్రాల బొమ్మలు చూడసాగించేడు.

● "ఒక పెద్దనీగ్రో, చిన్ననీగ్రో కలిసి చేపలుపట్టడానికి నదికి వెళ్ళారు. చిన్ననీగ్రో పెద్దనీగ్రోకు కొడుకవుతాడు. కాని పెద్దనీగ్రో చిన్ననీగ్రోకు తండ్రి కాదు. మరి పెద్దనీగ్రో ఎవరో చెప్పు?"

"తెలియదు. ఎవరు?"

"పక్కపేజీ చూడు."

—సురేఖ, శ్రీకాకుళం

సీతారామయ్య టికెట్ నంబర్ చూసుకున్నాడు. తనకి 34 వచ్చింది. టికెట్‌ని జేబులోపెట్టుకుని క్యాంటీన్‌లో 'టీ' తాగి మరో సిగరెట్ తాగుతూ అక్కడున్న రాబోయే చిత్రాల బొమ్మలన్నీ చూసి, 1.50 సీట్లు మేడమీద వుండటంవల్ల మేడమీదకి వెళ్తుండగా, మిత్రుడి సంగతి గుర్తొచ్చింది. పైనుంచే ఓ సారి కిందజనాన్ని పరీక్షగా చూసి, అందులో తన మిత్రుడు లేకపోవడంతో చిన్న నిట్టూర్పు విడిచి సీతారామయ్య హాలులోకి వెళ్ళేడు.

ఇంకా ఆట మొదలెట్టడానికి 10 నిముషాలు వ్యవధివుంది. సీతారామయ్య వెళ్ళి తనసీట్‌లో తను కూర్చున్నాడు. తనప్రక్క సీట్‌లో హెడ్మాష్టరు అంతకు ముందే కూర్చుని వున్నాడు.

తనకి కుడివైపున వుండే కుర్చీలో ఎవరో బహుశా పి.యు.సి. విద్యార్థి అయ్యుంటాడు, కూర్చొనివున్నాడు. అతను రెండువైపులా బల్లలపైన చేతులు ఆన్చుకొని కూర్చున్నాడు. ఎడమవైపు కుర్చీలో వున్న హెడ్మాష్టర్ తను రాగానే తను అంతకుముందు కుడివైపున చేతులు ఆన్చుకున్న బల్లమీదనుంచి ఒకచేతిని తీసేసి, ఎడమచేతిని మాత్రం ఎడమచేతివైపునవున్న బల్లమీదే ఆన్చిఉంచాడు. సీతారామయ్యకి ఏ బల్లపైనా చేతులు ఆన్చకుండా కూర్చోడం అలవాటు. అంచేత ఎడంచేతి వైపున బల్ల ఖాళీగావున్నా దానిజోలికి పోలేదు. కుర్చీలో దర్జాగా ఆనుకుని చుట్టూరావున్న జనాన్ని పరిశీలించసాగేడు సీతారామయ్య.

'సినిమాకి స్త్రీలుకూడా బాగానే వచ్చేరు.... వాళ్ళు ఎప్పుడు ఎట్లా టిక్కెట్లు తీసుకున్నారో' అనుకున్నాడు సీతారామయ్య. మొదటివరసలోని స్త్రీలని చూసి, వెనక అంతా కాలేజీ విద్యార్థుల్లా వున్నారు - గోల గోల చేస్తున్నారు నవ్వులతో, హాస్యాలతో. ఆకస్మికంగా తనవంక ఎవరో నిశితంగా చూస్తున్నట్లు అన్పించి సీతారామయ్య అటుయిటు చూసేడు. హెడ్మాష్టర్ తనవంక అదేపనిగా చూస్తున్నాడు. తను చూడటం గమనించి ఆయన మొహం పక్కకి తిప్పుకున్నాడు. సీతారామయ్య కుర్చీలో ముందుకి జరిగి కూర్చుని రెండోవరసలో తనకి తెల్సిన మనుషులు ఎవరైనా వున్నారా అని ఏం తోచక పరిశీలించసాగేడు. హెడ్మాష్టర్ ఓరగా యింకా తనవైపు చూడటం కనిపెట్టాడు సీతారామయ్య. ఎందుకు చెప్మా తనని అట్లా చూస్తాడు అనుకున్నాడు సీతారామయ్య. కుర్చీలో మళ్ళీ వెనక్కి జేర్లబడ్డాడు సీతారామయ్య. టైం చూసుకున్నాడు. ఇంకో మూడు నిమిషాల్లో మొదలెడతారు ఆట. హెడ్మాష్టర్ ఓసారి తన మొహాన్ని పరిశీలనగా చూసి ఏదో ఆలోచించసాగేడు. సీతారామయ్య హెడ్మాష్టర్ మొహాన్ని, తలని, కళ్ళజోడుని, తొడుక్కున్న చొక్కాని చూసేడు; తనెందుకు ఆయన్ని చూడకూడదని. ఆయన తల నెరిసివుంది. తలమీద ఒత్తుగా లేవు ఆ నెరసిన వెంట్రుకలు. కళ్ళజోడు హనీ కలర్ ఫ్రేమ్, గ్లాసులు రీడింగ్‌వి. ముక్కు కోలగావుంది. కొంచెం తక్కువగా వుంటే అందంగా వుండేదేమో

" తల్లి "

గాని, ఎక్కువగా వుంది. శరీరం చామనఛాయ. చెవులో జుట్టుకూడా వుంది. తొడుక్కున్న చొక్కా పొడుగు చేతులది. - ఖద్దరుది. ఆ పొడుగుచేతుల చివర పాతరకం వాచీఒకటి కూడా కన్పిస్తుంది. పాంటు టిన్నీ డ్రిల్లు. ఆరోజే తీసింది కాదు. నలిగివుంది. కాళ్ళకి హవాయి రబ్బర్ చెప్పులు. బాటావిలాగే వున్నాయి. చెక్కవి కావు. ఇదీ ఆయన వేషం అనుకున్నాడు తనూ ఆయన్ని పరిశీలించేననే సంతృప్తితో. ఇంతలో హెడ్మాష్టర్ నుదుటిని కుడిచేత్తో రాసుకోసాగేడు కాస్సేపు. మరికాస్సేపు చేతివేళ్ళు పిసుక్కున్నాడు. మరికాస్సేపు చేతిగోళ్లు కొరుక్కున్నాడు. కుడివేలినున్న ఉంగరాన్ని బయటికి లాగి, మళ్ళీ వేలినిపెట్టి, మళ్ళీ లాగి, వేలికి పెట్టేసుకున్నాడు.

సీతారామయ్య ఇదికూడా గమనించేడు. ఏమిటి ఈయన బాధ అనుకున్నాడు. ఇంతలో లైట్లు ఆరేయి. సైడు రీల్సు ప్రారంభమయ్యేయి. సీతారామయ్య వుత్సాహంగా సైడ్ రీల్సు చూడసాగేడు. కాని మధ్యమధ్య సీతారామయ్యకి అన్పిస్తోనే వుంది. ప్రక్కనున్నాయన ఏదో 'అనీజీ'గా బాధపడ్తున్నాడని, చాలాసేపటివరకు ప్రక్క ఆయన వేళ్ళు నలుపుకుంటూనే వున్నాడు. నుదురు రాసుకుంటూనే వున్నాడు. కాలిజోడుతో నేలను తన్నుతూనే వున్నాడు.

ఆఖరికి ఇంటర్వెల్ అయ్యింది. లైట్లు అన్నీ వెలిగేయి. జనంలో సగంమంది లేచి నిలబడి, మిగిలిన జనాన్ని తప్పించుకుంటూ బయటికి రాసాగేరు. సీతారామయ్యకి బయటికి వెళ్ళాల్సిన పనేమీ కన్పించలేదు. అయినా అక్కడవుంటే అటుయిటు వెళ్ళే జనం, కాళ్ళు తొక్కుతారనే భయంతో, తనూ లేచి ఒకరిద్దరి కాళ్ళు తొక్కుకుంటూ బయటికి వచ్చేడు.

బయట చల్లటిగాలి వేస్తోంది. మబ్బులు యింకా భయపెడుతూనేవున్నాయి. సీతారామయ్య సిగరెట్ వకటి వెల్గించుకుని, యిందాక చూసిన రాబోయే చిత్రాల ప్రకటన బొమ్మలు కాస్సేపు చూసి, ఇంకా టైం కాకపోవడం చూసి, టీ స్టాల్ వద్ద ఆగి ఒక టీ త్రాగి, సిగరెట్‌ను ఆఖరిదమ్ము వకటిలాగి, అవతలపారేసి, 'ఎక్స్‌క్యూజ్ మి' అంటూ జనం కాళ్ళు తొక్కుకుంటూ తన సీట్‌లోకివెళ్ళి చతికలపడ్డాడు.

హెడ్‌మాష్టరుగారు సీతారామయ్య వైపు ఓసారిచూసి ఏదో అడగబోయి, మళ్ళీ అడగలేక మొహం ప్రక్కకు త్రిప్పుకుని, నుదుటిని కుడిచేతివ్రేళ్ళతో రాసుకోసాగాడు. సీతారామయ్య హెడ్‌మాష్టర్‌ని చూసి ఏదో అడగాలని అనుకుంటున్నాడని గ్రహించి, "ఏం కావాలి సార్?" అందామనుకుని, సిల్లీగా ఫీలయి మాట్లాడక వూరుకున్నాడు.

లైట్లు ఆరేయి. సీతారామయ్య ప్రక్క కుర్చీలో కూర్చున్న హెడ్మాష్టర్ ఎందుకో దీర్ఘమయిన నిట్టూర్పు వకటి వదిలేడు. సీతారామయ్య కొంచెం చలించేడు. హెడ్మాష్టర్‌గారు ఎందుకో తను లోపలికొచ్చినప్పటినుంచీ బాధపడుతున్నాడు. తనని పలకరించాలని కూడా ప్రయత్నించేడు. ఏమిటో ఆ బాధ? బహుశా తనని ఎక్కడైనా చూసేడా అని ఆలోచిస్తున్నాడా? లేకపోతే తనేమైనా ఆయన వుపకారం కోరుతానని భయపడ్తున్నాడా? ఇదేనిజమై వుండొచ్చును. పెద్దవాడుకదా అని జాలిపడి తను టిక్కెట్టు తెచ్చియిచ్చేడు. టికెట్ ఉత్తపుణ్యానికి తెచ్చియివ్వడని, బహుశా యిందుకు ప్రత్యుపకారం కోరతాడని ఆయన భయపడుతూండవచ్చును. ఆయన ముక్కుసూటిగాపోయేమనిషని తనకిదివరకే ఎవరోచెప్పేరు. అందుచేతే క్రిందటిసారి తన బావమరిది ఎస్.ఎస్.ఎల్.సి. యింగ్లీషు పేపర్లు ఆయన

వద్దకి దిద్దడానికి వచ్చేయని తెలిసికూడా తాను ఆయన వద్దకి వెళ్ళలేదు.

ఆట ప్రారంభమయి చాలాసేపయినా హెడ్‌మాష్టర్‌గారి మనసింకా బాగుండలేదని ఆయన కుర్చీలో 'అసీజీ' గా అటు యిటు తిరగడంవల్ల, సీతారామయ్య గ్రహిస్తూనే వున్నాడు. నడుస్తూన్న సినిమా పైన ప్రయత్నం మీద దృష్టి కేంద్రీకరించి చూస్తున్నా. సీతారామయ్య హెడ్‌మాష్టర్ గారి అవస్థను గురించే ఆలోచిస్తున్నాడు. తను అనవసరంగా వుపకారం చేద్దామనుకుని, అపకారం చేసేడా?

సినిమా ఆఖరికి అయిపోయింది. ఏం చూసేడో సీతారామయ్యకే తెలియదు. మళ్ళీ చూడాలి కాబోల్సు యీ ఆటని అనుకుంటూ జనం వెనకాలే బయటికి నడిచేడు. కట్టు లోంచి తప్పించుకువచ్చిన కొన్ని రిక్షాలు, హాలుముందు ఆగివున్నాయి.

నిశ్చయం మరచి, రిక్షామీద పోతే బాగుండుననుకుని అటు యిటు చూచేసరికి ప్రక్కనే హెడ్‌మాష్టర్‌గారు కన్పించేరు. తను ఆయన్ని చూడనట్లే నటించి, రిక్షా ఎక్కి వెళ్ళి పోవచ్చును. లేక ఆ జనంలోనే ఎటో అటు కలిసిపోవచ్చును. కాని రాత్రల్లా ఆ అమాయక మానవుడు ఇట్లాగే బాధపడుతూంటాడు కాబోలు. ఆయన బాధ ఏదో శాంతింపచేస్తే ఎంత బాగుండును అనుకుని సీతారామయ్య ప్రక్కకి చూసేడు. హెడ్మాష్టర్‌గారు గొంతు సవరించుకుని, "మేష్టారూ! మీ మేలు మరచిపోలేను. చాలా థాంక్స్." అన్నాడు.

"దానికేం వుందండి? డోన్ట్‌మెన్షన్" అన్నాడు సీతారామయ్య కొంచెం సిగ్గుపడుతూనే!

"మిమ్మల్ని ఎక్కడో యిదివరకు చూసినట్లున్నాను. నన్ను మీ రెరుగుదురా?"

"ఊహూ. మిమ్మల్ని యిదేనండిచూడటం. మాది యీ వూరు కాదు....కాకినాడ." అని అసత్యమాడేడు సీతారామయ్య.

"ఓహో! అట్లాగా! ఎక్కడో చూసేనని యిందాకటినుంచి ఒకటే ఆలోచన! గుర్తు చేసుకోడానికి బుర్ర అంతా పాడు చేసుకున్నాను. ఈ రోజుల్లో అనుచితంగా ఎవరూ వుపకారం చేస్తారంటే నమ్మలేం చూడండి!"

సీతారామయ్యకి ఏం చెప్పాలో తోచక వెర్రిగా చిన్న నవ్వు నవ్వి వూరుకున్నాడు. ఇంతలో మళ్ళీ చినుకులు ప్రారంభమయ్యేయి. హెడ్మాష్టర్ అక్కడే వున్న ఓ రిక్షావాడిని ఆపి, "మేష్టారూ! మీరు ఎటు వెళ్ళాలి?" అన్నాడు.

సీతారామయ్యకి ఆ హెడ్మాష్టర్ వుండేది గవర్నరుపేటవైపు అని తెల్సు. అంచేత తప్పించుకుందామని నేను హనుమాన్‌పేట వైపు వెళ్ళాను, దగ్గరేలెండి. నడిచిపోతాను." అన్నాడు.

"అబ్బే నడవడమెందుకు? మేముండేది సత్యనారాయణపురం. హనుమాన్‌పేట మీదగా పోవచ్చు. ఫర్వాలే. రిక్షా ఎక్కండి మిమ్మల్ని హనుమాన్‌పేటలో దించేస్తాను." అన్నాడు హెడ్మాష్టర్. ఎంత అబద్ధం అనుకున్నాడు సీతారామయ్య.


అనుకుంటూనే హెడ్మాష్టర్‌గారి తృప్తి కోసం, రిక్షాలో ఎక్కి కూర్చున్నాడు సీతారామయ్య. హెడ్మాష్టర్‌గారు చిదానందంగా నవ్వుతో, చిటపట పడ్తూన్న వాన చినుకుల్లోంచి రిక్షా వేగంగా పోతుండగా, ఏమేమో రాజకీయాల్ని గురించి ఎంతో వుత్సాహంగా మాట్లాడసాగేడు. ఏ చీకూచింతా ఎరగనట్లు.

నవ్వుతూ మాట్లాడుతూన్న మేష్టరుగార్ని చూసిన సీతారామయ్యకి, చుట్టూ వెన్నెల విరిసినట్లే అయింది. ఊరంతా దీపావళి చేసుకుంటున్నట్లే అన్పించింది. □□□

మైనస్ ఇంటూ ప్లస్

స్థిరంగా ఉన్న శాంతినుంచి
ఎడంగా తప్పుకుంటాడు మానవుడు
సంచలనం కలిగించే
సమరాంగణాన్నే కోరుకుంటాడు
అందుకే మానవ చరిత్ర అంతా యుద్ధమయం
యుద్ధాలు లేని చరిత్ర చదివితే అర్థవిహీనం
స్వార్థం ఒక ప్రాథమిక శక్తి
క్రౌర్యం మీద అభిరక్తి
అజ్ఞాతంగా మనిషిలో పశువులో సమానం
వైజ్ఞానికులు చెపుతారు దీనిలో నిజం
ఆశయాలూ ఆదర్శాలూ అంగవస్త్రాల లాంటివి
హఠాత్ పవన వీచికకి అట్టే తొలగిపోలవి
అసలైన మనిషి కాస్త అలజడిలో బయట పడతాడు
కనటు కనపడాలంటే పైన కొంచెం కదలించి చూడాలి
అక్కడక్కడ ఓ మహాత్ముని అడుగుజాడ కనపడినా
అటువైపు మళ్ళక అడ్డదారినే గుడ్డిగా పడిపోతాడు
అవివేకానికున్న బలం ఆవేశానికతికి నప్పుడు
ద్విపాదవాహనాలు బద్దీలు తప్పి ప్రమాదించక తప్పదు
అందుకే మానవుడు మానవుడిగా దేవుడిగా రూపొందే యీ ప్రయాణం
అనంత దీర్ఘం, పునఃపునర్వ్యర్థం, బహుయుగ విస్తీర్ణం.

— బాలగంగాధర తిలక్



మ్యూజియంలో మ్యూజింగ్సు

రుద్రాభట్ల నరసింగరావు

సౌభాగ్యవతి సీతకి,

ఆశీర్వచనాలు అననా? ఏవీ? కృతజ్ఞత నిండి పోయిన నా గొంతులోంచి మాట పెగలదే?

నువ్వొస్తానని రాశావు. స్వర్గం నాకోసం వొస్తుందని అర్థం చేసుకున్నాను.

ఎన్నాళ్లకి రాశావు సీతా?—అని ఇప్పుడని పిస్తోందిగాని, నీ ఉత్తరంచూసిన క్షణంలో మన పెళ్లయిన తొమ్మిది గంటలకి నీదగ్గర నుంచి ప్రేమలేఖ వొచ్చినంత ఆనందం కలిగింది.

ఇహ రాదనుకున్న బస్సు రావడమే గాదు, అందులో సీటుకూడా దొరికినంత సంతోషపడ్డాను—అనేవాడు నీ భర్త ఏ పట్న వాసపు మగ్గంలోని కండెపోటో అయివుండి నట్లయితే.

అప్పుడు అతనికి బోలెడు ప్రపంచ జ్ఞానం ఉందనుకొని తృప్తిపడేవారు అత్త గారూ వాళ్లూ.

కాని నేను పల్లెటూరిజీవితాన్ని అందులో మళ్లీ ఏకాంతాన్ని ప్రేమించేను. అది ఓ నేరం.

నా అనేవాళ్ల లేని దౌర్భాగ్యుణ్ణి నీలాటి అర్ధాంగికోసం ఆశపడ్డాను. అది నా రెండో తప్పు.

పెళ్లినాటికి దగ్గుతో బాధపడుతున్నాను. అది నా మూడో దోషం.

అల్లుడిగానన్ను మరిచిపోదామని ప్రయత్నిస్తూ వుంటారు నీ తల్లిదండ్రులు. కాని పైనేరాలుచేసిన కిరాతుడిగా జ్ఞాపకంవొచ్చి బాధపెడుతున్నానేమో.

నువ్వుగూడా వారిమోస్తరేఅనుకున్నాను

ఎంత అపోహపడ్డాను? నిజమే. కాని నిన్ను అర్థం చేసుకునేపాటి అవకాశం ఎక్కడ? ఆ పెళ్లి నాలుగ్గడియలూ ఏం కలిసి వున్నామో? అంతే. అంతకుముందు గాని ఆ తర్వాతగాని మనం కలుసుకోలేదు సరిగదా, ఒకరిగురించి ఒకరు విననయినా లేదు. నువ్వు నా ఎడ్రసు సంపాదించడానికి పడిన అవస్థ చదువుతూంటే నాకు నవ్వూ ఏడుపూ రెండూ వొచ్చేయి.

నన్ను నీకింత పరాయివాడిగా చేశారు—మన జీవితాల్ని ముడివేసినవారు.

పెళ్లిలో నా ప్రవర్తన అందరికీ వింతగా కనబడివుంటుందని తర్వాత సంఘటనల్ని బట్టి తెలుసుకొన్నాను. రకరకాల వ్యాఖ్యానాలు విన్నాను.

'పాపం నా అనేవాళ్లు లేరాయె. తనకి గొప్ప శుభం జరుగుతున్నప్పుడు ఆలోటు మరీ కొట్టొచ్చినట్టు కనబడ్డం సహజం.' అన్నాడు దిగులు అనుకున్నవాళ్లలో ఓ అనుభవజ్ఞుడు.

మా స్నేహితుడు ఒకడికి కాలు అవుకు. హుషారుగానే ఉండేవాడు. తాంబూలాలు పుచ్చుకున్ననాటి రాత్రి పక్కమీదపడి ఏడ్చిన ఏడుపు మరిచిపోలేను.

'అదేవిఁటి ఓవిడా అంతపరధ్యాన్నం? ఇతగాడి వరస చూస్తూవుంటే మన పిల్లతో మాటయినా ఆడతాడంటావా?' అని బుగ్గ నొక్కుకున్న స్త్రీలు కొందరు.

అత్తగారి అనుమానాలు చెప్పక్కర్లేదు.

'ఎటూ ఏ దిక్కూ లేని ఈ సమ్మంధం మనకి వొద్దు మొర్రో అంటే విన్నారు కాదు. అయినా ఈ కొంపలో నా మాట ఎప్పుడు పనికొచ్చింది గనక. ఆ దగ్గేవిఁటో. వొట్టి వెర్రిబాగులవాడిలా వున్నాడు. పిచ్చి లేక పోయినా అమాయకత్వం వుంటే చాలద టండీ అమ్మాయి బతుకు అభాజనం కావడానికి?'

మామ గారు తలొంచుకుని నిట్టూర్చేరు.

'మీకూ మీ కూతురికీ నచ్చిన కుఱ్రాడి వరస ఇదీ! కట్నం లేకుండా వొస్తు న్నాడని వూ ఎగబడ్డమే. నే నప్పుడే అను మానించాను.'

అత్తగారికి భర్తని సాధించటానికి ఇంత కంటె మంచి సందు దొరకదు. కాని ఆ విజయంలో నీ గురించిన బాధే ఎక్కు వయింది ఆవిడకి.

'ఎన్నాళ్ల బట్టి వొస్తోంది ఇలా?' అనడి గారు మామ గారు దగ్గుతున్న నన్ను.

'మూడేళ్ళుగా, మా అమ్మా, నాన్నా పోయిన తర్వాతనుంచి.'

నేనే మూడేళ్లన్నానంటే, పుట్టు చేటూ నాకీ రోగం వుండి వుంటుందను కున్నారేమో అత్తగారు.

ఆడ వాళ్లంతా ఆయన చుట్టూ చేరి గోల మొదలెట్టారు.

మామ గారికి ఆ ఒత్తిడి చాలా చిరాకు కలిగించింది. ఆయనే అందరి మీదా కేకలు వేసుకున్నారు. కాని అవి ఓడి పోయిన మనిషి కేకల్లా వినిపించాయి. నా మీద ఆయన పెట్టుకున్న ఆశల్ని ఇప్పు డింతమంది కాదని రుజువు చెయ్యడంతో ఆయనకి ఓర్పు చచ్చి పోయినట్టు అని పించింది.

కాని ఆయన గాంధీ అనుచరులు. స్వాతంత్ర్య సమరంలో నిలబడిన వ్యక్తి. అంటే ప్రస్తుతపు ఓటమికి కుంగిపోక అంతిమ విజయంలో విశ్వాసం ఉంచడం నేర్చుకున్న తరహా మనిషన్న మాట.

ఏమయితేనేం, ఆ వేళ మన నెత్తిమీద పడిన అక్షింతల్లో కాస్త మనస్ఫూర్తిగా వేసిన వంటూ ఉన్నాయీ అంటే అవి మీ నాన్నగారు ఒక్కరు వేసినవే.


తర్వాత జరిగిన పేచీలూ అవీ నువ్వెర గనివి గనకనా?

నేను తలదించుకుని వచ్చేశాను.

పెళ్ళి కొడుకంతటి వాణ్ణి ఎవరూ వుండ మన లేదంటే వొట్టి మనిషిని మెడ పట్టి గెంటేసినంత.

ఇవన్నీ నేను మనసులో పెట్టు కున్నా నని అనోహపడేవు సుమా, సీతా!

ఎన్నడూ లేదు. పోగా, ఆ నాటి నా ప్రవర్తన గురించి నీకు సంజాయిషీ ఇచ్చు కోవాలని ఎన్నో మాట్లు ప్రయత్నించేను. కాని నా వూహలు కాగితం మీద పెడితే నాకే వింతగా అగపడేవి. అవి చదివితే



నేను పిచ్చివాణ్ణి అని ధ్రువపరుచు కుంటా వని భయం వేసేది.

ఇప్పుడా?

నే నెంత పిచ్చివాణ్ణీ, రోగిష్టినీ, దిక్కు మాలిన వాణ్ణీ అయితే నువ్వంత త్వరితంగా, తప్పనిసరిగా నా దరికి చేరుకుంటావని నమ్మకం కలిగింది—— నీవుత్తరంలో నాపై కురిసిన జాలి ఎంత గొప్పది! నన్ను ప్రేమించగల మనిషి అవసరం నాకుందని ఎంత చక్కగా గ్రహించావు! ఇంకా నన్ను సరిగా అర్థం చేసుకోలేదని వాపోతున్నావా పైగా?

ఎవరి మీద మనకి జాలి వుంటుందో వాళ్లని అర్థం చేసుకోవడం సులభం.

అందుకే నీ దగ్గిర ఏమీ దాచుకోవాలని పించడం లేదు, సీతా.

బయట మధ్యాన్నం నించి ఎడ తెరిపి లేకుండా వాన కురుస్తోంది. వాన కురుస్తున్న పూటలు ఒంటరిగా ఈ గదిలో గడపడం నా కెంతో యిష్టం. వాన ఏకాంతానికి భద్రత కలిగిస్తున్నట్టు తోస్తుంది నాకు. అప్పుడు నా గదికి మిగతా ప్రపంచంతో సంబంధం తెగిపోతుంది. నేనూ, నా జ్ఞాపకాలే మిగులుతాం.

ఈ జ్ఞాపకాలున్నాయి చూడు, ఇవి చాలా చిత్రమైనవి. వీటిని రేపే సంఘటనలు, దృశ్యాలూ, వాసనలూ ఎన్నెన్నో! ముఖ్యంగా వాసనలు. నేను వాసనల్ని

ప్రేమిస్తాను— అవి నాకిచ్చే స్మృతుల కోసం.

హైదరాబాద్‌లో మా మేనత్త గారింట్లో వుండగా చాటుగా ఓ తల నూనె రాసుకునే వాణ్ణి. అత్త చూసినా కోప్పడదు. ఆ సంగతి ఎరుగుదును. కాని పిరికితనం అడ్డొచ్చేది. ఈ పిరికితనం లేక సున్నితమైన హృదయం — ఇప్పటికీ నాలో ఉండబట్టే నిన్ను తెచ్చుకోలేక పోయాను. సరే. ఆ తలనూనె వాసనచూస్తేచాలు హైదరాబాద్‌లోని నా గతజీవితంలోకి వెళ్ళిపోగలను. అందుకే ఓ సీసా ఎప్పుడూ నా గదిలో ఉంటుంది. కాని దాన్ని వాడను మళ్ళీ— మెదడుకి మంచిది కాదని.

ఇలా ఆరోజుల్ని తలుచుకోదలుస్తున్నానంటే ఆ రోజు లెంతో సుఖంగానో, మంచి అనుభవాలతోనో గడిచా యనుకునేవు! హైస్కూలు కుర్రాడి జీవితంలో చెప్పుకోదగ్గ అనుభవాలు ఏముంటాయి? — తెలుగు పండితుణ్ణో, అమ్మాయిల్నో ఏడిపించి చివాట్లు తిన్న అనుభవాలు మినహాయిస్తే? సుఖమా? దయగలవాళ్ళు నైతం ఇంటి కొచ్చిన బీదచుట్టాన్ని సరిగా ఆదరించడానికి సిగ్గు పడతారు. అత్తయ్య తప్ప మిగతా వాళ్ళకి నాతో ఒక్క మాట అనడానికి కూడా మన సొప్పేది కాదు.

ఒక్కటి మట్టుకు నిజం. బాగా తిండి దొరికేది. అవన్నీ తింటున్నప్పుడు నా మనస్సు ఏడ్చేది-అమ్మా నాన్నా ఏ జన్మానా ఓ పూరీ ముక్కయినా ఎరగరు గదా అని.

అంత పట్నంలో ఆ ఇంట్లో నేను ఒంటరినయి పోయా ననిపించేది.

తన ట్యూషన్లు. బ్రాహ్మణార్థాలకి మట్టుకు నేను వారసుణ్ణి కారాదనేదే మా నాన్న కల. ఓ ముక్క వొస్తే ఎక్కడో అక్కడ ఉద్యోగం చేసుకుని బతుకుతాను గదా అన్న ఆశతో నాన్నా—

తమ కెలాగా లేదు పిల్లడయినా శుభ్రంగా తింటాడనే ఆశతో అమ్మా—

నన్ను వొదిలి వుండడానికి ఒడంబడ్డారే గాని నా ఎడబాటు వాళ్ల కెంత దుర్భరంగా ఉండేదనీ!


ఎప్పుడయినా సెలవులకి - అదయినా అత్త టిక్కెట్టు సొమ్మిచ్చి పంపితే-ఇంటికి వొచ్చేవాణ్ణి.

కోన సీమలో మా యిల్లు కొబ్బరి తోటల మధ్య కాలవవొడ్డున బిక్కు బిక్కు మంటూవుంటుంది. ఇంటి వెనక ఒక మోడు రావిచెట్టు. వసంతం వొచ్చినపుడు మాత్రం ఆకులు తొడిగి గల గల నవ్వేది. ఎండాకాలం సెలవులకి నేను వొచ్చినందుకు అది వుః సంబరపడి పోతుందేమో అనిపించేది.

ఈ నా గది కిటికీలో నుంచి ఓ రావిచెట్టు కనిపిస్తూవుంటుంది. అదంటే నా కెంతో యిష్టం. అది నా గత జీవితాన్ని నాకు పాడి వినిపిస్తున్నట్టు అనిపిస్తుంది.

కాని దాన్ని నమ్మలేను. అసలు నాకు ప్రస్తుతానికి భిన్నంగా ఉండే గత జీవితం ఉందా అనిపిస్తుంది. అదంతా ఓ కలేమో అనుకుంటాను. అంతలోనే ఆ భ్రమ తొలగిపోతుంది.

ఇప్పుడు నేను వేసుకుంటున్న ఈ బొంత మా అమ్మ కుట్టినది.



ఒకసారి సెలవులికి నేను ఇంటికి వెళ్ళేటప్పటికి లోగుమ్మంలో కాస్త చాపుకుని ఈ బొంతని వొళ్ళో పెట్టుకొని కుడుతోంది. అది సాయంకాలం.

నేను గుమ్మంలో అడుగుపెట్టగానే అమ్మ తటాలున లేచివొచ్చి నా కాళ్ళదగ్గిర కూలబడి అలాగే నన్ను కౌగలించుకుని 'చదువూ వొద్దు, సంధ్యా వొద్దు. నువ్వు నన్ను వొదిలిపెట్టి వెళ్ళిపోకు.' అని ఏడ్చింది. (తీరా వెళ్ళిపోవలసిన రోజు వొచ్చేటప్పటికి నన్ను ఉండమనలేదు. చాటుగా ఆవిడ ఏడవడం' నాన్న మందలించడం మట్టుకు ఎరుగుదును.)

నేను ఉన్నన్నాళ్ళూ అమ్మ లక్ష అనుమానాల్ని వెలిబుచ్చింది :

'అత్తశుభ్రంగాఅన్నంపెడుతున్నద్రా?'

'అబ్బో నన్ను చాలా బాగా చూస్తుందమ్మా అత్తయ్య - అన్నింట్లోనూ.'

'పోనీలే నాయనా. నిన్ను వొదల్లేక వొదలేక వొదలి బతుకుతున్నాను.' అని మళ్ళీ ఏడ్చింది. తృప్తినైతం ఏడ్పునే తెప్పిస్తుందనుకుంటాను నూతృమూర్తికి.

ఓరోజు మినపరొట్టె కాలుస్తూ వుంది అమ్మ. నేను కుంపటిదగ్గర కూర్చున్నాను.

'ఇలా ఎప్పుడైనా ఓరొట్టెముక్కయినా కాల్చిపెడతాద్రా అత్తయ్య?'

అమ్మని సంతోషపెట్టడానికి 'రొట్టె ముక్కేం? పూరీలూ, దోసెలూ రోజూ ఏదో టిఫినేగద అమ్మా?' అనేవాణ్ణి. కాని

అంతలోనే నామాటల్లో అమ్మ అంత ఆప్యాయతతో చేసి పెడుతున్నదాన్ని చులకన చేసిన ధ్వని వుందేమో అని భయపడుతూ 'కాని నాకీ రొట్టె అంటేనే చాలా ఇష్టం అమ్మా.' అనేవాణ్ణి.

నేను వాడని సబ్బుబిళ్ళ ఒకటి చూస్తావు సీతా, నాగదిలో. అది నాన్నగారికి ఇష్టమైన సబ్బు. కళ్ళుమూసుకుని దాని వాసన చూస్తూంటే నాకాయన అవుపిస్తారు. ఇది రాస్తున్న సమయంలో నా ఎడంచెయ్యి ఆ సబ్బుని అందుకుందికూడా.

ఆ నాలుగురోజులూ ట్యూషను కుర్రాళ్ళ నలుగురితోపాటు నన్నూ కూర్చోబెట్టుకునేవారు నాన్న. నా తెలివితేటలకి ఆయన చాలా సంతోషిస్తున్నట్టు అగపడేవారు. ఎక్కువసేపు కూర్చోమనేవారుకాదు — నా సరదాలకి అడ్డుతగులుతున్నానేమో అని భయపడి.

కాని నేను ఎక్కడికీ తిరిగేవాణ్ణికాను. నేను దగ్గిరకూర్చుంటే అమ్మమొహంలో మెరిసే తృప్తి చూడ్డమే నాకు ఆనందంగా వుండేది.

ప్రతీ మధ్యాహ్నమూ ఇప్పుడు నేను వేసుకుంటున్న బొంత కుడుతూ కూర్చునేది అమ్మ.

'ఎందుకమ్మా అంత శ్రమ?'

'ఊరికే కూర్చుంటే ఏమొస్తుంది నాయనా? అక్కడ నీ పడకా, బోజా చూసేదెవరు? మొన్నా రావమ్మగారు పనిమనిషికి స్తానంటే వొద్దందిట - పటంలాటి చీర. ఇది పైనవేసి కుట్టానంటే ఎంత దావుంటుందనుకున్నావు! నీ పెళ్ళాంవొచ్చేదాకా వేసుకున్నా చలనం వుండదు.' అంటూ నవ్వేది అమ్మ.

అమ్మకి కోడలు రావాలని ఎంత ఆశ!

ఈనాడు నువ్వొస్తానని రాశావు కాని నేను వొట్టి నిర్భాగ్యుణ్ణి సీతా, అమ్మలేదు.

అమ్మా నాన్నా ఎంతో వాస్తవంగానూ, శాశ్వతంగానూ కనిపించేవారు నాకారోజుల్లో. వాళ్ళు లేని నా స్థితిని ఊహించవలసిన అవసరం కూడా కలగలేదు నా కప్పుడు.

వాళ్ళు పోవడంతో నాకు అంతా నిప్పచ్చరంగా కనబడింది. ఎందుకు బతకాలో అర్థం కనిపించని రోజుల్లో ఈ ఉద్యోగం వొచ్చింది. బతకడమేకాదు, ఉద్యోగాన్ని కూడా నిర్వహిస్తున్నాను!

నిన్న నీ లేఖ వొచ్చేక ఏదో ఓరోజున ఇలాటి అదృష్టం నన్ను వరిస్తుందనే ఆశే అవ్యక్తంగా ఇన్నాళ్ళూ నన్ను నిలబెట్టిందనిపిస్తోంది.

ఉద్యోగమూ, ఓ మూరుమూల పల్లెటూళ్ళో. నివాసమూ, దీపం పెట్టుకునేవాళ్ళు లేక వొదిలివేయబడిన ఒక విశాలమైన ఇంట్లో ఒక పెద్దగది.

పెద్దగదీ, తక్కువ సామానూ వొంటరితనాన్ని ఎక్కువ చేస్తాయనిపిస్తుంది. ఒంటరిమనిషి వొస్తువుల్నే ప్రాణం వున్నవాటిలా ప్రేమిస్తాడు. (లేక కేవలం ఇది నా అనుభవమేనా?)

వొస్తావుగదా, చూద్దువుగాని నా సామాను ఎంత తక్కువో.

క్యాంపుల్లో వున్నప్పుడు బెడ్డింగుకట్టుకోడానికి, ఊళ్ళో వున్నప్పుడు దణ్ణెంగానూ పనికొచ్చే ఓ బెడ్డింగ్‌రోప్. పడుకోడానికి, మూట కట్టుకోడానికీ ఉపయోగించే ఒక

తుంగచాపా. బట్టలు పెట్టుకునే సంచీయే తలగడా. దారు సామానువున్న గదులపెట్టె. లాంపు పెట్టుకునే ఎత్తు. రెండుగిన్నెలు, కుంపటి. ఒక పెద్ద బకెట్ - వీటి ప్రయోజనాలు చాలా ఉన్నాయి. వీటన్నిటితోనూ నేను నా ఒంటరి గంటలలో మాట్లాడతాను. అవిమట్టుకు మూగగా నన్ను చూస్తూ వుంటాయి. అయితే నాతో మాట్లాడేవీ ఉన్నాయి. అవే, నా పుస్తకాలు; ఎప్పుడైనా దూరపు స్నేహితుల్నించి వొచ్చే వుత్తరాలు.

వీటన్నిటితో నాకు బాగా స్నేహం ఏర్పడిపోయింది.

రెండురోజులు నేనెక్కడయినా వుండిపోయినట్లయితే, చీకట్లని పారదోలగలిగీ, చీకట్లో బిక్కుబిక్కుమంటూ కూర్చునే పెళ్ళయినా భర్త ఇంటికి రాలేని నవోఢలాటి నా ల్యాంపూ, పరిమళాన్ని తనలో ఉంచుకునీ మూతతీసేవారు లేక ఒదిగి కూర్చుని జాలిగా చూసే బాలవితంతువులాటి నా తలనూనెసీసా....ఇలా అన్నీ నాకోసం ఎదురు చూస్తున్నట్టు ఊహించుకుంటాను.

మళ్ళీ నాగది చేరుకునేదాకా తీర్థంలో తప్పిపోయిన పిల్లడిలా తిరుగుతాను.

అలాగే మన పెళ్ళిలోనూ చేశాను. (చేసి వుంటాను.)

ఇక నారెండో తప్పుకి సంజాయిషీ ఏమని చెప్పుకోవాలో నాకు తెలియడం లేదు. నీ అందంలో, నీకదలికల్లో కథల్లోని మనుషులకువలె బాధని తీసివేయగలిగే ఏ గుణమో కనబడింది. అలాటిపిల్ల నిస్తానంటే వొద్దనగలిగేశక్తి నాకు లేకపోయింది. నాకు అర్హత లేదన్న ఆలోచనే రాలేదు.

నా మూడోదోషం దగ్గు - కాదు, దాని గురించి అబద్ధం చెప్పకపోవడం. "వారి జాక్షులందు వైవాహికములందు." పద్యం ఏనాడో చదివాను. కాని దాని అర్థం మన పెళ్ళిలో జరిగిన సంఘటన వల్ల తెలిసింది.

నీదగ్గర ఏమీ దాచను, సీతా, దాచలేను.

ఆహార విహారాదులపట్ల నా నిర్లక్ష్యపు ఫలితం ఈదగ్గు.

ఆ నిర్లక్ష్యానికి కారణం - తల్లిదండ్రులను దక్కించుకోలేని నేను బతకడం పాపం అనే వూహ.

ఫలితం - ఆత్మానుకంప

దగ్గు మొదలయినప్పటినుంచీ గ్లైకోడిన్, సిరోలిన్, కాసబిన్ మొదలగు ఇనన్తములయిన "కాఫ్‌సిరప్పు"లను అనంతంగా వాడేను - తక్షాంతికి. పూర్ణారోగ్యవంతుణ్ణవాలనే ఉండేది కాదు.

● ఒక ప్రముఖ నాయకుడు రెండు గంటలసేపు అనర్గళంగా ఉపన్యాసం యిచ్చి "ఎవరికైనా సందేహాలుంటే అడగవచ్చు" అన్నాడు.

సభలోంచి ఒకడు లేచి "అయ్యా! ఇంతవరకు మీరు మాట్లాడింది దేన్ని గురించో సెలవిస్తారా?" అని అడిగాడు.

—అంకలపల్లి మహంకాళేశ్వర రావు, ఏలూరు.

కాని నిన్ను తొలిసారి చూసిన తర్వాత జీవితం మీద మమత కలిగింది.

విశాఖపట్నం పరిగెత్తాను. నా జబ్బు ప్రమాదకరమైనది కాదని తేల్చారు.

మన పెళ్ళినాటికి తగ్గుతూ తగ్గుతూవుంది.

ఇప్పటికి చాలావరకూ నయమయినట్లే.

నీ అమృత స్పర్శతో ఆ మిగిలినకాస్తా ఎగిరిపోతుందని నాకు నమ్మకమే.

రా సీతా. నాకు పునర్జన్మనియ్యి.

ఇవాళే పట్నం వెళ్ళి గోద్రెజ్ పడక కుర్చీలూ, పరుపూ మంచాలూ కొంతపాత్ర సామానుతెచ్చి ఈ ఇంటిలో మిగతాగదుల్ని అలంకరించి వుంచుతాను.

క్రమేపీ అన్నీ నీ సలహామీద అమర్చుకోవచ్చు.

ఈ గదిని మట్టుకు ఇలాగే వుంచుతాను.

ఇందులో వొస్తువులు నాకెంత ప్రియమైనవో ఈపాటికి గ్రహించి వుంటావు. నా గతజీవితపు జ్ఞాపకాల్ని ఇస్తాయి అవి. నా గత జీవితంలో చాలామట్టుకు చేదుఅనుభవాలే నిండి వుండవచ్చు. కాని స్మృతి ఎప్పుడూ మధురమైనదే - చేదు మాత్ర మింగిన తర్వాత వొచ్చే తీయవాసనలాటిది.

ఈ వొస్తువులన్నిటితో యీ గది నిలాగే వుంచుతాను. అయితే యీ గది నువ్వొచ్చిన నాటి నుంచి ఉపయోగించం. గొళ్లెం పెట్టి ఉంచుతాం. ఇదివరలో ఎన్నోమాట్లు చేసినట్టు ఎప్పుడయినా ఈ గదిలో కూర్చుని మ్యూజింగ్సులో తేలిపోవచ్చు— ఈ వొస్తువుల్ని చూస్తూ. ఈ గదికి మ్యూజియం అని పేరు పెడతాను.

మ్యూజియంలో వొస్తువులు సాధారణంగా కష్టపడి సేకరించినవై ఉంటాయి. కాని నా మ్యూజియం విషయం అలా కాదు. నా కష్ట సుఖాల్ని పంచుకున్నవి ఇందులో వొస్తువులు.

ఇక ముందు ఆ పని నువ్వు చెయ్యబోతున్నావు. కాని నువ్వు వాటికంటె గొప్ప దానివి. ఎంచేతంటే, నా కష్టాల్ని పంచుకుని సుఖాన్ని పెంచడానికి వొస్తున్న నర్సువి (ఆ మాట విస్తృతార్థంలో) నువ్వు.

నా ఏకాంతానికి బయటి ప్రపంచానికీ మధ్య నున్న తెరలు ఎత్తుతున్నట్లు వాన వెలుస్తోంది.

నా ఉత్తరం ఆపక పోతే దీన్ని చదవడంలో పడి నువ్వు ఆరోజుకి రాక పోయే ప్రమాదంవుంది.

అయితే బాగా వాకబు చేశావన్నమాట ఇక్కడికి ఎలా రావాలో. ఇంకా నేను సలహాలిస్తే చాదస్తుడిని అనుకుంటావు. అవును. కాకినాడలో ఆ వూరు వచ్చే బస్సెక్కు. దిగడం పూను నీ కక్కర్లేదు. నేను దింపుకుంటాను నా దేవతని.

సంతకం పెట్టేదామని ఆలోచిస్తూ అవతలికి చూశాను. చూరునించి పడలేక పడలేక పడుతున్నాయి ఆఖరి నీటిబొట్లు. నువ్వు పుట్టి పెరిగిన ఇంటినుంచి, తల్లిదండ్రులనుంచి నీ ఎడబాటులో కష్టం ఎంతటిదో తట్టింది.

సహ్యంగా కాపరానికి వెళ్ళే ఆడపిల్లకయినా తల్లి దండ్రుల్ని మొదటిసారిగా వొదలవలసి రావడం ఎంత బాధాకరం! అలాటిది నీ అంతట నువ్వు ఎవ్వరికీ చెప్పకుండా కేవలం అదృష్టాన్ని నమ్మి నా కోసం వస్తున్నావంటే ఎంత త్యాగం చేస్తున్నావో ఎరుగుదునా అని? ఈ సంఘర్షణలో కాలినప్పటికీ నీ నిశ్చయం ఏ మాత్రం సడలదనీ, నూతన శక్తితో, పుటం పెట్టిన పుత్తడిలా మెరిసి పోగలదనీ నాకు నమ్మకమే.

తప్పక రా సీతా — అనడం నిన్నింకా అర్థంచేసుకోని నా అజ్ఞానాన్ని వెల్లడిస్తోంది.

పునస్సమాగమానికై ఎదురు చూస్తూ జీవించే,

నీవాడు,

రామచంద్రరావు.

● ● ●


ఈ పుస్తకం లాంటి ఉత్తరాన్ని పోస్టు చేసిన నాల్గోనాటి సాయంకాలం.

జట్కా బండిలో బస్సు ఆగే వూరివైపు ప్రయాణిస్తున్నాడు రామచంద్రరావు.

ఎర్రని మట్టిరోడ్డు కిరుప్రక్కలా చిన్న చిన్న కొండలు. వాటిపై తీరిగ్గా మేస్తున్న పశువులు. చెట్ల నీడల్లో గోళీలాడే కుర్రాళ్ళు —ప్రతీదీ రామచంద్రరావుకి ఉత్సాహాన్ని కలిగిస్తోంది ఈ రోజున—ఇదివర కెన్నో సార్లు చూసిన దృశ్యాలే మళ్ళీ.

ఆ నాలుగుమైళ్ళూ తరగని దూరంలా ఇట్టే గడచిపోయినట్టూ కూడా అనిపించింది.

బస్సుస్టాండు తెల్ల కలువల చెరువు పక్కనే వుంది. కుర్రాళ్ళు దిగి పువ్వులు కోసుకుంటున్నారు. రావిచెట్టుక్రింద నిలబడ్డాడు రామచంద్రరావు. ఎందుకో ఆ చెట్టు కంత కులుకు? ఒకటే గలగల. వసంతం వొస్తోందనా?



నిముషాలు లెక్కిస్తూ నించున్నాడు.

ఆఖరి కెలాగయితేనేం రామచంద్రరావు ఎదురుచూస్తున్న బస్సు వొచ్చింది.

స్టాండులోకివొస్తూనే ఆగకుండా కొంచెం ముందుకీ వెనక్కీ నడిచి తిరుగు ప్రయాణానికి అనువైన పద్ధతిలో నించుంది.

ఇంజను నోరు మూసుకుంది.

దిగే వాళ్ళు దిగుతున్నారు. స్టాపులో కనబడ్డ పరిచయస్థులు వాళ్ళని పలకరిస్తున్నారు.

'కాకినాడ నుంచేనాండి? ఎలావుంది రేటు?'

'ప్చ్. డవునయిందండీ. రెండున్నర.?'

ఎంతమీద రెండున్నరో మూడో వాడికి తెలీకూడదు. ప్రతీదీ రహస్యమే—రహస్యంగా ఉంచుకోవలసిన గొప్ప సంగతులు లేని జీవితాలు వీళ్ళవి.

అన్నట్టు తన ప్రణయకేక ('లేఖ'కి అచ్చు తప్పు) ప్రియురాలికి రహస్యంగా చేరిందా? ఛ. వెధవ అనుమానాలు.

'ఇదేనాండి రావడం? కులాసా?'

'ఏదో ఇలా వున్నాం.'

'అబ్బాయి ఎక్కడ?'

'ఏదీ ఇంకా ఎక్కడా కాందే.'

ఉద్యోగాల గోల.

తన దేవత ప్రత్యక్షం కాలేదు. రామచంద్రరావు భూమిలోనికి కుంగిపోతున్నట్టు అయిపోయాడు.

అంతలో ఖద్దరు పంచె, లాల్చీతో, గౌరవాన్ని కలిగించేపాటి స్థూల దేహులైన మామగారు దిగేరు.

ఆశ్చర్యపోయేడు రామచంద్రరావు భయపడ్డాడు. తన ప్రళయరేఖ (ప్రణయ లేఖకి మరో అచ్చుతప్పు అని వేరే చెప్పాలా?) బయటపడి వుంటుంది. మొహం వాచేలా చీవాట్లు వేస్తారు తప్పదు.

ఆయన దిగుతూనే అందుకున్నారు. 'అదేవిఁటోయి? అలా తెల్లబోతున్నావు। సీతరాలేదనా? వొస్తుందొస్తుంది. నేను చచ్చేననుకుని అది నీకు ఉత్తరం రాయడం, ప్రభుత్వం వారిచ్చిన ఐదెకరాలతో కుబేరుణ్ణయేననుకుని కాబోలు నువ్వు దానికి రమ్మని రాయడం - బాగుంది వరస. ఆనాడునువ్వు కట్నం వొద్దంటే సంబరపడినప్పుడే నేను కుబేరుణ్ణి కానని గ్రహించి వుండవలసిందే నువ్వు. పోన్లే. కుర్రతనం. మీరేం గ్రహిస్తారు. పద కాఫీతాగి వద్దాం. వొచ్చేటప్పుడే రెండు టిక్కెట్లు చెప్పేను కండక్టరుకి.' అంటూ జబ్బ పట్టుకుని రామచంద్రరావుని హోటలు వైపు లాక్కుపోయారు మామగారు.

కొంచెం అర్థం అయి ఆనందంతో ఉక్కిరి బిక్కిరవుతున్న రామచంద్రరావు ఏం మాట్లాడలేకపోయేడు.

సప్లయ్యర్ రామచంద్రరావు వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

'కుబేరుణ్ణి అంటే అర్థంకాలేదోయి? మేఘ సందేశంలోని విలన్? - ఆఁ-రెండు కాఫీలుపట్రా నాయనా. నాదాంటో పంచదార వెయ్యకు.'

ఆనందంగా నవ్వేడు రామచంద్రరావు. 'మీలాటివారిని ఈ చీనాసమస్య తాకదు.'

అన్నాడు— నవ్వినప్పుడేదో జోకు లాటిది అనాలిగదా అని.

'చీనా సమస్య మమ్మల్ని తాకదూ? ఇంకా నయం. దాస్యం అంటే ఎరగం అన్నావుకాదు!' అన్నారాయన గంభీరంగా తనమీద ఏదో అభియోగం మోపబడినట్టు. అసలాయన మనస్సంతా కూతురిమీదఉంది. తనని తిట్టుకుంటూ ఉంటుంది. ఇంటికి వెడుతూనే 'సీతా ఎవర్ని తెచ్చానో చూడు!' అనాలి. అప్పుడుచూడాలి వెర్రితల్లిమొహం!

కాఫీలు వొచ్చేయి. అందుకున్నారిద్దరూ. కాని నోటికందించలేదు. మామగారు చెప్పసాగారు.

'పెళ్ళిచేసినవాణ్ణి లక్షణంగా కార్యం చెయ్యనుటోయి? మీ అత్తగారికిమాత్రం ఆ ముచ్చట లేదనుకున్నావా? కాకపోతే నిన్నూ నీ ఊహల్నీ ఆవిడ చప్పున అర్థం చేసుకోలేక పోయింది. అసలు ఒంటరి జీవితం గడిపేమనిషి చేష్టలు ఎవ్వరికీ అంత తేలిగ్గా అర్థంకావోయి. నలభై రెండులో జెయిల్లో వున్నప్పటి నా ఊహలు చెబితే నువ్వేనవ్వుతావు. ఆవరణలోని మొక్కలతో మాట్లాడేవాణ్ణి. ఉత్తరాలని కౌగలించుకుని పడుకునేవాణ్ణి....కాఫీతాగు.' అని ఆయన గడ గడ తాగేశాడు.

కాఫీ తాగుతుంటే రామచంద్రరావుకి తను కొత్తగా అలంకరించిన గది జ్ఞాపకం వొచ్చింది. అందులోని ప్రతీ వొస్తువూ తనూ, సీతా రావడంకోసం ఎదురు చూస్తూ రానందుకు నొచ్చుకుంటా యేమో అన్న వూహ వొచ్చింది.


గ్లాసు కింద పెడుతూ నవ్వుకున్నాడు. తను ఇలాటి వూహలింక వొదిలెయ్యాలి. తను ఇంత వొంటరి మనిషి కాడు.

"ఇక్కడే ఆ ముసి ముసి నవ్వులన్నీ ఒలక బోసెయ్యకోయి! పద. హారన్ మోగుతోంది." □□□



● ఒక జిల్లా పరిషత్తు హైస్కూలు మేష్టారింట్లో దొంగలు పడ్డారు. తెల్లారి లేచేసరికి ఇంటినిండా కాగితాలు, కాంపోజిషన్ పుస్తకాలు చిందరవందరై వున్నాయి. "ఏమన్నా పోయాయేమో చూడండి" అని ఇరుగు పొరుగు వాళ్ళు సలహా ఇచ్చారు. మేష్టారు ఇల్లంతా వెదుకుతుండగా డ్రాయరు సొరుగులో ఒక పది రూపాయల నోటుకు గుచ్చి ఒక కాగితం ముక్క కనబడింది. దానిమీద ఇలా రాసి వుంది: "నువ్వెలా బతుకుతున్నావో మా కర్థం కావటం లేదు."

ఎమ్. సత్యనారాయణ రాజు, వాల్తేరు.



హోటలోపాఖ్యానమ్

విహాలో చాలమంది నిత్యం "కాఫీ దేవాలయాల"ను సందర్శిస్తూ వుంటారు. స్నేహితులతో వెళ్ళడం కూడా కద్దు. అలా వెళ్ళినప్పుడు బిల్లు భారం మీ మీద పడకుండా గౌరవంగా తప్పుకొనే సూక్ష్మ మార్గాలిందులో వున్నాయి. ప్రయత్నించండి. ఆ పైన ఆ సర్వేశ్వరుడి దయ; మీ ప్రాప్తి.

1. హోటలులో ప్రవేశించేటప్పుడు ముందు గంభీరంగా నడిచి సాధ్యమైనంత వఱకు మూల కుర్చీలలో కూర్చోవాలి.

లాభం:—ఇలా చెయ్యటం వల్ల సర్వర్ బిల్ ఇచ్చేటప్పుడు మీరు అతని చేతి కందరు. అందుచేత మీ కన్న ముందర కూర్చొన్న ఆసాములలో ఎవరో ఒకరు బిల్లు వాత పడుట సంభవం.

నష్టం:— మూల కూర్చోవటం వల్ల హోటలు కాస్త పాతదయితే దోమలు, నల్లులు మొదలైన క్రిమి కీటకాదులు మిమ్మల్ని బాధించవచ్చు. కాని ఏం చేస్తాం. "కష్టే ఫలే" అన్నారు పెద్దలు.

2. ఇక ఆర్డ రివ్వటం. మీరు తొందఱపడి "ఇది తే, అది తే," అని అడగొద్దు. ఎవరైతే ఆర్డ రిస్తారో వాళ్ళ చేతులలోనే చివరికి బిల్లు పెడతాడు సర్వర్. కనుక ఎవరో ఒకరు, ఏదో ఒకటి తెమ్మన్న తర్వాతనే మీరు కూడా అదే అని ముభావంగా తల ఊపడం మంచిది.

లాభం:—ఇందు వల్ల మీకు సర్వర్‌తో అట్టే "పరిచయం" పెరగదు. బిల్లు భయం కూడా దూరమవుతుంది.

నష్టం:— ఒక్కొక్కసారి మీ కిష్టంలేని పదార్థాలు తగలచ్చు. ఫరవా లేదు. శ్రీరామచంద్రు డంతటివాడు కందమూలాలు తిని జీవించ లేదా?

3. మీరు లిమిట్స్ పాటించాలి. అవతలి వాడు మసాలదోశె (20 న॥ పై॥) ఆర్డరిస్తే మీరు రవ్వదోశె (15 న॥ పై॥) ఆర్డరివ్వాలి. తేడా 5 నయా పైస లయినా బిల్ అతడే యిచ్చుకోవాలి.

కష్టాలు:— అవతలివాడు మీ కన్న తెలివైనవాడై సింగిల్ యిడ్లీ అంటాడనుకోండి.

తరణోపాయం:— ఏం చేస్తాం? "కాఫీ చాలు బ్రదర్" అనండి.

పోసిబిలిటీ:— మీకు బాగా ఆకలి వేస్తోంది. అప్పుడు అవతలి వాడు ఏది ఆర్డరిస్తే మీరూ అదే చెప్పండి. అందుచేత బిల్ మీ ప్రాప్తి అవడానికి అవకాశాలు 50%. సరే, గేంబిల్ చెయ్యండి. ఆ పైన మీ అదృష్టం.

4. సరే, తినడం అయింది. సర్వర్ బిల్లు తేవటానికి లోపలకు వెళ్ళాడు. మీరు గబ గబ బయటకు వెళ్ళి సిగరెట్స్ (బెర్కిలీ మాత్రం), వక్కపొడి కొని తెండి.

లాభం:— ఇలా చేయడం వల్ల పావలా, అర్ధతో తేలిపోతుంది. అవతలి వాళ్ళు చచ్చినట్టు బిల్లు యివ్వాలి.

నష్టం:— అవతలివాళ్ళు మీ ఎత్తు పసికట్టి బిల్ కూడా మీ చేతి కిచ్చారను కోండి. ఇది అదనపు దండగ, మీ దురదృష్టం. పరిస్థితులను బట్టి మసలు కోవాలి. వెనక నకులుడో, ఎవడో చినుకు చినుక్కి మధ్యన గుర్రాన్ని తోలినట్టు.


5. డబ్బు చెల్లించే వాణ్ని ముందరే సెలెక్టు చేసుకొన్నారను కోండి. అప్పుడు మీ ఋణం ఉంచుకోకుండా వాణ్ని పొగడండి. "అబ్బ! ఇవాళ లెక్చరర్ని ఏం ఏడిపించావురా" అనో, "ఇవ్వాళ సెకండ్ అవర్లో సీత నీకేసే చూసింది" అనో.

6. సర్వర్ బిల్లు తీసుకొని వస్తాడు. మీరు దగ్గరున్న న్యూస్ పేపరో, లేక మేగజైనో (కూడా తీసుకొని వెళ్ళటం చాల మంచిది! "పుస్తకం హస్త భూషణం" అని పెద్దలు ఊరికేనే అన్నారా?) దీక్షగా చదివేస్తూ వుండాలి— ఎవడో ఒకడు బిల్లు తీసుకునే వరకూ.

7. ఇక యిది ఆఖరి సీను. సర్వర్ బిల్లు మీ చేతిలో పెట్టాడు. ఇక మీరే "పే" చెయ్యాలి. అయినా నిరుత్సాహపడకండి. ధైర్యంగా కౌంటర్ దగ్గర కెళ్ళి పది రూపాయిలనోటు విసరండి. ఒక్కొక్కసారి చిల్లర ఉండక పోవచ్చు ప్రొప్రయిటర్ దగ్గిర. అందులో ముందర ఎవడైనా పది రూపాయల చిల్లర తీసుకొని వెళ్ళాడో లేదో చూసి మరీ వెళ్ళండి. మీ గ్రహ బలం బాగుంటే, "చిల్లర లేదండి" అంటాడు. అప్పుడు మీరు దర్జాగా "ఒరేయ్! ఛేంజ్ వుంటే ఎవ్వరైనా పే చెయ్యండిరా" అనొచ్చు.

8. సరే. బిల్ "పే" చేసి వచ్చారు దిగాలు ముఖంతో. కాని ఉత్సాహం పుంజుకొని సినిమా ప్రోగ్రాం పెట్టేయండి. కొంత నష్టమైనా కూడ దీయవచ్చు. గుడ్ లక్!

—నందుల సుబ్రహ్మణ్యమ్



సర్వీసు రిజిష్టరు

"ఇదిగో రామన్న! బుద్ధుందా నీకు? నేను చెప్పిందేమిటి? నువ్వు చేసిం దేమిటి?"

"మీరు చెప్పిందేనండమ్మగారూ! పరువులు తీసి ఎండలో వేయమన్నారు. వేయబోతుండగా, మళ్ళీ వేసుకోవచ్చుగానీ బజారుకెళ్ళి తలనూనెబుడ్డి తీసుకరమ్మన్నారు...."

"సర్లే - సంజాయిషీ చెప్పొచ్చావు. మరేం లేకపోయినా మాటలకు మాత్రం కొదువలేదు...."

కిటికీ లోనుంచి రామన్నకు జరుగుతున్న మర్యాదను శ్రద్ధగా కనిపెడుతున్న వంట లక్కీ సీతమ్మ, లోపలికి వెళ్ళగానే అతణ్ణి పరామర్శించింది.

"ఇంతకు మునుపు నాకూ వడ్డన జరిగిందిలే రామన్న మామా! ఆ కాడికి మన పాడేనయం. నిద్రలేచి ఎవరిముఖం చూచాడో ఆఫీసు జవాను. నెల రోజులప్పు డెప్పుడో చెప్పిన పని చేయలేదని విదిలించి పారేసింది. ఏం విడ్డూరమోగానీ, తెల్లారి నప్పటినుంచీ అమ్మగారి వాలకమంతా అదో రకంగా వుంది. అంతెందుకు,—తోటలో నుంచీ ఓ రోజాపువ్వు తెచ్చివ్వు. ఒక సారి వాసన చూచేసరికి అది మాడి మసై పోవాలి. ఒక గొప్పడమూ, ఒక రోజడమూ! దరిదాపుల్లోకి మనుషులు వెళ్తే విరుచుక పడి పోయిందన్న మాటే!"

నిజమే! లీలావతమ్మ మనసు మనసులో లేదు.

కానీ లీలావతమ్మ మనసు మనసులో లేక పోవడానికి నౌకర్ల అవిధేయత, భర్త ప్రవర్తన, బిడ్డల అవినయం లాంటివేవీ కారణాలు గావు. అలాంటి కారణాలవల్ల ఆమె యిలా తల్లక్రిందులై పోవడమన్నది ఆ కుటుంబ చరిత్రలో అపూర్వమైన విషయం. ఆ మాట కొస్తే నౌకర్లు గడ గడ లాడటానికి లీలావతమ్మ క్రీగంటి దృక్కోణం నుంచీ ప్రసరించే నిశిత వీక్షణం ఒక్కటి చాలు. అమ్మగారి మాట జవ దాటితే తమకు రానున్న ముప్పు ఎలాంటిదో ఆఫీసు జవాన్లకు క్షుణ్ణంగా తెలుసు. ఒక్క చూపుతో పనివాళ్ళను, ఒక్క నవ్వుతో భర్తను, ఒక్క మాటతో బిడ్డలను అదుపులో వుంచుకోగలిగిన లీలావతమ్మలో హఠాత్తుగా యిలాంటి మార్పు పొడ సూపిందంటే—అందుకు కారణం చెప్పుకో దగినంత గొప్పదే అయివుండాలి....

అదేమిటో నౌకర్లకు అంతుపట్టడం లేదు.

బిడ్డల సంగతి అందుకు డిటో గానే వుంది.

వేసవి సెలవులు సంతానమంతా యింటి దగ్గరే వుంది. పరీక్షలకోసం తెగ చదివి పుస్తకాల పైన్నే విరక్తి పుట్టి యిక మళ్ళీ కాలేజీ తెరిచేదాకా అక్షరం ముఖం చూడ గూడదనుకొని ఒట్టు వేసుకున్న రవిబాబు, తల్లిగారి ధోరణికి అర్థం స్ఫురించక చివరి కొక పుస్తకాన్నే శరణుగోరి తోటలోకి వెళ్ళిపోయాడు. రేడియో సంగీతానికి అను వుగా భరత నాట్యాలు సలిపే హైస్కూలు కుర్రాళ్ళు రాము, శేషూ గదిలో నక్కి కూర్చుని బుద్ధిమంతుల్లా పత్రికల్లో బొమ్మలు చూచుకుంటున్నారు. చిట్టచివరి పిల్లలిద్దరూ గాలి పీకల తూతూ మేళాన్ని గూడా కట్టి పెట్టి పెరట్లో మల్లె పందిరి క్రింద గుట్టు చప్పుడుగా బొమ్మల పెళ్ళి చేసుకుంటు న్నారు. ఎటొచ్చీ కానరాకుండా వున్నది పెద్దమ్మాయి సులోచన పొలకువ మాత్రమే! తలుపులు బిడాయించుకుని గదిలో మంచంపైన బోరగిల పడుకుని గొంతెత్తి ఏడువలేక — ఒక వేళ అలా ఏడవడమంటూ జరిగి, ఎందుకేడుస్తున్నావని ఎవరైనా అడిగితే కారణం బయట పడి చెప్పడానికి వీల్లేనిది గదా అన్న బెంగచేత ఆమె లోలోపలే కుమిలి పోతోందని ఆ కుటుంబంలో ఒక్క వ్యక్తిని మినహా యిస్తే మరెవ్వరికీ తెలియదు.

తెలిసిన వ్యక్తి లీలావతమ్మ.

ఆమె కైనా పెళ్ళి కూతుర్ని ఓదార్చ గలిగే పాటి నిబ్బరం కలగడం లేదు. నిబ్బరం మాట దేవు డెరుగు. ఓ పైపున ఆమెకు ఒళ్ళు మండిపోతోంది. ముంత పొగలాంటి కోపం మనోగహ్వర మంతటా నిండి నిబిడీకృతమై బయట పడేదారిలేక, లోపల తావులేక మనిషిని మల్ల గుల్లాలు పెడుతుంటే ఒళ్ళుమండకేం చేస్తుంది?

ఆ కోపంతోనే స్నానాల గదిలోకి వెళ్ళింది లీలావతమ్మ. బాయిలర్‌లో నీళ్ళింకా వేడెక్కలేదు. కోపాన్ని వెలి గ్రక్కడానికి అది నిస్సందేహంగా ఒక మంచి అవకాశమే! కానీ అది మామూలుగా స్నానాలు చేసే వేళగాదు. పోనీ చన్నీటి స్నానం చేస్తే?

ఆ పనీ చేసి చూచింది లీలావతమ్మ. శీతోదక స్నానం వల్ల మనసు కాస్త నిమ్మ దిస్తుందేమోనన్న ఆశ గూడా అడియాసే అయిపోయింది.

లోకంలో ఎన్ని జబ్బులైతే వున్నాయో, అన్ని చికిత్సలూ వున్నాయి. విరహతాపా నికి సైతం వెయ్యిమందుల్ని సూచి స్తాయి ప్రబంధాలు. ఏవిధంగా చూచినా మానసికమైన వేదనకు మాత్రం మందులు మృగ్యమేమో! అప్పటికి తన వూహ కందినంతలో ఏవో కొన్ని చిట్కాలు వాడి చూచింది లీలావతమ్మ. ప్రత్యేకించి పండు గలకు పబ్బాలకు కట్టుకునే పట్టుచీరలో ముస్తాబైంది. వేళగాని వేళలో శుభ్రంగా తలదువ్వుకుని కొప్పునిండుకూ పువ్వులు తురుముకుంది. 'అబ్బే నాకేం చింత! ఐనా యిప్పుడేం కొంపమునిగిపోయింది గనుక!' అన్న తెచ్చికోలు ఓదార్పుతో యింట్లో ఈ మూలనుంచీ ఆ మూలకు నాలుగైదు సార్లు బరాబరులు తిరిగింది. ఎంతచేసినా ఎదలో ముల్లులాంటి ఆ చింత మనోవీధిలో నిశ్చలంగా వుండనేవుంది.

లీలావతమ్మ మనస్సు యింతగా కోప ఘూర్ణితం కావడానికి మూలకారణమైన వ్యక్తి పేరు విశ్వం. ఆ విశ్వ మన్నవాడు యింకా పాతికేళ్ళయినా నిండని కుర్రకుంక. ఎం. ఏ. పరీక్షలో క్లాసు తెచ్చుకున్నాడన్న మాటేగానీ అతగాడు లోకజ్ఞులవద్ద నేర్చు కోవలసిన పాఠాలు యింకా లక్షవున్నాయి. అతణ్ణి చేదుమేయమని యిక్కడెవరూ చెప్ప లేదు. కళ్ళకు గంతలుగట్టి ముళ్ళడొంకల్లో నడిపించలేదు. స్వకులంవాడని చేరదీసి, లేతగుండెలో గొప్ప భవిష్యత్తుకోసం ఆశలు ప్రోదుచేసి మంచి ముత్యంలాంటి పిల్లనిచ్చి పెళ్ళిచేయాలనుకోడమే తమ నేరం! ఒక వేళ తన కిష్టంలేదనే అనుకుందాం. తన

మధురాంతకం
రాజారాం

అభిప్రాయాన్ని ఎందుకు స్పష్టంగా చెప్పగూడదు? తను పలానావారికి అల్లుడు కాబోతున్నట్టుగా వూళ్ళోవారందరూ తలపోసుకున్న తర్వాత అతడిప్పుడు యిలా పెడముఖంపెట్టి వైదొలగి దూరంగా వెళ్ళిపోడంలో ఆంతర్యమేమిటి? అప్పటికిదంతా అల్లాటప్పా వ్యవహారమనా అతడి ఉద్దేశం? అతగాడి కెన్ని గుండెలు?

లీలావతమ్మ చీటికీ నూటికీ కోప్పడే మనిషిగాదు. కానీ అభిమానానికి తగిలిన అవమానం అగ్గిపైన గుగ్గిలం లాంటిది. మనసులో మంటల్ని రగుల్కొల్పే కోపాతిరేకానికి గురైన అనుభవం కలగడానికి - లీలావతమ్మ కిది రెండోసారి! మొదటిసారి యిరవైరెండేళ్ళ క్రితం యించుమించుగా యిలాంటి అనుభవమే కలిగిం దామెకు —

● ● ●

లీలావతమ్మ కొత్తకోడలుగా కాపురంలో కుడికాలు పెట్టిననాటికి సుదర్శనంగారు ఓ గవర్నమెంటు ఆఫీసులో సామాన్య గుమాస్తాప్రాయుడు.

కోడలుగా అత్తమామలకు, మరదలుగా బావగారికి, చెల్లెలుగా తోడికోడలికి సంతృప్తినీ, సంతోషాన్ని కలిగించినా కలిగించక పోయినా లీలావతమ్మ లీలలు భర్తకు మాత్రం అమందానందాన్నే కలిగించాయి. స్వగ్రామంలో వుండి సమష్టి కాపురంలో మెలగవలసిన అవసరంగానీ, అవకాశంగానీ బొత్తిగా లేకపోవడంతో లీలావతమ్మకు ఆదినుంచీ తన దారి నిష్కంటకంగానే తోచింది. సుదర్శనంగారిలో రసికత్వం పాలు హెచ్చు. పదిమంది స్నేహితులు, ప్రపంచ విశేషాల పరిశీలన, సాహిత్య సంగీతాలపట్ల కొంత అభిరుచీ - యివన్నీ పైపై మెరుగులైతే, ఆఫీసులో ఆధిపత్యం కోసం అనంతకోటి ఉపాయాల అన్వేషణ అన్నది ఆయన వ్యక్తిత్వంలోని లోవెలుగు! అందుకు తగ్గట్టు - ఇల్లు చక్కదిద్దుకునే వంతు మాది. - జగత్తును జేబులో వేసుకునే వంతు మీది - అన్నంత నిష్కర్షగా బాధ్యతల్లో భాగపరిష్కారం చేసిపెట్టగల భార్య దొరికితే ఏ భర్తమాత్రం సంతోషించడు?

సుదర్శనంగారిని అసహాయకుడని చెప్పడానికి వీల్లేదుగానీ, అనేక విషయాలను గురించి స్వంతంగా ఆలోచనకు పూనుకుని బుర్రకు శ్రమ కలిగించుకోడం ఆయన స్వభావానికి విరుద్ధం. ప్రత్యక్షంగా తనతో సంబంధంలేని విషయాలపైన తన విశ్వాసాని కెక్కినవారి మాటను వేదవాక్యంగా తీసుకోడమే ఆయన తత్వం. పెళ్ళయిన క్రొత్తలో ఆయన ఆ పెళ్ళిమూలంగా తనకు సంఘంలో ఓ విశిష్టస్థానం లభించినట్టు కలైనా కనలేదు. విచిత్ర మేమిటంటే ఒకనాడు కలైనా కానిది అనతికాలంలో ఆయన పాలిటికి నిఖార్సయిన నిజంగా భాసించింది. అలా భాసించడానికి లీలావతమ్మ కృషితోబాటుగా పరిస్థితులుగూడా కలిసివచ్చాయి.

పెళ్ళినిగురించి ముక్తసరిగా ఓమాట చెప్పమని అడిగితే - ఎవరోగానీ ఒక అనుభవజ్ఞుడు ప్రతివ్యక్తీ ఎప్పుడో ఒకప్పుడు తప్పనిసరిగా తల ఒగ్గవలసిన ప్రమాదం - అన్నాడు. అందులోని అతిశయోక్తిని మినహాయిస్తే వివాహాన్ని జీవితంలోకి గొప్ప మార్పును తీసుకొచ్చే సంఘటనగా ఒప్పుకోక తప్పదు. లీలావతమ్మ లీలాకుమారిగా వున్న రోజుల్లో పెళ్ళినిగురించి, ఎక్కడో తనకు తెలియకుండా అజ్ఞాతంగా పుట్టి పెరుగుతున్న భర్తనుగురించి ఎలాంటి పగటి కలలుగన్నదో మనకు తెలియదు. అయినా ఒకవిధంగా వూహించడానికి ప్రయత్నించవచ్చు - ఒక కొలను, చుట్టూరా పుష్పవాటిక. ఆ పరిసరాల్లో అందమైన మేడ. ముంగిట వాలుకుర్చీలో ఒక నవయువకుడు. అతడు పొడుగరి. స్థూలకాయుడుగాడు. తెల్ల జామపండువంటి దేహచ్ఛాయ గలుగువాడు. ధవళమల్లీకోరకముల దంతపంక్తి గలుగువాడు. మనసుపడి పులి పాలు తెచ్చియిమ్మన్నా వెనుదీయని ధైర్యసాహసాలు గలిగినవాడు - నీకు దక్కితి, నీవు నాకు దక్కితివి, సాగిపోదామింక సరగున మనము - అంటూ సుఖలోకాల్లో కొత్త కొత్త పుంతలవెంట తనను తనవెంట త్రిప్పుకునేవాడు - అయిన భర్తకోసం ఎదురుతెన్నులు చూచివుంటుంది లీలావతమ్మ. ఆమె అదృష్టవంతురాలు. ఇంచుమించుగా అలాంటి భర్తే లభించా డామెకు! కానైతే అతడు తానాశించినట్టుగా ఒంటరిగా మాత్రం లేడు. (లీలావతమ్మ వూహల్లో) సరోవరం మధ్యలో తామరపువ్వు, దాని చుట్టూ ముండ్లనాచు.

"మా అబ్బాయి, మా అబ్బాయి" అంటూ కొందరు,—

"మా తమ్ముడు, మా అన్నయ్య" అంటూ కొందరు,

"మా మామయ్య" అంటూ మరి కొందరు—

ఈ సమూహంలో తన భర్తకింత వరకూ ప్రత్యేకమైన జీవితం లభించినట్టు లేదు!

"చూడమ్మా లీలా! వాడసలే అబ్బనా కారపు మనిషి. వేళకు పట్టెడన్నం పెడితే వాడింకేమీ అడగడు. ఆలస్యం జరిగితే అనారోగ్యం దాపురించినట్టే ...." అంటూ ముసలావిడ—

"వాడు లేనిదే మాకు పండుగల్లేవు. ఒకవేళ వాడు బద్ధకించినా నువ్వయినా బలవంతంచేసి ఏడాదికి నాలుగైదు సార్లు వచ్చి పోతుండాలి...." అంటూ బావగారు.

"నాన్నగారు, పెద్దన్నయ్య చల్లగా వున్నంత వరకూ మాకు చిన్నన్నయ్య పెట్టు పోతలు అక్కర్లేదులే చిన్న వదినా! అప్పు డప్పుడూ మీరు మా యిళ్ళకు వచ్చి పోతుంటే చాలు" అంటూ యింటబుట్టిన ఆడు పడుచులు.

అభిమానాలు, మమకారాలు అన్నీ తమ సొత్తే అయినట్టు అప్పగింతల పాట మినహాగా అంత పనీ చేశారు.

"వీళ్ళు పీక్కుతినే వాళ్ళలా వున్నారే తల్లీ! ఎరగక పోయి యిచ్చామే లీలా! బిడ్డ గతేమౌతుందో గదరా దేవుడా?" అంటూ కంటనీరు పెట్టుకుంది లీలావతమ్మ మేనత్త.

లీలావతమ్మ మేనత్తకు బిడ్డలులేరు. పుట్టని బిడ్డలపైన పెట్టవలసిన మాతృవాత్సల్యాన్నంతా ఆమె మేనకోడలికి మీదు కట్టింది. పెంచిన మమకారమేమో పాపం! భర్తకు రెండోపెళ్ళి చేసిన ఆడది గూడా అలా దురపిల్లి వుండదు.

వివాహ జీవితం ప్రారంభమైన కొత్తలో ప్రహ్లాదుడి భక్తి పారవశ్యంతో సరిపోల్చదగిన ప్రణయ పారవశ్యంలో వుండిపోయిన


సుదర్శనంగారికి యితరుల్ని గురించి ఆలోచించే అవకాశం సమకూరింది గాదు. ఆ తన్మయత్వం లోనుంచీ తేరుకునే సరికి ఆయనకు కనిపించిన వారు భార్య వైపు బంధువులు. వాళ్ళు అదృశ్య లోకాల్లోనుంచీ మానవ ప్రపంచంలోకి దిగి వచ్చిన కొత్త రకం నమూనాల్లా వున్నారు. కంటికి కనిపిస్తారే గానీ, కళ్ళు మూసుకుంటే వాళ్ళక్కడున్నందుకు గుర్తుగా కించిత్తు సవ్వడైనా వినరాదు. శత్రురాజ్యాల్లోకి ప్రవేశించిన గూఢచారుల్లా అంత గుంభనగ వుంటారు. మానవుడు కట్టిన గుళ్ళకూ గోపురాలకు వాళ్ళెంత దగ్గరగా వుంటారో, దేవుడు సృష్టించిన మానవులకు అంత దూరంగా వుంటారు. ఆచారపరాయణత్వం ఎంత యెక్కువో కలుపుగోలుతనం అంత తక్కువ. వాళ్ళకు మౌనభంగం కలగజేయడంకన్నా నాట్లుపెట్టి మందు దట్టించి పాషాణాలనైనా భేదించడం సులభం! విశ్వప్రయత్నం చేసి అంతపనీ చేశామంటే - కొండపేటులో రాతినెరియలోనుంచీ బయటకు పొడసూపిన వృక్షాంకురంలా ముడివడిన పెదవుల కదలికలోనుంచీ మందస్మితంలో దశాంశమైనా చేయని కాంతిలేశం ఒకటి యిట్టే కనుచూపును కికురించి మాయమౌతుంది....

సుదర్శనంగారు ఆశ్చర్యపడ్డారు. ఆ ఆశ్చరాన్ని ఏకాంతంలో భార్య సాన్నిధ్యంలో వెళ్ళగ్రక్కారు గూడా!

"చూడు లీలా! మరేమీ అనుకోకపోతే ఓమాట చెప్పాలని వుంది. మనుషులంగా పుట్టిన తరువాత బ్రతికిన నాలుగురోజులు ఆడుతూ పాడుతూ ఆనందంగా బ్రతకగూడదూ! ఏవో రాజ్యాలు పట్టదలచుకున్న వాళ్ళకుమల్లే ఆ మౌన మేమిటి? ఐశ్వర్యాలన్నీ ఒక ఎత్తయితే జీవనోత్సాహం ఒక్కటి మాత్రమే ఒకఎత్తుగదా! పోనీ వయసుమళ్ళిన వాళ్ళసంగతి వదిలేద్దాం. పరుగిడుతున్న పామును తరిమి పట్టుకునే వయస్సులో వున్న మీ తమ్ముళ్ళు ఇలా కళ్ళుతెరచుకునే నిద్రపోవడ మెందుకోనా కర్థంగాదు. మా యింట్లో మే మిలా కాదబ్బా! నాన్నగారూ, అన్నయ్యా, బావలెవరైనా వస్తే వాళ్ళు, వాళ్ళతోబాటుగా నేను - అందరమూ కలిసి పేకాటకు కూర్చునేవాళ్ళం! పెద్దా చిన్నా అన్న తారతమ్య విచక్షణ లేదనుకోవద్దు. అడ్డుగోడల్లేకుండా హాయిగా కాలం గడిపేవాళ్ళమంతే! ఆ సంబరాలే వేరు! ఆ సందడే వేరు...."

లీలావతమ్మ అభిమానవంతురాలని చెబితే చాలదు. ఆమె వ్యక్తిత్వానికి తీవ్రమైన స్వాభిమానమే పునాది అని చెప్పడం సమంజసంగా వుంటుంది. భర్త తనవాళ్ళను గురించి ఈసడింపుగా మాట్లాడినరాత్రి ఆమెకు కన్నుపొడుచుకున్నా నిద్రపట్టింది గాదు. 'అయ్యో, నత్తగుల్లల్ని ఎరుగరా' అంటూ కొంగలు హంసల్ని ఎగతాళి చేశాయట! మునుపటి కెవరో బెస్తవాడు పువ్వుల బజారులో వెళ్తూ 'అబ్బే, కంపు కంపు' అంటూ ముక్కులు మూసుకున్నాడట! వెకిలితనానికి ఆటపట్టయిన కుటుంబంలో పుట్టిన తరువాత ఆ సుగుణం ఈయనలో మాత్రం ఎందుకుండకపోతుంది? ఎదుటివారి పెద్దమనిషితరహా ఎలా అర్థమౌతుంది?

మరునాటి వుదయం కాస్తా తొందరగానే నిద్రలేచిన సుదర్శనంగారికి లీలావతమ్మ



ముఖం అరుణోదయ సమయంలో పూర్వదిశాంగన వదనంలా కమిలిపోయివున్నట్టు కనిపించింది. భార్య ముఖం జేవురించడానికి కారణమేమిటో ఆయన వూహకు అందింది గాదు.

• • •

నాటికీ నేటికీ పరిస్థితుల్లో ఎంతోమార్పు వచ్చినమాట నిజం!

ఆశించినంతకంటే ముందుగా సుదర్శనం గారికి ప్రమోషన్లు వచ్చాయి. ఆఫీసు కంతటికీ తనే అధికారి కావడం జరిగింది. సమాజంలో హోదా పెరిగింది. పిలిస్తే పలికే నౌకర్లు - కాలింగ్ బెల్ మ్రోత కోసం కాసుకుని కూచునే బంట్రోతులు - పనులకోసం ప్రాపకంకోసం యింటిచుట్టూ తిరిగే గొప్పవాళ్ళు. ఉద్యోగంలో ఉన్నతి మూలంగా దూరప్రాంతాలకు బదిలీలు. అక్కడివాళ్ళకు సుదర్శనం గారొకప్పుడు గుమాస్తాగా పనిచేశారనిగానీ, వాళ్ళ నాన్నగారు రిజిష్టరాఫీసులో దస్తావేజులు వ్రాసి చేసిన సంపాదనతో కొడుకులను చదివించాడనిగానీ తెలియక పోవడం - మున్నగు పరిణామాలన్నీ సుదర్శనంగారిపైన బాగా పనిచేశాయి. సూర్యోదయం ఆయన కంటబడి చాలా కాలమైంది. ఎనిమిదికో తొమ్మిదికో నిద్రలేచి, సింపాదిగా స్నానపానాలు, భోజనాదులూ ముగించి మిట్టమధ్యాహ్నవేళ కార్యాలయంలో ఎలక్ట్రిక్ పంకాక్రింద సేదదీరి, ఆఫీసు టైంలో యింకా మిగిలి వున్న వ్యవధిని క్రింది ఉద్యోగుల్ని గదమాయించడానికి వినియోగించి, ఆఫీసునుంచీ అలాగే ఏ క్లబ్బుకో, సమావేశానికో, సినిమాకో వెంచేసి దాదాపుగా అర్ధరాత్రి సమయానికి యిల్లుచేరుకునే అనుదిన కార్య

క్రమంలో సుదర్శనంగారికి వెనుదిరిగి తమ జీవితాన్ని సింహావలోకనం చేసుకునే అవకాశాలు లభ్యంకావు. భాషలో అభినివేశం గడించిన తర్వాత హల్లుల్లో అక్షర క్రమం మరచిపోయిన పండితుడిలా ఆయన తననుంచీ ఎవరెవరు ఎంతెంత ఆశించారన్న విషయాన్ని విస్మరించారు. అసలలాంటి తలపులకే ఆయన హృదయంలో చోటు దొరికింపిగాదు. పదిహేనేళ్ళక్రితం తండ్రిగారు పోయారు. సుదర్శనంగారు ఒంటరిగా వెళ్ళివచ్చారు. కన్నతల్లి అంతిమ యాత్రా సందర్భంలో ఆమాత్రమైనా చేయలేక పోయారు. తమ్ముడు ఒకానొక వూళ్ళో వున్నాడనుకుని అన్నగారు తంతియిస్తే - తమ్ముడికి ఆవూరినుంచీ బదిలీవచ్చి ఆరు మాసాలైంది. తంతి సకాలానికి చేరింది కాదు. సుదర్శనంగారి అక్కచెల్లెళ్ళ భర్తలు ఉద్యోగాలు చేసేవాళ్ళుకాదు. కనుక వాళ్ళ చిరునామాలు మారవు. కానీ తమ చిరునామా మారినప్పుడల్లా బంధువులకు జాబులు వ్రాస్తూ సూచనేపాటి ఓపికగానీ తీరికగానీ సుదర్శనంగారికి లేదు. వాళ్ళు వస్తే రావచ్చు. వచ్చి కొంతకాలం వుండి పోవచ్చు. తనకేమీ అభ్యంతరం లేదు. కానీ వాళ్ళెందుకో రావడం మానేశారు !

వచ్చినప్పుడు వాళ్ళకెలాంటి మన్నన లభ్యమైందో, సుదర్శనంగారికి తెలియదు.

అప్పుడప్పుడు శుభలేఖలు కొన్ని టేబిలుపైన కనిపించేవి. ఎంతగా పెళ్ళికి రాడని తెలిసినా, మరెంతగా తమ కిష్టంలేకపోయినా మేనల్లుళ్ళకు. మేనకోడళ్ళకు పెళ్ళిళ్ళు జరుగుతున్నప్పుడు మేనమామకు ఆహ్వానం పంపకపోవడం సముచితంగా వుండదని ఆవతలవాళ్ళ ఉద్దేశం. 'అరే, యిదప్పుడే పెళ్ళి కెదిగిందా' - 'వీడికప్పుడే పెళ్ళా' అనుకునేవాడు సుదర్శనంగారు. ఒక్కొక్కప్పుడు సుదర్శనంగారి ఆశ్చర్యమే వధువుల పాలిటికి, వరుల పాలిటికి పెళ్ళి కానుకగా పరిణమించేది. ఎందుకంటే కొన్ని ఆహ్వానాలు తీరా శుభకార్యమైన తర్వాత పది పదిహేను రోజులకుగానీ ఆయన కంట బడేవికావు.

వచ్చిన మార్పు సుదర్శనంగారి పైకి ఎంత తాపీగా వచ్చిందో, లీలావతమ్మ పైకి అంత ఉధృతంగా వచ్చింది. మార్పును తీవ్రంగా అభిలషించడం చేతనేగావచ్చు. కేవలం తన ఆత్మశక్తి మూలంగానే సిద్ధించినట్టు లీలావతమ్మ అనుకోగలిగింది. ఇప్పుడామెకు బీరువానిండుకూ చీరలున్నాయి. ఇనప్పెట్టెలో దండిగా నగలున్నాయి. ఆమె సుదర్శనంగారిని డబ్బడగదు. ఇంకా ఆయనే ఆమె నడిగి అవసరం వచ్చినప్పుడు పదో పాతికో తీసుకుంటాడు. కాలేజీలో చదువుకుంటున్న కుమారుడు తల్లికే వ్రాసి డబ్బు తెప్పించుకుంటాడు. పేరంటానికి ప్రక్కవీధికి వెళ్ళాలన్నా యింటి ముంగిటకు రిక్షాబండి వచ్చి నిలుస్తుంది.

ఇంతగా మందీ మార్బలం లేనిరోజుల్లో కూతురు ఒంటరిగా వుండిపోతుందన్న బెంగతో లీలావతమ్మ తండ్రి అల్లుడి గృహంలోనే మకాం పెట్టాడు. సుఖాల్లో నైనా, కష్టాల్లోనైనా భర్తను అనుగమించడమే భార్య ధర్మంగనుక లీలావతమ్మ తల్లి గూడా ఆపనే చేసింది. మేనత్తకు అంత కన్నా గత్యంతరం లేకపోయింది. మిగిలిన వాళ్ళు తమ్ముళ్ళిద్దరు. వాళ్ళను ప్రయోజకులుగా చేసి లోకానికి చూపించాలని లీలావతమ్మ ఎంతగా పాటుబడిందో అంతగా వీధి ప్రతికూలించింది. అక్కడా యిక్కడా ఏవో చిన్న ఉద్యోగాలు చేస్తూ వాళ్ళక్కడే తమ తమ ఆలుబిడ్డలతో సంసారాలు నడిపిన మాట నిజమే. అయినా, ఆ కాపురాలు బ్రాంచాఫీసుల్లాంటివి. హెడ్ ఆఫీసు అండదండలు, ఆదరాభిమానాలు పుష్కలంగా లభించకపోయి వున్నట్టయితే ఆ బ్రాంచాఫీసుల్ని ఎప్పుడో మూసివేయవలసివచ్చేది !

ధ్యేయం సిద్ధించిన తరువాత, యిక ఆశింపవలసిందేమీ కనిపించక లీలావతమ్మ మహారాణి గుల్నారులా జీవితంలో ఉప్పూకారం కోసం ముఖంవాచిపోయి వుండవలసింది. ఆ పరిస్థితినుంచీ తప్పించి, మళ్ళీ కాలమే ఆమెను అనుగ్రహించింది. మొదటి ప్రణాళికను విజయవంతం చేయగలిగిన ఆత్మవిశ్వాసంతో - ఆమె తన ధ్యాసను కొడుకుల చదువుపైకి, కూతురు పెళ్ళిపైకి మళ్ళించి ద్వితీయ ప్రణాళికకు పథకం తయారుచేయడంలో నిమగ్నురాలైంది. చదువులకేమి, డబ్బుంటే అవి మంచినీళ్ళ ప్రాయం ! వచ్చిన చిక్కల్లా పెళ్ళిదగ్గరే ! తెల్లనివన్నీ పాలనుకోగూడదు. పైపై మెరుగులు చూచి మోసపోగూడదు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోగూడదు !

సంబంధాలు తీసుకరాని దోషం సుదర్శనంగారిది గాదు. ఫైళ్ళమీద తన అభిప్రాయాన్ని వ్రాసి పైవాళ్ళ పరిశీలనకోసం పంపుకోడం ఆదినుంచీ ఆయన చేస్తున్న పనే ! ప్రతి సంబంధమూ లీలావతమ్మ నిశిత పరీక్షకు గురైంది. నచ్చలేదన్న ఆఖరు నిర్ణయంతో ప్రతి ఫైలు తిరుగుదారి పట్టినకొద్దీ సుదర్శనంగారిలో చిరాకు ఎక్కువైంది.

ఐనా లీలావతమ్మ మాత్రం ఏం చేస్తుంది ? నాలుగు సంవత్సరాలపాటు గాటిలో కట్టేసుకుని, బండి మడకాలాంటి సేద్యం పనులు చేసుకోడానికి అవసరమయ్యే కోడెల్ని బేరమాడ్డం చూడాలి ! కొమ్ము వాటం బాగుందా, నడుములో సత్తా వుందా, సుళ్ళున్నాయా, బాగా నెమరు వేస్తుందా అంటూ వెయ్యి జాగ్రత్తలు తీసుకుంటారు. మరిక్కడమాత్రం అల్లుడు తేరగా దొరకడం లేదుగదా ! సంచులతో కాసులు కుమ్మరించాలిగదా ! ఆదమరిస్తే కొంపమునగదూ !

ఒక సంబంధమైతే సూటికి మూరుపాళ్ల కుదిరినట్టే తోచి, చివరికొక్క లా పాయింటుతో బెడిసిపోయింది. కుర్రవాడు అందగాడే ! విద్యాధికుడే ! కాలుమీద కాలువేసుకుని తిన్నా తరిగిపోని ఆస్తి పాస్తులున్నాయి. అన్ని శుభలక్షణాలకూ తలమానికంగా తండ్రి కొక్కడే కొడుకు. తల్లి అతడి చిన్ననాడే చనిపోయింది. అంతా బాగానేవుంది. కానీ పుట్టు పూర్వోత్తరాల సంగతి వాకబుచేయగా ఓ దారుణమైన విషయం బయటపడింది. ఆ కుర్రాడి తల్లి భర్తపోరు పడలేక ఆత్మహత్య చేసుకుందట ! అది తరతరాలుగా తుపాకులు చేతబట్టి అరణ్యాల్లో వేటకువెళ్ళే కుటుంబమట ! మృగాలను వేటాడేవాళ్ళకు మనుషులొక లెక్కా !

శివధనుర్భంగం మానవసాధ్యం కాదేమో ననుకున్న జనకమహారాజులా సుదర్శనంగారు దిగులుపడిపోతున్న సమయం. లోకం గొడ్డుపోలేదు. ఇదిగో

నేనున్నాను - అన్నట్టుగా రంగంలో విశ్వం ప్రత్యక్షమయ్యాడు!

అల్లుడికి అవసరమైన మంచి లక్షణాలు కొన్ని విశ్వంలో వున్నమాట నిజమే! కానీ ఈ సంబంధంలోనైనా బొత్తిగా లోపాలు లేవని చెప్పడం సాధ్యంగాదు. పోనీలెమ్మని సరిపెట్టుకోదలచింది లీలావతమ్మ.

మీరు సరిపెట్టుకోడంతో ఏమయింది: నాకూ సరిపడాలిగాదా - అన్నట్టు అత డీలా చడీ చప్పుడూ లేకుండా చల్లగా జారుకో గలడని లీలావతమ్మ కేం తెలుసు!

సుదర్శనంగారు యింటికి రాగానే ఆమె చెప్పదలచుకున్న నాలుగు మాటలూ ఘాటుగా చెప్పేసింది.

"ఏమిటండీ మీరు! ఏం జరుగుతోందో తెలుసా మీకు? ఎరుగకపోయి మన చాప క్రిందికి ఘనమే నీళ్ళు తెచ్చుకున్నట్టయింది. ఆ కుర్రాడు మన సంబంధం తన కిష్టం లేదని చెబుతున్నాడట! తనెన్నడూ మనకు మాట యివ్వలేదనిగూడా చెబుతున్నాడట! ఇలాంటి బుద్ధిమంతుడు మరొకడు దొరక డనిగాదు. కానీ యిప్పుడు లోకు లేమను కుంటారు? ఏ లోపాన్ని గమనించి యిత గాడు మన సంబంధం వద్దంటున్నాడు? ముసుగులో గుద్దులాటలు మనకు పనికి రావు. నిక్కచ్చిగా నిలదీసి అడిగి తెలుసు కోవాలి మీరు...."

విశ్వంకోసం కబురు వెళ్ళింది. మనిషినే వెంటబెట్టుకురమ్మని జవానును పంపితే - అతగాడు ఉత్తరం తీసుకొచ్చాడు.


"పూజ్యశ్రీ సుదర్శనంగారికి

నమస్కారాలతో విశ్వం వ్రాసుకున్నది—

కొన్ని ఆవాంఛనీయ పరిణామాలవల్లనే గావచ్చు - నా ప్రవర్తన అపార్థానికి గురైంది. నా పరిస్థితుల్ని వివరించి చెప్పు కుంటే మీరు నన్ను మన్నించగలరని నాకు తెలుసు. ఎట్టయెదుట కూర్చుంటే వాటిని మీకు నేను ఒక క్రమంలో చెప్పలేక పోవచ్చు. ఎలాంటి అవ్యాప్తి అతివ్యాప్తి దోషాలు లేకుండా సంజాయిషీ చెప్పుకో డానికే ఈ ప్రయత్నం.

మీలాంటివారు ఆశలు పెట్టుకోడానికి నేను తగనేమోనన్న అభిప్రాయం నా కాదినుంచీ కద్దు: అందుకు కారణాలు లేక పోలేదు. నేను సామాన్యమైన కుటుంబంలో పుట్టాను. ఎంత సామాన్యమైన కుటుంబమో మీ రూహించలేరు. నేను పుట్టిన రోజుల్లో ఏపూట కాపూట గడవడమే బ్రహ్మాండంగా వుండేది. మా నాన్నగారికి ఒక్క తమ్ముడు - నలుగురు చెల్లెళ్ళు. మేనత్తల్లో పెద్దవాళ్ళ కిద్దరికే అప్పటికే పెళ్ళిళ్ళు జరిగాయి. మా నాన్నగారు పల్లెటూళ్ళో వీధిబడి చెప్పే వారు. మా చిన్నాన్న కొద్దిపాటి పొలం కౌలుకు చేసేవాడు. నేను పుట్టిన సంవత్సరం మా నాన్నగారి వీధిబడిని ప్రభుత్వం గుర్తించి వందరూపాయల గ్రాంటు యివ్వం చింది. మా చిన్నాన్న కౌలుకు చేస్తున్న పొలంలో మా వాటాకు నాలుగు గోనెల బెల్లం వచ్చి ఆయేడు గోనె బెల్లం యాభై రూపాయలు పలికింది. అందువల్ల కుటుం బంలో నేను అదృష్టవంతుడినన్న భావం కలిగింది. క్రిందపెడితే కందిపోతానేమో నన్నంత సుకుమారంగా వాళ్ళు నన్ను పెంచి పెద్దజేశారు.

అప్పటికి నాకు నాలుగేళ్ళ ప్రాయ ముంటుందేమో! కొండక్రింద మిట్టపల్లాల నేల ఒకటి మా నాన్నగారి పేరిటికి పట్టా వచ్చింది. ఉదయం లేవగానే యింటిల్లిపాదీ



అక్కడకు వెళ్ళిపోయేవాళ్ళం. నన్ను చెట్టు క్రింద కూర్చోబెట్టి ఆడా మగా భేదం లేకుండా మావాళ్ళు గొడ్డళ్ళతో గునపాలతో నేలను చదునుచేసేవారు. మధ్యాహ్నమయ్యే సరికి మా అమ్మ పెద్దతట్టతో అన్నం తీసు కొచ్చేది. ఆ విధంగా చదునైన నేలలో మా దాదాయి నిలువులోతు గుంటలు తీసి మామిడి మొక్కలు పాతాడు. మా చిన్నమ్మ, మేనత్తలు అరమైలు దూరం నుంచీ నెత్తిపైన నీటి కడవలు మోసి ఆ మొక్కల్ని కాపాడారు. ఎందుకు చెబు తున్నానంటే ఆ మామిడితోపు మహామాలే గనుక లేకపోతే నా చదువు కొనసాగేది గాదు.

మా దాదాయికి ముగ్గురూ ఆడపిల్లలే పుట్టారు. నా కిద్దరు తమ్ముళ్ళున్నారు. మీ రొకసారి మా యింటికి వెళ్ళి చూస్తే ఆ యింట పుట్టిన కుర్రవాడు ఎం. ఏ. దాకా చదువుకోగలిగి వుంటాడని అనుకోలేరు. మావూరి పరిసరాల్లో కట్టెకోసమనీ, కంపల కోసమనీ మాయింటి ఆడపడుచులు ఎక్కి దిగని గుట్టల్లేవు. కుటుంబాన్ని ఉద్ధరించ డానికి నేనొక్కణ్ణి చదువుకుంటే చాలునని తమ్ముళ్ళిద్దరు చదువులు మానుకున్నారు.

కానీ నేలనున్నవారు నేలనే వుండరు. మంచిరోజులు దగ్గరలో వున్నాయన్న ఆశ లేకపోతే లేమిని భరించడం అసాధ్యం. పోయిన సంవత్సరం మా మామిడితోపులో బావి పడుతుందని ఎవరో చెప్పారు. ఆశ దొడ్డది. అది ఎంతటి సామాన్య మానవుల చేతనైనా గొప్పకార్యాలు చేయిస్తుంది. కూలీలను పెడితే ఆరు మాసాలకైనా పూర్తి కాని బావి త్రవ్వకం మూడు మాసాలకే పూర్తయింది. నాలుగో మట్టులో నీళ్ళు కని

పిందాయి. ఓ పంపుసెట్టు తగిలిస్తే దాని క్రింద బంగారం పండుతుంది....

ఇవి నా పరిస్థితులు.

ఇలాంటి బాధ్యతలను భుజానమోస్తూ నేను నా జీవితంలోకి రాబోతున్న అర్థాంగిని ఏమాత్రం సుఖపెట్టగలనో తెలియదు. ముచ్చటైన బంగాళాలో చిన్న స్టౌ మీద వంటచేసి పెట్టటం మినహాగా మరొక అద నపు బరువును స్వీకరించనొల్లని యిల్లాలు లభ్యమైతే - మా కుటుంబం సంగతి వెన్న వడుతుండగా పగిలిపోయిన దాన చంద మౌతుంది. అలాగని నేను నూవాళ్ళ కేదో పెన్నిధిని త్రవ్వి తలకెత్తబోతున్నానని గాదు. సిరిసంపదలకన్నా, భోగభాగ్యాల కన్నా మమకారాలను, ఆత్మీయతలను ప్రాణప్రదంగా చూచుకోగలిగితే చాలు.

ఇంతకు మించి నేను చెప్పగలిగిందేమీ మించి లేదు. మీరు పెద్దలు. విజ్ఞులు. మిగిలిన నిర్ణయాలు మీకే వదిలేస్తున్నాను.."

నాలుగు రోజుల తర్వాత ఓ ఆదివారం నాడు మధ్యాహ్న భోజనానంతరం మేడ పైన గదిలో విశ్రాంతి తీసుకుంటున్నారు సుదర్శనంగారు. కత్తివేటుకు నెత్తురు చుక్క లేని ముఖంతో భర్తగారి బేటీకి వెళ్ళింది లీలావతమ్మ.

"జనానావారి నిర్ణయమేమిటో తెలిసింది గాదే!" అన్నారు సుదర్శనంగారు.

"ఏం చెప్పమంటారు! కొరివితో తల గోక్కున్నట్టుంది! ఆ కుర్రాడు దీని కేదో మచ్చుమందే చల్లినట్టున్నాడు. ఇంతచిన్న వయస్సులో అలాంటి గొప్ప బాధ్యతలు మోయలేనే పిల్లా అంటే వింటేనా! అపర సావిత్రిలా బయల్దేరింది. పోనీలెండి. ఎవరి కర్మకు ఎవరు కర్తలు...."

"అమ్మాయి కెలాగైనా నచ్చ జెప్పి ఆ ఫిరంగికోట వాళ్ళ సంబంధమే నిశ్చ యించ గూడదా లీలా!" ఆలోచిస్తూ అడి గారు సుదర్శనంగారు.

"ఆ మనుషుల్ని వేటాడే వాళ్ళకా పిల్లని ఇవ్వడం!" తీక్షణంగా ప్రశ్నించింది లీలా వతమ్మ.

"ఒక్కొక్కరికీ ఒక్కొక్క విధంగా ప్రసిద్ధి వస్తుంది. సహజమే! ఓ విధంగా చూస్తే లోకమంతా మా ఆఫీసులాగే వుంది. ఓ గుమాస్తా ఆలస్యంగా తప్ప ఆఫీసుకు రాడు. వేరొకడికి పనిచెబితే ప్రాణాలు పోతాయి. ఇంకొకతనికి లంచాలంటే పోయిన ప్రాణాలు లేచి వస్తాయి. వాళ్ళ వాళ్ళ ఎన్నుకున్న పద్ధతుల్లో వాళ్ళకు కాలం హాయిగానే గడచి పోతున్నట్టు తోస్తుంది. వాళ్ళకు సంబంధించిన బ్లాక్ మార్కులు, రెడ్ ఎంట్రీలు ఎప్పటి కప్పుడు ఓ పుస్తకంలో నమోదు చేయబడుతూ వుంటాయన్న విషయం వాళ్ళ కెందుకు అర్థం కాదో తెలియదు. అవసరం వచ్చినప్పుడు ఆ పుస్తకాన్ని తిరగ వేయడం జరుగుతుంది. చేసుకున్న వాళ్ళకు చేసుకున్నంత! అను భవించక తప్పుతుందా లీలా! "

లీలావతమ్మ తెల్లబోయింది. తెల్లబోతూ భర్తముఖంలోకి పరిశీలనగా చూచింది. ఆ ముఖంలో కోపంలేదు. తొందరపాటు లేదు. ఆయన చిత్రహింసకు గురైన తర్వాత అపరాధాన్ని బయటపెట్టిన నేర స్తుడిలా వున్నాడు. □□□



ఎప్పటి కేది అవసరమో అప్పటికది మాట్లాడేసి, అన్యుల మనస్సులు నొప్పించక, తన మనస్సు నంతకంటే బాధపెట్టకుండా ఉండేవాడే మనిషి సుమా అంటాడు సుమతీ శతకకారుడు.

నిజమే మరి. ఏదేనా మాట్లాడే ప్పుడు జాగ్రత్త అత్యవసరమే. అందుకే కదండీ కాలుజారితే తీసుకో గలం గానీ నోరుజారితే తీసుకోలేం అన్నారు మనవాళ్ళు. అసలు ఈమాట పొందిక గురించి రాబర్ట్ లిండ్ అనే మహాశయుడు పెద్ద వ్యాసమొకటి రాసి పారేశాడు. సరే, ఎప్పటి కేది అవ సరమో అది మాట్లాడమన్నాడుకదాని, నిత్యం అబద్ధాలాడ్డం మంచిదేనా అంటాడు మా మిత్రవరేణ్యుడు. ఎందు కంటే ఆయన తన మిత్రుల మనం బులు నొప్పింపకుండా ఉండాలంటే, లేచిన దగ్గరనుంచి పడుకొనేదాకా అబద్ధాలాడాల్సి వస్తోందిష.

కొన్నికొన్ని నీతిసూత్రాలున్నాయి చూశారూ, మనకి బోధపడవు. బహుశా మన బుర్రలకు (క్షమించాలి) అతీత మేమో! ఈమధ్య ఒక సంగతి జరి గింది. ఒకే వీధిలో నాకు యిద్దరు స్నేహితురాళ్ళున్నారు. ఒకరింటికి వెళితే రెండో ఆమె యింటికి వెళ్ళి తీరాల్సిందే. లేకపోతే నా పరువు మరి ఉండదు.

నా ఖర్మానికి ఒక శుభవేళ ఒకామె దగ్గరకు వెళ్ళాను. ఆవిడ ఆరోజు సినిమా కెడదామంటూ నన్ను లాక్కు పోయింది. అంటే నా రెండో మిత్రు రాలింటికి నేను వెళ్ళలేకపోయానన్న మాటేకద. నా మనస్సులో భయంగానే ఉంది. అయినా చిన్న ఆశాకిరణం కనిపించింది. నే నక్కడి కొచ్చినట్టు ఆవి డెలా చూస్తుందిలే అనుకొన్నా. కానీ ఈ మిత్రురాలుంది చూశారూ

దానికి గూఢచారులున్నారట. ఆరోజు ఒక పనిపిల్ల గూఢచారిణిరూపంలో ఉండి నా రాకసంగతి దానికి చేరేసింది.



అయ్యో, సత్యభామకు కృష్ణుడి పారిజాతపుష్పం కథ తెలిసినట్టు మండిపోయిందది. నన్ను పనికట్టుకొని వచ్చి దుయ్యపట్టేసింది. అప్పుడు నా కర్తవ్యమేమిటి ? వెంటనే పై నీతివాక్యం గుర్తుకొచ్చి - "ఆ రోజసలు నే నిల్లే కదల్లేదు. సదరు నీ గూఢచారిణి ఎవరిని చూసి నేననుకుందో" అంటూ అబద్ధం అతి చులాగ్గా ఆడేసి ఆపద నుంచి తప్పుకున్నాను. అది అప్పటికి ప్రస్తుతమైంది. కానీ యితరులను నొప్పించకూడదుకదాని, అబద్ధాలాడ్డం ఘోరమైన పనికాదండీ ?

ప్రపంచం చాలా చిత్రమైంది. చావుకు పెడితేకాని లంఖణాలు చెయ్యరు ప్రజలు. అలాగ పోనీకదా అని, మనుషుల్ని బాధించకండీ అని చెప్తే అబద్ధాలాడ్తారు మనవాళ్ళు, ఈ ఉపద్రవం నుంచి రక్షించటానికి. "అబద్ధాలాడ్డం మహాపాపం. డైరక్టుగా నరకానికి పోతావు" అంటూ మళ్ళీ వాళ్ళే చెప్పారు. నాలాంటి "వాడే" వెనకటికి అయ్యవారేం చేస్తున్నారంటే అబద్ధాలాడి దిద్దుకుంటున్నారు అన్నాట్ట. అలాగ కొందరు ఒకలాగ చెప్పి, మరి కొందరు జడిపించేసరికి, మనవాళ్ళు రెండు పార్టీలుగా చీలిపోయారు. కొందరేమో సుమతీ శతకకారుడి పక్షం, మరికొందరు ఎదుటపక్షం చేరిపోయారు. నన్నడుగుతే యీ గుణం మన దేవుళ్ళకే ఉందంటాను. శివుడుగారేమో వరాలిచ్చేస్తాడు. భక్తులు కాస్త పొగడేసరికి పొంగిపోతా డాయనగారు. కానీ, ఆయన భక్తులు కొందరు ఆయనిచ్చిన వరాలు ఆయనమీదే ప్రయోగింప ప్రయత్నించారు. దాంతో విష్ణువుగారు చచ్చేట్టు అవతారాలెత్తాల్సి వచ్చింది.

అయితే మన నాయకులుకూడా ఈ శ్రేణి వారే. వీళ్ళుకూడా ఎన్నికల ముందు వరాలిస్తామని వాగ్దానాలు చేస్తారు. కాని ఆ తరవాత వాటిసంగతే మర్చిపోతారు. వీళ్ళకిమాత్రం పైపద్యం తంగున సరిపోతుంది.

ఇంకా కొందరు మహానుభావులు అక్కడిమాట లిక్కడ, ఇక్కడిమాట లక్కడ చెప్పి, వాళ్ళనీ వీళ్ళనీ కూడా సంతోషపెట్ట చూస్తారు. ఫలితం వారి ద్దరి మధ్య పచ్చగడ్డివేస్తే భగభగ మండిపోవటం. ఇది సర్వసామాన్యంగా పెళ్ళిళ్ళలో జరుగుతూ ఉంటుంది. ముఖ్యంగా మగపెళ్ళివారికి "ఆడపెళ్ళి



వారిలా అన్నారు అలా అన్నారు" అని పురెక్కిస్తారు. ఇంకేం, అసలే తమ ఆధిక్యం ఆ మూడురోజులేనా ఉంటుంది కదా అని సంతోషించేవారు నిప్పులో నెయ్యిపోసి నట్టవుతారు.

ఈ తగవుల విషయంలో ప్రఖ్యాతి చెందిన మన నారద మునీంద్రుల వారుండనే ఉన్నారు. ఎక్కడి కెడితే అక్కడ వారిని నొప్పించకుండా మాట్లాడి చిత్రమైన తగవులు సృష్టించటంలో అందెవేసిన చెయ్యి. ఆయన తగవుల ఫలితాలే పారిజాతాపహరణం మొదలైన కావ్యాలు మరి. అందుకే కాలమాన పరిస్థితులనుబట్టి నీతి వాక్యాలు కూడా మారాలి. మాటలవల్ల, వాటి పొందికవల్ల ఎన్ని జరుగుతాయో చెప్పలేము. ఏమంటారు ? □□□

షుగర్ కంప్లెయింట్

చిత్తూరు పంచదార ఫ్యాక్టరీ వెలిసిన తర్వాత చక్కెరకు కటకట ఏర్పడింది. కిలోగ్రాము పంచదారకోసం గంటల తరబడి అంగళ్ళముందు క్యూలో నుంచున్నారు జనం. పంచదార ధరతో పాటు కాఫీ ధర, హల్వాధర పెరగడం సహజం కాని ఇడ్లీల ధర, పూరీల ధర కూడా పెరిగాయి. ఏమిటంటే— తీగ కదిపితే డొంకంతా కదలదా అని ఎదురు ప్రశ్న వేశారు హోటళ్ళవారు. అనులోమ నిష్పత్తి అంటే ఇదే అని వ్యాఖ్యానించారు అర్థశాస్త్ర వేత్తలు. ప్రజలు కలెక్టర్ దొరవారి దివ్యసముఖమునకు, పత్రికా సంపాదకులకు ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ పరిస్థితి అంతా చూసి ఒక పత్రిక ఒక వార్తకు చమత్కారంగా 'చిత్తూరుకు షుగర్ కంప్లెయింట్' అని హెడ్డింగు పెట్టేసింది. —ఒక పాత్రికేయుడు.



తమసోమా జ్యోతిర్గమయా

శ్రీసుధా

ముకుందరావు శరీరంతో పాటే మనసు కూడా మొద్దు బారి పోయింది. ఈ మధ్యకాలంలో తరుచు మెదడుకి, మొత్తం శరీరానికే తిమ్మి రెక్కుతోంది పాపం. పూర్వం అయితే శరీరాన్ని ప్రేమించాలనే ధ్యాస వుండేది. నలగని బట్టలు, మాయని గడ్డం, చెరగని క్రాపు వొక విధమైన హుందా తనంతో పదిమందిని ఆకర్షిస్తూవుండేవాడు. మనసు కూడా "కాన్వెక్స్ లెన్స్"లా పనిచేస్తూ నచ్చిన మనుష్యుల్ని వింతగా చూపించేది. కాని యిప్పుడది మకిలి పట్టింది. పైగా అతక డానికి వీల్లేనన్ని బీటలు వారింది.

ఇన్నీ మార్పులు-యింకా అతనికి తెలియ నివి, అందరికి తెలిసినవి-జరగడానికి పదేళ్లు పట్టింది. కొందరి జీవితాలకు పదేళ్ళ కాలం చాలా స్వల్పంగా అన్పిస్తుంది. కాని యీ పదేళ్ళనే తల్చుకుని జీవితానుభవాల్ని ముద్దగా చిత్రించుకుంటూ ముకుందరావు "ఈ పదేళ్ళలో నేను యేదో ఒకరోజు చని పోయే వుండాలి. ఈ బ్రతకడం అనేది యాంత్రికంగా జరుగుతోంది. భయాన్ని మర్చి పోవడానికని చావుని గుర్తించడం లేదంతే" అనుకునేవాడు.

అతను బి.ఏ. ప్యాస్ అయి, పైచదువుకు వెళ్ళలేక ఆగిపోయినరోజుకు యీ రోజుకు మధ్యదూరం సరిగ్గాపదిసంవత్సరాలు. అతను ప్యాస్ అవగానే అన్నగారిచ్చిన 'రోలెక్స్' రిస్టువాచీ ప్రస్తుతం ముళ్ళు జారిపోతూ-కాలాన్ని మింగుతూ, కక్కుతూ మకిలి పట్టి అమ్మితే 'యిరవై పైన మాత్రం' ఖరీదు చేసేదానిలా అయిపోయింది. నాన్న కుట్టించిన బట్టలు యేనాడో చిరిగి పోయాయి. అనూరాధ యిచ్చిన 'మూడు కోతులు' మట్టి బొరి, అడుగు భాగాల్లో విరిగిపోయి అల్మైరాలో రోజూ కన్పిస్తూ అతన్ని యేమీ మాట్లాడనివ్వవు - విన నివ్వవు - చూడ నివ్వవు - గుండెల్లో కోత, తడి ఆనని గాయాలు మాత్రమే చేస్తూ.

అతని సర్వీసు రిజిష్టర్ చూస్తే, పదేళ్ళ గుమాస్తా జాతకంలో కొన్ని మధురఘట్టాలు ప్రొబేషన్ డిక్లేర్ అయినరోజు, యింక్రిమెంట్లు అందుకున్న తారీఖులు, మధ్య మధ్య సిక్ లీవుల పోస్టింగ్స్, ఆ తరువాత ఆఖరికి వో యూ. డీ. ప్రమోషన్ వైనం - కనిపిస్తాయి. శరీరం సంసారిగా అతన్ని మార్చింది యెనిమిది సంవత్సరాల క్రితం. ఇల్లాలుగా వచ్చిన అమ్మాయి అతను ప్రేమించిన అనూరాధే కావడం వొకటే ఆ గ్రంథంలో ప్రత్యేకత. అది తప్ప ముకుందరావు జీవితంలో ప్రాముఖ్యం వహించిన సంఘటనలు లేవా అని ప్రశ్నిస్తే-నిజానికి అతనూ యీ ప్రశ్నే చాలా సార్లు తన్ను తను వేసుకున్నాడు.

అనూరాధ అతనికి ముగ్గురు పిల్లల్ని చ్చింది. రెండు పూటలా శేరున్నర బియ్యం వండి వారుస్తోంది. వార్చలేని రోజున యేడుస్తూ - ఆ యేడుపు తగ్గిన తరువాత వార్చింది గాని, మానలేదు. ముకుందరావు చాలా సార్లు ఆమె కన్నీటిని చూశాడు. కొత్తలో అయితే వోదార్చేవాడు. తనే ఆమె కళ్ళు ఒత్తేవాడు. ఇప్పుడు ఆ పని చెయ్యడం అతనికి విసుగు. ఆ విసుగు కూడా ముదిరితే కొడతాడు, తిడతాడు....

ముకుందరావు ప్రేమించి పెళ్ళాడిన భార్యపట్ల విముఖతకు, యింటిపట్ల నిర్లిప్తతకు సగం కారణం అతని ప్రస్తుత ఆర్థిక సమస్యలే....

అతను నూట యిరవై రూపాయల జీతంలో తల్లిని, తండ్రిని, చదువుకుంటున్న తమ్ముణ్ణి, తన పిల్లల్ని, భార్యనీ పోషించాలి. మొత్తం యింట్లో జనాభా యెనమండుగురు. మనిషికి ఖర్చు సగటున చూస్తే కళ్ళు భగ భగ మంటలు పుట్టేవి. నెలనెలా అప్పు చెయ్యక గడవదు. కొత్తలో అప్పు బాగానే పుట్టేది. కొంత కాలానికి అప్పు యిచ్చిన వాళ్ళు తిరిగి పొందని వారుగా మారి పోవడంతో, వట్టి చేతుల్తో యింటికి తిరిగి వచ్చిన ముకుందరావుకు యింట్లో మనుష్యులు జంతువుల్లా, జీభూతాల్లా కన్పించేవారు.

మనిషికి సగం మానసిక పతనం—లేమి వల్ల కల్గుతుందంటారు. కాని, మనిషిని వాస్తవంలో భయపెడుతూ, అంతకు రెట్టింపుగా కలల్లోనూ, ఆలోచనలలోనూ కూడా — మనిషికి వికృత దృశ్యాలు, భయకర సంఘటనలు చిత్రించి చూపేది కూడా బీదరికమే అని ఒప్పుకుంటే, ముకుందరావును చూస్తే నవ్వుకు ముందు జాలి, హాసానికి ముందు ఖరీదయిన కన్నీరు కార్చాలనిపిస్తుంది యెవరి కయినా. అతనికి యే డబ్బున్న స్నేహితుడో యెదురయి "ముకుందం యీ వందా ఖర్చు చేసుకో — నీకు బాగా కల్గినప్పుడు యివ్వు, తొందర లేదు" అంటే.

"నీ త్యాగం మర్చిపోను బ్రదర్ - చచ్చి నీ కడుపున పుడతాను" అనేవాడు.

అనూరాధను నిద్రలో లేపి "చూశావా అనూ! నన్ను అందరిలా నువ్వూ తప్పు అంచనా వేశావు. చూడు యీ పర్స్ - వెయ్యి రూపాయలు పైన వున్నాయి; నాకు దొరికింది. అలా చూడకు మరి. ఎవరూ మాదని ముందుకు రాలేదులే; నీకేం కావాలి"

అన్నట్టుగా యిలా రక రకాలుగా ఆలోచించుకోవడం, తద్వారా లభించే తృప్తిలో మునుగుతూ వుంటే, శరీరం హాయిగా పాటలు పాడేది.

మరుక్షణంలో శరీరం ఆకలితో రేగినప్పుడో, అప్పులవాడు తిట్టి వెళ్ళినప్పుడో, ముకుందరావు కుదించుకు పోయేవాడు. ఆలోచనలు ఎంత కాదనుకున్నా చేదులోకి మారేవి.

"అవును.... అమ్మ యేడాది నుంచి మంచానవుంది. మందు లేదు. డాక్టరు కూడా 'లాభం లేదు' అని యేదో రోజు — ఆ మాట కాస్తా అనేస్తాడు.... అయితే అమ్మని చచ్చిపోకుండా తను ఆపలేడు.... వొక వేళ అమ్మ రేపు చచ్చిపోతే? తన దగ్గర యేం డబ్బు వుందని? కర్మకి చాలా అవుతుందంటారు. వంద రూపాయలైనా కావాలి. చుట్టాలొస్తారు. వీధిలో శవాన్ని తనెలా కదిలిస్తాడు.... ఎవర్ని అప్పడగాలి అప్పుడు? యెవరూ డబ్బివ్వక పోతే తనేం అమ్ముకోవాలి?

అనూరాధకు మళ్ళీ ప్రసవం రోజులు. క్రితం సారే వాతం కమ్మింది. మళ్ళీ వస్తుందేమో. చచ్చిపోదు కదా...శేషాద్రి వద్ద అప్పు చేసిన సొమ్ముకు అతను కోర్టుకు లాగితే తన దగ్గరేం వుందని? అప్పుడు ఖైదులో పెడతారు. అయితే—యిల్లెలా నడుస్తుంది? అమ్మా, అనూరాధా ఆ యింట్లో యీ యింట్లో వంటలక్కలుగా చేరి పొగ చూరిపోయి వారానికొక సాయంత్రం తన్ను చూడ్డానికి వస్తారు....

ముకుందరావును యేడాదిగా యీ రక రకాల ఆలోచనలు తేనెటీగల్లా చుట్టుముట్టి, అతను యే రోజూ సుఖ నిద్ర పోకుండా జాగ్రత్తపడుతున్నాయి. అతను యెన్నో రాత్రుళ్ళు వంటరిగా, గుండెల్లో వెక్కిళ్ళలా విచారం తన్నుకు వస్తూంటే యేడ్చేసేవాడు.

ఎలాగో అణా మల్లె పువ్వులతో, పగటి పూట శ్రమనంతా మర్చిపోయి యింటికి వచ్చేవాడు. గదిలోకి వెళ్ళేటప్పటికి నూనె తగ్గిపోయి భగ భగ మంటున్న కోడి గుడ్డు లాంపు. ఇటు టేబుల్ క్లాత్ కొబ్బరి నూనె డాగులతో, కాటుక మరకలతో, మబ్బు పట్టిన ఆకాశంలా వుండేవి. గోడ మీద చెద తినగా మిగిలిన భాగాల్లోంచి వంశాన్ని వృద్ధిచేసిన పెద్దలు-చిమ్మెట్లు తినేసి మిగిల్చిన అవయవాలతో ఫొటోల్లో వికృతంగా కన్పించేవారు. అతనికి వెనకటి రోజులు గుర్తుకు వచ్చేవి. చదువుకునే రోజుల్లో కన్న కలలు—అనూరాధ ప్రేమికుడిగా, యెన్నో సాయంకాలాలు కాలేజీ పొన్న మామిడి చెట్ల కింద బృందావనాలు వూహించుకున్న క్షణాలు గుర్తొచ్చి, వాటికి ప్రతిగా పొందింది యేమిటో వాస్తవంలో జీభూతంలా కళ్ళముందు నాట్యం చేస్తూంటే అగ్ని పర్వతం లాంటి శరీరం బ్రద్దలు కావడానికి సిద్ధమయ్యేది. దానికితోడు క్రితం రోజు చీర విప్పకుండా, జడైనా వేసుకోక, సంవత్సరాలుగా గలేబు యెరగని తలగడాకు పట్టిన మకిలి మీద చెయ్యి పెట్టుకుని "జీవితం యిందుకేనా.... మరెందుకైనా వుందా" అనే మీమాంసతో, ఆశలు, వూహలు, ఆహ్వానాలు అన్నీ మర్చిపోయి వట్టి మనిషిగా, భార్యగా, పడుకున్న అనూరాధను చూస్తే— అతనికి శరీరం పట్టు తప్పిపోయేది. మెదడు బరువెక్కి, బాధలు గొంతును పట్టుకునేవి. ఏ అలజడి లేని వట్టి గుండె కదలికను మాత్రమే మిగుల్చుకున్న ఆ స్త్రీని తయారుచేసింది తనేనని

● ఒక పెద్దమనిషి బుద్ధిపొరపాటై ఒక తర్కశాస్త్ర పండితుడితో తగూ పెట్టుకున్నాడు. ఈయన 'ఎడ్డెం' అంటే కాదు 'తెడ్డెం' అని ఆ తర్కశాస్త్రిగారు హోరాహోరీగా వాదించి ఈయనను హూనంహూనం చేశాడు. పెద్దమనిషికి ఏడుపొచ్చేస్తూంది. ఆఖరి ప్రయత్నంగా 'రెండు రెళ్ళు ఆరు' అని గట్టిగా గావుకేకపెట్టాడు. తర్కశాస్త్రపండితుడుగారు 'కాదు, నాలుగు' అని ప్రతిధ్వనించాడు. 'కాదు ఆరే రైటు, కావలిస్తే నిరూపించు' అని సవాలుచేశాడు పెద్దమనిషి. త.శా.పం, గారు ఈ చేతివేళ్ళు రెండు,. ఆ చేతివేళ్ళు రెండు తెరిచి, రెండింటినీ దగ్గరకు చేర్చి మొత్తం కలిపి లెక్కపెట్టి 'నాలుగు' అన్నాడు. పెద్దమనిషి "అవి నాల్గుగు ఎందుకు అవును, ఆరు ఎందుకు కావు" అన్నాడు. దమ్ముంటే నిరూపించమన్నాడు. త.శా.పం. గారు హఠాత్తుగా ఏదో జ్ఞాపకం వచ్చినట్టు అభినయించి, అర్జెంటు పనుందని వెళ్ళిపోయాడు.

నీతి : కొందరికి రెండు రెళ్ళు ఆరే.

గుర్తు చేసుకోగానే, పెళ్ళి అనాలనిపించేది. "అనూరాధా! నిన్ను సర్వనాశనం చేశాను. నేను నాశనం అయినందుకు నాకు బాధ లేదు. ప్రేమించినందుకు ప్రతిగా మగవాడు యెంతగా శిక్షిస్తాడో, తెలిసి నిన్ను చూస్తే యే ఆడది యే మగవాణ్ణీ ప్రేమించదు. తేమిని అసలే ప్రేమించదు. యే జన్మలోనో నే చేసిన పాపాలకి శిక్షగా నిన్నిలా మార్చేశాడు భగవంతుడు...." కళ్ళ కన్పించేవి కావు.... అలాగే ముద్దగా వుండిపోయేవాడు.

● ● ●

ముకుందరావు చూచిన మార్పులన్నీ అనూరాధలో వాకేసారిరాలేదు. చాలారకాల ఈర్ష్యల వడగాడ్పులు, పోట్లాటల పెనుతుఫానులు,పట్టుదలలక్షోణీపాతవర్షాలుఅన్నీ కలిగాయి. తనకోసం ఏ అనందాన్నిపణంగా పెట్టలేని భర్త -అవకాశంలేక బియ్యం మధ్య హరించుకు పోతున్న హారతి కర్పూరంలా అయిపోతూంటే - ఆ పురుషుడి పట్ల జాలి, మరో పెడ అతని అసమర్ధతకు విముఖతా కల్గేవి. వీటన్నిటికి కారణమయిన సంసారం మీద అసహ్యం కలిగేది.

పుట్టిన పిల్లల్లో వొకడు బల్లతో, మరొకడు అనాసతో గిలగిల్లాడుతూ - గిలిగిచ్చకాయ కోసం వొకళ్ళ నొకళ్ళ కరుచుకుంటూంటే "వీళ్ళని కన్నది నేను కాదు భగవంతుడా-నువ్వు. నేనుసిగ్గుపడుతున్నాను నువ్వు ప్రాణం యిచ్చిన పిల్లల్ని నా వాళ్ళు అని నింద మోస్తున్నందుకు" అనుకునేది కక్ష కలిగితే. భర్త చేతకాని తనం మీద కోపం ఆమెకు అద్దం ముందు నుంచుని తన రూపం చూచుకున్న రోజున మరీ యెక్కువయ్యేది. అలాగే అనేసేది "చూడండి - మిమ్మల్ని ప్రేమించి పెళ్ళి చేసుకున్నందుకు అనూరాధలో యేం మిగిలిందో"

కాని తనకి నిద్ర పట్టక, నిద్రపోతున్న ముకుందరావును చూస్తే యెందుకో శరీరంలో అఖరి శకలంగా మిగిలిన అనురాగం కదిలి జాలీ పుట్టుకొచ్చేది. ఎండిపోయిన అకట్టైనే గుండెల కదుముకుని నేనే కాదు. జీవితం కూడా మిమ్మల్ని రోజూ తినేస్తోంది. దేనికైనా ఆడదానికి అదృష్టం వుండాలంటారు-నేను శని పీనుగుని. ఇంకెప్పుడూ మిమ్మల్ని యేమీ అనను, నిజం" అనేది.

ముకుందరావును పెళ్ళి చేసుకున్న రోజుల్లో అసూరాధ శరీరాన్ని, ఆశల్ని శల్య పరీక్ష చేస్తే వాటిలో యీ నాడు కన్పించేకలతలు, ద్వేషాలు, అసహ్యాలు తత్సంబంధమైన బీజాలుకూడా కన్పించేవికావు.

నిజం చెప్పాలంటే,అనూరాధే ముకుందరావు కన్న చాలా విషయాల్లో వోర్పు కనపరచేది. భర్త ఆవేశపడి తిడుతున్నప్పుడు, కొట్టి వెళ్ళిపోయిన తరువాత, తన కర్మని దూషించుకుని కొంతకాలం - లేకపోతే ఆయన్ని తను ప్రేమించి పెళ్ళిచేసుకున్నాననే భావనా తెచ్చుకుని - పుట్టబోయే ఆవేశాన్ని ఆదిలోనే తుంచేసేది.

రేపటిరోజు యీ రోజు కన్నా బాగుంటుందని వూహించుకుంటే వర్తమానం తెచ్చిన గాయాన్నిమర్చి పోవచ్చు. కానీ ఆ రోజు కలలాగా - నిన్నటి కన్నా హీనంగా దర్శనమిచ్చి,తనది పట్టివూహేనని యింత కన్నా పతనం తప్ప వున్నతి లేదని నిర్ధారణ కొచ్చినప్పుడు, మనిషిలో వుండే

మమత, తడి అతి అవిరిగా మారిపోతుంది. అనూరాధలోకూడా ఈ మార్పులే వచ్చాయి.

అసూరాధ అత్తగారికి పక్షవాతంవచ్చి నాలుగేళ్ళయింది. అప్పటినుంచీ ఆవిడ కన్నీ మంచం మీదే జరుగుతున్నాయి. జబ్బు చేసిన కొద్ది రోజులు ముకుందరావు మందు యిప్పించాడు.

తరువాత డబ్బులేక మందుఆగిపోయింది. కాని, ఆ ముసిలావిడ - తన చావు మందు లేకపోవడం మూలంగానే వస్తున్నదని - కొడుకూ కోడలూ తన్ను మందు లేకుండా చంపాలని చూస్తున్నారని వూహించుకునేది. దాంతో యింటి పరిస్థితులు తెలుసున్నా డాక్టరనీ, మందులనీ జ్ఞాపకం వచ్చినప్పుడల్లా పలవరించి యేడ్వడం అలవాటు చేసుకుంది. అసూరాధ ఆవిడ యేడుపు వినలేక నీళ్ళలో వుప్పువేసి, వాముతేట కలిపీ దొంగ మందులిచ్చి ఆవిడ నోరు కట్టేది చాలా రోజులు.

ఆత్మవంచన చేసుకోవడం ఆవిధంగా అలవాటయితే - దుర్భర దృశ్యాల్ని చూసి దిగ మింగు కోవడం మామగారు నేర్పారు.

ఆయన పూర్వంలో ఖర్చుకు అలవాటు పడ్డ మనిషి. ఇంట్లో పరిస్థితి మారినా, ఆయన చుట్ట మానలేదు. కాఫీ, చీట్ల పేకా లేకపోతే అసలే నిలదొక్కుకోలేడు.

అందుకే కొన్నిరోజులు కొడుకు జేబులు తడిమి పట్టుకు పోయేవాడు. లేక పోతే అట్లకాడతో ఆడవాళ్ళ పెట్టెలు తీసి పబ్బం గడుపుకునేవాడు. ఆఖరికి ఆయన్ని బీదరికం యెంతకి దిగ జార్చిందంటే, కొడుకు తెచ్చిన బియ్యంలో వొవంతు తువ్వాల్లో కట్టుకుని బజార్లో అమ్మేసేవాడు. లేకపోతే



"మా తాతయ్య నడవడానికి ఎందుకంత కష్టపడిపోతాడో ఇప్పుడు తెలిసింది."

చేతికి దొరికిన యిత్తడి చెంబో, వెండి గ్లాసో తాకట్టు పెట్టేసేవాడు.

ఇవన్నీ చూచి కూడా భర్తకి చెప్పలేక, కడుపులో దాచుకుని - భర్తకి తెలిసిన రోజున అతనితోపాటు కళ్ళల్లోనే కన్నీరు ఆపుకునేది.

కానైతే, సంవత్సరాల తరువాత యీ రోజు వొకళ్ళ నొకళ్ళ చూచుకుంటే ఆ భార్యా భర్తల్లో వోర్పు చచ్చిపోయిందని రుజువయింది. దాచుకున్న కావేషాలు, ఈర్ష్యలు, దారుణాలు శరీరంలో చోటులేక బయటకు రావడం మొదలు పెట్టాయి.

చాలా మంచిగా వుండాలని - అలాగే ప్రవర్తించాలని ప్రతీ మనిషి అనుకుంటాడు. కాని, ఆ మనిషి చెడుగా మారిపోయాడంటే పై కారణం వల్లనే అవుతుంది.

అందుకే అసూరాధా, ముకుందరావు-యెవరికి వారుగా ఆలోచించుకున్న రోజున ఆ యిల్లు ప్రశాంతంగానే వుండేది. కాని, యిద్దరూ యెదురుపడితే, అవసరాలు కలి

గితే. యేదోవిధంగా యెదుటి మనిషిని బాధ పెట్టి కొంచెం "రిలీఫ్" పొందాలనుకునే వారు.

"వంటయిందా"

"లేదు. బియ్యం లేవు. నిన్ననగా చెబితే తెచ్చారు గనకనా? ఈ సంసారం యేమిటో, నాకు మతిపోతోంది. ఊద లేక చచ్చిపోతున్నాను"....

"అబ్బబ్బా — నోరు మూసుకుంటావా లేదా? చావాలని నీకే కాదు. నాకూ వుంది. ఈ రోజు కాదు — యెనిమిదేళ్ళ క్రితం చచ్చిపోవాలనుకుని కోరుకున్నాను ...... చావనీకుండా గుదిబండలు మీరున్నారుగా. సీతమ్మ గారింట్లో తీసుకో బియ్యం.... రేపు గాని డబ్బు అందదు".

"ఏదైనా అంటే యిదీ భాగోతం.... నెల బాకీ యివ్వలేదని పాలవాడు మానే శాడు. ఇంటాయన అద్దెకోసం రెండు సార్లు వచ్చాడు. అరుస్తోంటే ఆఫీసుకు వెళ్ళి అరవమన్నాను..... మీ తమ్ముడు జీతం కట్టాలిట"

"నా దగ్గర దమ్మిడీ లేదు. చచ్చిపోతు న్నాను. వంట్లో రక్తం తప్పించి మరేం లేదు. అదైనా అమ్మి వాడి జీతం కడదా మంటే—నాకు నమ్మకంలేదు — నా రక్తం అమ్మకానికి కూడా పని చెయ్యదు. అవునులే.... మనం యేం బలమైన తిండి తింటున్నామని రక్తం బాగుండడానికి."

అనూరాధకు దోకువచ్చినంత పనైంది. వసారాలోకివెళ్లి క్షణం తరువాత తిరిగొస్తే భర్తలేదు. అక్కడే కూర్చుండి పోయింది కళ్లు మూసుకుని.

"మీరు ...." కళ్ళు తెరిచి చూసి "ఎవరు" అంది యెదురుగా కనిపిస్తున్న స్త్రీని చూసి.

"నా పేరు సుశీల" అంది వచ్చిన అమ్మాయి ..

సుశీల ముకుందరావు పనిచేసే ఆఫీసులో టైపిస్టుగా వుంటోంది. ఆ అమ్మాయి యేడాదినుంచి ముకుందరావుని ఆఫీసులో చూస్తోంది. అతని గత జీవితం గురించి సీనియర్ టైపిస్టు రాధ చెబుతుంటే సుశీల పని మరచి వింటూ వుండేది. రాధది ముకుందరావు పక్కయిల్లు కావడంవల్ల ఆ యింట్లో జరిగే సంఘటనలు యథాతథంగా చెప్తూంటే సుశీలకు ఆవేశం కల్గేది.

ముకుందరావు కష్టాలు వింటూ ఆఫీసులో యెవరూ నిజం అనుకోక పోగా — పైగా కథలుగా చిత్రించి నవ్వుకుంటూంటే. తనని యెవరో అవమానిస్తోన్నట్టు తలంచు కునేది. తన మనసు మెత్తనిదని — పైగా రచయిత్రి అవడం మూలంగా, కష్టాల్ని కథల్లోనే చిత్రించి, మామూలు వూహల్లోనే జీవిస్తున్న తను—వాస్తవాన్ని గుర్తించవలసి వచ్చేటప్పటికి, హృదయంలో జరిగే స్పందన అని తెలిసేది కాదు.

ఈ రోజు సుశీల ముకుందరావు యింటికి రావడానికి కారణం—నిన్నటి రోజు ఆయన రాజారావును పది రూపాయలు అప్పు పెట్ట మని—ఆ డబ్బుతో యింటికి బియ్యం తీసుకు వెళ్లాలని ప్రాధేయపడి అడిగితే — రాజారావు యిచ్చిన జవాబే.

రాజారావుకు లేమి అంటే అసహ్యం. ఎదటి వ్యక్తి డబ్బుకోసం యిబ్బంది పడుతున్నాడంటే అతనికి వెర్రి ఆనందం కలుగుతుంది. తన జేబులో డబ్బుండీ

కూడా యివ్వలేదని తెలుసుకున్నప్పుడు అడగవచ్చిన వ్యక్తి మొహంలో వచ్చే మార్పులు అతన్ని వూహల్లో స్వర్గారోహణ చేయిస్తాయి. వీలైతే ఆ దౌర్భాగ్యుడి యింటికి చాటుగావెళ్ళి—అతను కార్చేకన్నీరు చూడ్డం పెద్ద అనుభవం అని చెప్పు కుంటాడు.

నిజానికి రాజారావు కూడా వో రచయితే. కవిత్వం వస్తోన్నప్పుడు — తనలాంటి డబ్బున్న వాళ్ళు యీ విధంగా లేని వాళ్లని ఆదుకుని, తద్వారా దేశంలోకి సరఫరా అయ్యే కవిత్వాన్ని ఆపడం అవివేకం అని భావగీతాలు వ్రాస్తాడు.

సుశీలకు రాత్రి యింటికి వెళ్లి పడుకుంటే నిద్ర పట్టలేదు. కళ్ల ముందు ముకుంద రావు సంసారం, అతనికి విధి చేస్తున్న అన్యాయం, దానికి కారణాలు వూహిస్తూ వుండిపోయింది. గుండెల్లో బాధ తప్పించి ఆ కష్టాలకు కారకులుగాని, తుదీ మొదలు గాని కన్పించలేదు. ఉదయం మాత్రం వో పాతిక రూపాయలు పట్టుకుని రాగల్గింది— పరిచయంలేని ముకుందరావు యింటికి. ఆమెకు రాత్రికి తాత్కాలికంగా విశ్రాంతి నిచ్చింది యీ వూహే.

అనూరాధ మరోసారి సుశీలను పరకా యించి చూసింది. ఉదయం నుంచీ కాఫీ

● సొంత డబ్బాలో రాటుదేలిన రచనాసురుడొకడు థర్డ్‌క్లాస్ కంపార్ట్ మెంటులోచేరి అక్కడి అమాయక ప్రజలందరినీ—భీమాఏజెంటుకంటే కనాకష్టంగా చిత్రహింస పెడుతున్నాడు. పంక్చుయేషన్ లేకుండా అనర్గళంగా తన రచన లను గురించి, తనకుజరిగిన సన్మానాలను గురించి ఉపన్యసిస్తున్నాడు. మంత్రు లతో కరచాలనం చేస్తూ తీయించుకున్న ఫొటోలు, ప్రముఖులు తనకు రాసిన లేఖలు, అచ్చుఅయిన పుస్తకాలు, వాటిపై పత్రికలు రాపిన సమీక్షలు—పాముల బుట్టలాంటి బెడ్డింగులోంచి తీసి అందరికి పంచిపెడుతున్నాడు. కంపార్టుమెంటు ఖాళీగా వుందికదా ఎక్కుదామని వచ్చే ప్రయాణీకులు అల్లంతదూరాన్నే అతని సొంతడబ్బా విని కకావికలై పారిపోతున్నారు. ఓ ఇరవైమంది మాత్రం సాలె గూట్లో పురుగుల్లా అతనికి చిక్కిపోయి, సాహిత్య దుర్గంధాన్ని భరిస్తున్నారు. ఒక పుస్తకం చూచి ఇచ్చేస్తుంటే ఇంకో పుస్తకం ఇస్తున్నాడు. ఇదంతా చూసి చిరాకుపుట్టిన ఒక పెద్దమనిషి "అయ్యా ఒకసారి మీ పుస్తకాలు ఇస్తారా" అని అడిగాడు. ఇంతటి మహోదారుడెవరా అని ఆశ్చర్యపోయాడు రచనాసురుడు. ఒకటితర్వాత ఒకటిగా తనదగ్గరున్న పుస్తకాలు, కరపత్రాలూ, ఆల్బమ్‌లు అన్నీ ఇచ్చాడు. ఆ పెద్దమనిషి అన్నింటినీ జాగ్రత్తగా ఒళ్ళో పేర్చుకుని, దానిమీద తలపెట్టుకుని హాయిగా గుర్రుపెట్టి నిద్రపోయాడు. తెల్లారి లేచి 'థాంక్స్ సార్, దిండులేని లోటు తీర్చారు' అన్నాడు. ప్రయాణీకులందరూ ఆయనకి వందనసమర్పణ చేశారు.

లేక – లేచింది లేచినట్టే మొహం కడుక్కొని వుండిపోయింది. ఆ అమ్మాయిని చూడగానే యెడంచేత్తో జుట్టు సరిచేసుకుంది. చీర సర్దుకుంది.

"ముకుందరావు గారు లేరాండి" సుశీలకు చెయ్యాలనుకున్న సహాయానికి మార్గాంతరం వెంటనే తోచిందికాదు.... నెమ్మదిగా అంది.

"నిన్న ఆయన డబ్బు కావాలన్నారు.... వారుంటారేమో అనుకున్నాను. వచ్చాక యివ్వండి" అంది అనూరాధ చేతికి డబ్బిస్తూ....

నిజానికి సుశీల యింటి దగ్గర ఆలోచించుకు వచ్చింది. అనూరాధతో మాట్లాడాలని, చాలా రకాల ధైర్యం అందివ్వాలని.

కానీ – ఆ యింట్లో పాతిక సంవత్సరాలైనా నిండకుండా యెండి వొరుగైన అనూరాధను—మంచాన్ని హత్తుకుపోయి, చిరుగుల బొంత లాంటి, డొక్కు లాంటి మనిషి లావిడను - లేమి వంట్లో ప్రవహిస్తూ నడవ లేక విరిగిపోయిన వికారపు బొమ్మల్లాంటి పసివాళ్ళను – యే మూలా, వుత్సాహం, వుద్రేకం లేక–కాలి ఆరిపోయిన యింటి లాంటి ఆ వాతావరణాన్ని చూసేటప్పటికి, సుశీలకు యేం తోచింది కాదు .... ఎక్కువగా నిల్చుంటే యే భావనకు తట్టుకోవలసి వస్తుందోనని, తిరిగి వస్తానని చెప్పి వెళ్లిపోయింది ఆ అమ్మాయి. అనూరాధకు ఆ పూటకు యింట్లో ఆకలి పరిష్కారం కావడానికి మార్గం కన్పించడంతో – సుశీలతో మాట్లాడాలనే ధ్యాసే కలగలేదు.

పదిగంటలవరకూ భర్త యింటికి రాకపోవడంతో అనూరాధ భోజనంచేసి, పక్కింటి పిల్లాడ్ని పిలిచి, భర్తకు కబురు పంపించింది.

భోజనం ఫ్రెండ్ యింట్లో పూర్తి అయిందనీ. యేకంగా సాయంకాలం వస్తానని కబురు చేశాడు ముకుందరావు.

విశ్రాంతిగా చాపమీద పడుకున్న అనూరాధలో ఆలోచనలు కొత్తరకంగా నడిచాయి. స్త్రీ అవడం మూలంగానేమో శరీరంలో మరింత గట్టిగా హత్తుకుపోయాయి ....! సుశీల....ఆ అమ్మాయిగాని ఆయన్ని వలలో వేసుకోలేదుగదా. లేకపోతే యెందుకు సహాయం చేస్తుంది? పైగా యింటికికూడా వచ్చింది........

వెంటనే తన ఆకారం. సుశీలరూపం గుర్తుకు తెచ్చుకుంటే అనూరాధను ఈర్ష్యే జయించింది. దానికితోడు ఆరోజు ముకుందరావు యెనిమిది దాటితేగాని యింటికి తిరిగి రాలేదు.

"ఇల్లు గుర్తొచ్చిందా"

"అంటే"....

"మేం బ్రతికున్నామని మర్చిపోయారేమోనని"

"ఏదోవొకటి, యింటికి వచ్చేటప్పటికి మొదలుపెడతావేం?"

"అవును. ఆఫీసులో అయితే ప్రశాంతంగా వుంటుంది. కావల్సినంతమంది ఆడవాళ్లు"

"ఛీ, నోర్ముయ్"

"ఏదీలేకపోతే ఆ సుశీలకు మనంఅంటే అంత జాలి యెందుకు కలుగుతుంది? ఇంటికి కూడా వచ్చింది ..."

ముకుందరావు ఆ క్షణంలో నిలువునా కుంగిపోయాడు.

ఇదన్నమాట నీ ఉద్దేశం....నువ్విపాటికి ఆకలితో చచ్చిపోయివుంటావని వూహించాను. బ్రతికే వున్నావు. నన్ను చంపడం మొదలుపెట్టు యిక" అన్నాడు.

"అంతేగాని నా యేడుపు మీకు తెలియడం లేదు. నానా వాళ్ళతో తిరిగి...."

ముకుందరావు కొట్టాడు .... అనూరాధ యేడ్చి యేడ్చి నిద్రపోయింది. అయినా అతనికి నిద్రపట్టలేదు. చిరాకు విరక్తి అన్నీ మర్చిపోయి నక్షత్రాల వైపు చూస్తుంటే. అతనిలో - ఆ మగవాడిలో - యేదో శక్తి గొణుక్కుంది. "అవును, ఎవరికీ, ఆఖరికి భగవంతుడికి కూడా లేని ఆపేక్ష సుశీలకు తనమీదయెలాపుట్టింది?మధ్యాహ్నం యింటికి తీసుకువెళ్ళి, తను వోడిపోతున్నానని మనసులో అనుకుంటే - ఆ అమ్మాయి సరిగ్గా అదే వూహించినట్టు అలా యెలా వోదార్చగల్గింది? తాను అప్పుచేస్తే తీర్చలేనని తెలిసికూడా పాతికరూపాయలు తన యింటికి తీసుకువెళ్ళి ఎందుకు యిచ్చింది? ఏ భావం ఆ అమ్మాయిలో తనపట్ల కలిగి వుంటుంది? అనూరాధ అన్నట్టు"....

ఉదయానికి అనూరాధ వూహ-ముకుందరావు భావన అంతా భ్రమే అవుతుంది. మిగిలేది మాత్రం అర్థంకాని సుశీల ఔదార్యం వాక్కటే.

నిజం ఆలోచిస్తే చాలారోజులు ఆయింట్లో మిగిలి వుండేది బీదరికమే. తెల్లవారి లేచిన తరువాత సుశీల లాంటి వారి అభిమానం. ఆప్యాయతా, ఆ దంపతులకు - వానకూ యెండకూ తడిసి. మసిబారిన ఆ యింటికి అవసరమే అవుతాయి....

అయినా. మనిషి అన్నీ మర్చిపోయి తనని సృష్టించిన విధాతని ఆడిపోసుకుంటూన్నట్టే - ఆ దంపతులు అన్నీ పోగొట్టుకున్న విష క్షణంలో సుశీల లాంటివాళ్ళను అపార్థం చేసుకోవచ్చు ...

కానీ యీ కలల్లో యేదీ యథార్థంకాదని- వాస్తవం మర్చిపోవడం కోసం కలల్లో ఆనందాలు. కష్టాలూ వూహించుకునే సాధారణ మానవుల మనసు కొలమానం అని తెలుసుకుంటే - జాలి. ఆపేక్ష. ఆవేదన అన్నీ కలుగుతాయి....క్షమించాలనీ అనిపిస్తుంది. అలా క్షమించగలిగితేనే వారిని చీకటిలోంచి వెలుగులోకి రప్పించగలమేమో. □□□


మిథ్యాక్కరలు

"విశ్వనాథ సత్యనారాయణ గారు రామాయణ కల్పవృక్షంలో మధ్యాక్కరలు మొదలైన అక్కరలు ఎందుకు రాశారో తెలుసా?"

"తెలియదు"

"లేక పోతే అది అక్కరలేని రామాయణం అవుతుందని."

—పన్నేశ్వరరావు. మద్రాసు





పెళ్ళయితే...

ఆదివిష్ణు

ఉద్యోగరీత్యా ప్రస్తుతం బెజవాడలో వుంటున్నానన్న మాటేగాని మనసంతా బందరువైపే లాగుతుంది. సంవత్సరన్నర క్రితం బందరు వొదిలి యీ వూళ్లో కాలుపెట్టాను,

జననీ జన్మభూమిశ్చ .... అన్నారు కాబట్టి బందరంటే యిప్పటికీ నాకు అమితమైన గౌరవం, భక్తీని. "సొంత వూరుని ప్రేమించలేని మానవుడిని నేను క్షమించలేను" అనేవారు మా యింగ్లీషు లెక్చరరు తెలుగులో. ఆయన పుట్టిందీ పెరిగిందీ. ఉద్యోగంచేస్తోందీ బందర్లోనే మరి.





బందరు పిచ్చాళ్లకి ప్రసిద్ధని గిట్టనివాళ్ల ప్రచారం నేనమ్మను. నమ్మమని మీకూ చెప్పను.

సారీ.... సుబ్బారావుగురించి వ్రాద్దామని కూర్చుని బందరు గురించి రాసేస్తున్నాను. క్షమించాలి. ఈ కథకు కథానాయకుడు సుబ్బారావు ఒక్కడేకాదు_ చాలామంది వున్నారు. అయితే. సుబ్బారావు మీది ప్రేమ కొద్దీ యిది వ్రాయాలనుకున్నాను. కాని తీగలాగితే డొంకంతా కదిలినట్టు సుబ్బారావుని పరిశీలించిన యీ మనసులో అతనితోపాటు చాలామంది బొమ్మలు అచ్చు వేయించుకున్నాయి.

బందర్లోపుట్టి బందర్లోనే ఉద్యోగాలు చేస్తున్న మనుషుల్ని చూస్తూ వాళ్ళ అదృష్టాన్ని పదిమందికీ చెప్పడం నాకు అలవాటు. అందుచేతనే సుబ్బారావునీ, రాజునీ ఇక్కడ పరిచయంచేసి చలపతి (విశాఖ పట్టణం), కనకారావు (సామర్లకోట), భుజంగం (తుని). కేశవులు (నెల్లూరు) వగైరాలను వొదిలేస్తోంది.

సుబ్బారావు సొంతవూరు బందరుకి పది మైళ్ళ దూరంలోవున్న పల్లెటూరు. అయితే అతను బందర్లోనేవుండి చదువుకున్నాడు. అక్కడే ఒక చిన్న అద్దెగదిలో వుండి ఉద్యోగం చేస్తున్నాడు. నెలకి ఒకటి రెండు మాట్లు ఆ పల్లెటూరు వెళ్ళినా అది పెద్ద లెఖ్ఖలోకి రానేరాదు. కాబట్టి అతను బందరు పౌరుడనే చెప్పవచ్చును.

రెండు :రాజు (అతని మీసాలు మిల్ట్రీ వాడివిలా బాగుంటాయి, భయంకరంగా వుంటాయి) అతను సాక్షాత్తూ బందర్లోనే పుట్టాడు. ప్రస్తుతం అక్కడే (యింకా ఉద్యోగం లేదు) వుంటున్నాడు. వాళ్ళ యిల్లు బస్సుస్టాండు ప్రాంతంలో వుంది. వాళ్ళు బాగావున్న వాళ్ళు. మీరు గనక అతన్ని కలుసుకోవాలంటే — బందరు బస్సుస్టాండులో దిగి తలెత్తి చూడండి. మీముందు చక్కటి మేడ కనిపిస్తుంది. ఆ మేడపైన మీక్కనిపించేలా పేము కుర్చీలో నవ్వుతూ మీసాలు మెలివేస్తూ కూర్చొనుంటాడు. వయస్సు పాతికేళ్ళ లోపు. ఆరడుగుల మనిషి. ఎత్తుకి తగ్గ లావూను.

ఈ వ్రాసేది నిజం కాదని మీ కనిపిస్తే. నా మాటమీద మీకు నమ్మకం లేకపోతే రాజును కలుసుకోండి. అతను అబద్ధం చెప్పడు. అతని గురించి వ్రాస్తున్నాను కాబట్టి కాస్త ఆలస్యమైనా నిజమే చెప్తాడు. బిస్కట్లపీ పెడతాడుగూడాను. అతను మంచి మిత్రుడు. అతన్ని కలుసుకుంటే మీకు సుబ్బారావుని పరిచయం చేస్తాడు.

ఈ సుబ్బారావూ, రాజూల గురించే నలభైమైళ్ళ దూరంలోవున్న బెజవాడనుంచి నేను వారం వారం బందరు వెడుతూంట. రెండో కారణం బందరనబడే బస్తీమీద వల్లమాలిన అభిమానమూను.

మా ఆఫీసు శనివారంనాడు ఒంటిగంటన్నరకి అయిపోతుంది. తిన్నగా వొచ్చి అక్కడ బస్టాండులో బస్సెక్కి సాయంత్రానికి బందరు చేరుకుంటాను. ఆవేళకి రాజూ వాళ్ళ మేడమీద సిగరెట్లు కాల్చుకుంటో మావాళ్ళిద్దరూ నాకోసం యెదురు చూస్తుంటారు.

మిగిలిన కొద్ది శనివారమూ, పూర్తి ఆది వారమూ మేం ముగ్గురం మాయిష్ట మొచ్చి నట్టు బందరురోడ్లు సర్వే చేసేస్తాం. కనీసం మూడు సినిమాలైనా చూడాలనే నిబంధన ఒకటి వుంది. సినిమాలు చూసేవాళ్ళమేగాని వాటిల్లో అడుగడుగున దర్శనమిచ్చే అయొక్క టాలెంటూగ్రట్రా, పట్టించుకునే వాళ్ళంకాదు. మరి అలాంటప్పుడు సినిమా కెందుకయ్యా వెళ్ళడవూ, మరీ బడాయి కాపోతే అంటారేమో. అవుతే మీరు పొర పడ్డారన్నమాటే. సినిమా చూడ్డానికి వెళ్ళినా మనసు మాత్రం చూడ్డిచ్చేదికాదు. ఆ వారంలో జరిగిన ముఖ్యమైన విషయాలు సమీక్షించుకునేందుకు ఎంతసేపని పార్కులో గడిపేదీ. మరెంతసేపని రేడియోముందు కూర్చునేదీ. కనక వెరైటీ కోసరమైనా యిలా థియేటర్లకి వెళ్లేవాళ్ళం.

పార్కుల్లోనూ, అద్దెగదుల్లోనూ, సొంత యిళ్ళల్లోనూ తన 'ప్రేమాయణం' చెప్పి - నాగతి ఏమవుతుందో, ముందేమవుతుందో - అని పాడే రాజు సినిమాహాల్లోకొచ్చింతర్వాత గప్‌చిప్ అయిపోయేవాడు. అయితే అయ్యేడు. నన్నూ సుబ్బారావునీ మాటా డనిచ్చేవాడు కాదు. అయినా ఎలాగో వీలు చేసుకుని ఆ ఖబురూ యీ ఖబురూ ఒకళ్ళ చెవి నొకళ్ళు వేసుకుంటూనే వుండేవాళ్ళం. మా మాటలవల్ల ప్రేక్షకు లెవరైనా డిస్టర్బయినట్టు గ్రహించిందే తడవు రాజా బల మైన చెయ్యి నా భుజాన్నో, సుబ్బారావు మెడనో స్పర్శించేది. దాంతో మా ఖబుర్లు ఆ నిమిషానికి ఆగేవి. అనక కాస్త సినిమాని సీరియస్‌గా చూచిన తర్వాత మళ్ళీ సాగేవి. రాజా పరామర్శతో మళ్ళీ ఆగేవి.


ఇది నేను బందరు వెళ్లినప్పటల్లా తప్పనిసరిగా జరిగే కార్యక్రమం. ఒక్కో సారి రాజా, సుబ్బారావు బెజవాడొచ్చే వాళ్ళు. ఒచ్చేముందు ఉత్తరం రాసి పారేసే వాళ్ళు. వొచ్చిన తర్వాత ఒక్క నిమిష మైనా మాకు తీరుబడి దొరికేదికాదు. మా హోటల్లో భోంచేసి ఏ లీలామహల్‌నో పావనంచేసి మా అద్దెగదిలో సర్దుకుని నిద్ర పోయేవాళ్ళం.

ఆ నిద్ర గట్టిగా ఒక్కగంట పాటు వుండేమో. మిగిలినదంతా ఖబుర్లూ, సిగ రెట్లు కాల్చడం, నవ్వులూను. అప్పట్లో మాముందట ఒకటే సమస్య ఉండేది — రాజుప్రేమ వర్ధిల్లి, అతను ప్రేమించిన పడతిని పెళ్లాడితే, అంతకన్న వేరే కావల సిందేమిటీ అని.

పాపం .... నిజం చెప్పద్దూ .... రాజు గూడా (ఎంత సరదాగా తిరిగి ఎంత కులా సాగా మాటాడినా) అతని ప్రేమని తలుచు కుని దిగులుపడుతూనే వుండేవాడు. ఈపెళ్లికి వధువు వాళ్ళ యింట్లో వప్పుకున్నారుట గానీ రాజా అమ్మానాన్న మాత్రం వప్పుకో లేదుట. అతను అనేవాడు :

"దైవకృపవల్ల మా పెళ్లి జరుగుతే కొంత కెళ్ళేముందు సతీసమేతుడనై సీగది కొస్తాను. ఎందుచేతనో మరి బెజవాడలో చెప్పుకోదగ్గ లాడ్జింగ్స్ అన్నింటి కంటె నీ అద్దెగదే హాయిగా వుంటుంది. ఎంత ఎయిర్‌కండిషన్డ్ రూమైనా సరే దీనిముందు దిగదుడుపు."

అది నాపట్ల అతని కున్న అభిమానాన్ని తెలియజేస్తుందే తప్ప, నిజానికి అతిశయో క్తేగా మరి.



పోతే సుబ్బారావ్ విషయం సరేసరి. బందర్లో అతని రూమ్‌కంటే యీవూళ్ళో నారూమ్‌లోనే స్వేచ్ఛగా వుంటాడు. (దాని క్కారణం లేకపోలేదు— అక్కడ అతనికి గది నిచ్చినాయన వాళ్ళ బంధువు:) సుబ్బా రావ్‌లో వున్న ఒకేఒక ముఖ్యమైన క్వాలిఫి కేషన్ ఏమిటయ్యా అంటే - అతను ఇరవై నాల్గు గంటలూ నవ్వుతాడు, ఎదటివాళ్ళని నవ్విస్తాడు. సెన్సాఫ్ హ్యూమర్ జాస్తీగా వున్న మనిషి. పెద్ద విట్‌మాస్టర్. నాకిలాటి మనుషులంటే చాలా యిష్టం.

ఈ బెజవాడ వొచ్చినతర్వాత నాకు పరి చయమై, బహు కొద్దికాలంలోనే మా అంద రికీ ఆత్మీయుడైన వ్యక్తి విశ్వేశ్వర్రావ్. అతను చక్కటి కథలు రాసి పదిమందిలోనూ అవుననిపించుకుంటోన్న సోదర కథకుడు. అతని కింకా పెళ్ళికాలేదు కాబట్టి, అతని గురించి యీ కథలో ఎక్కువగా వ్రాయడం లేదు. అతన్నడిగినా నే రాసినదంతా నిజ మనే చెప్తాడు. అతన్ని కలుసుకోవాలంటే ముందు నన్ను కలుసుకోండి. అడ్రస్సదీ యిస్తాను. బైదిబై - అతనీ మధ్య పెళ్ళి చూపుల్లో చూపు నిలిపినట్టు వార్త. కాబట్టి మనం కనపడమేమో.

'ఇదంతా సోది. కథ ఒక్క అడుగు కూడా కదల్లేదు. వొళ్ళు దగ్గరెట్టుకుని వ్రాయి. ఇంకా యిలాగే సొదుగిస్తే నీ ముక్కు చితగ్గొట్టేస్తాం అయ్(....'

ఇక చదవండి....

పోయినేడాది మే నెల వరకూ అటు బందరులోనూ, అప్పుడప్పుడూ బెజవాడలోనూ మా స్నేహితులమధ్య సరదాలకీ, సంతోషాలకీ ఏ అంతరాయమూ రాలేదు.

ఆ మే నెలలోనే మా సుబ్బారావ్ పెళ్ళయింది!

సుబ్బారావ్ పెళ్ళిమాట వినగానే మేమందరం చాలా సంతోషించేం. ఎక్కడెక్కడ్నుంచో పాతమిత్రులందరూ వొస్తారుగదా రెండు రోజులపాటు ఆనందంగా గడపవచ్చుగదా అని ఎంతో మురిసిపోయాం.

అనుకున్నట్టుగానే సుబ్బారావ్ పెళ్ళికి చాలామంది స్నేహితులు వొచ్చేరు. వచ్చిన వాళ్ళలో పెళ్ళయినవాళ్లూ, కానివాళ్ళూ, అవబోయేవాళ్ళూ, తండ్రులూ యిలా చాలా రకాలు వున్నారు. ఒకప్రక్క మా సుబ్బారావ్ పెళ్ళి జరుగుతుండగా మరో పక్క పరామర్శలూ, కుశలప్రశ్నవర్షాలూ, పాతగాధల బాధలూ, కొత్తజీవిత సుఖాలూ చర్చించబడుతున్నాయి.

విడిదింట్లో చీట్లాట ప్రారంభమైంది.
ఇక్కడే తుఫాన్ విజృంభించింది.
అప్పుడే పెళ్ళయిన శాల్తీలమీద భవదీయుడికి నమ్మకం పోయింది.
అదే యీ కథకి నాంది అయింది.

—చీట్లాటలో చలపతిని చెప్పుకుని మరొకళ్ళని చెప్పుకోవాలి. దేశం ఏమూల ఏ రకమైన ఆటని ఎలా ఆడతారో వాడు చెప్పగా విని తీరాలి. వాడికి చీట్లాటలో అన్ని రకాలూ తెలుసు. సరైన శిక్షణా యివ్వగల నేర్పరి.

అలాంటి చలపతిని మేము గౌరవించడంలో తప్పులేదుగా. అదేమి పాపమో గాని వాడు సరిగ్గా ఒక్కగంటైనా మాతో పేకముక్క లెత్తలేక పోయాడు. ప్రతి పదినిమిషాలకీ వాళ్ళావిడ దగ్గర్నుంచి పిలుపొచ్చేది. పాపాయి ఏడుస్తుందనో, బట్టలపెట్టి ఎక్కడపెట్టారో చెప్పమనో, చిల్లర డబ్బులేవైనా వుంటే యిచ్చిపోరాదా అనో. చీట్లాట అంటే పంచప్రాణాలూ ధారపోసే మా చలపతికి యీ 'పిలుపులు' విసుగు తెప్పించలేదు సరిగదా ఖబురొచ్చిన ప్రతి మాటూ ఏదో నేరంచేసిన దుర్మార్గుడిలా మొహంపెట్టేసి నిట్టూర్చి తనని తను తిట్టుకుని తన చేతుల్లోని పేకముక్కలు చాపమీద పగటికలలు కంటూ పగటినిద్రపొయ్యే విశ్వేశ్వర్రావ్ మొహంమీద గిరాటువేసి పరుగెత్తేశాడు. విసుక్కునే వంతు విశ్వేశ్వర్రావ్‌ది అయ్యేది.

—పద్నాలుగోసాటు చలపతి పిలుపు అందుకుని లేవబోతుండగా గట్టిగా అరిచాను.

"ఆగు".

చలపతి ఆగిపోయాడు. మిగతా మిత్రులు కళ్లప్పగించి చూస్తుండిపోయారు. చీమ చిటుక్కుమన్నా శబ్దమయ్యే ఆనిశ్శబ్దం రెండు క్షణాలు ఆవరించిన తర్వాత నోరు సంబాళించుకుని అన్నాను.

"నీకు చీట్లాట కావాలో మీ ఆవిడ కావాలో యిప్పుడే యిక్కడే తేల్చిచెప్పు. అంతేగాని లేవడం మళ్ళావచ్చి కూర్చోడం బిజినెస్ యింక సహించం".

దాంతో చలపతి బుర్ర తిరిగి వుంటుంది. తాగినవాడిలా శివాలెత్తినట్టు అన్నాడు.

"నిలబెట్టి యిలా అడుగుతావని తెలుస్తే నా సమాధానమేదో ముందే చెప్పి వుండే

వాడిని. నీలా తాడూ బొంగరం లేనివాడిని కాదు. నా నెత్తిమీద బాధ్యతలు చాలా వున్నాయి బ్రదర్! మరొకళ్ళ అవసరాలు చూడవలసిన కర్తవ్యం నాకుంది. నీతో యీ వెధవాట ఆడటానిక్కాదు సుబ్బారావ్ పెళ్లికి వస్త. పోనీలే....సరైన చెయ్యిలేక ఏడ్చిపోతున్నారని మీ దగ్గర కూర్చుని మీతో చెయ్యి కలిపినందుకు మంచిమాటే అంటించావ్. నీకూ, నీ ఆటకీ ఓ నమస్కారం. వొస్తాను." అనేసి గబగబా వెళ్ళిపోయాడు చలపతి.

చలపతి! ఆఫ్టరాల్ చలపతా,నన్నింతలేసి మాటలనేస్తా? వాడిది గుండెకాయా? నల్లచెరువా? ఎన్నికూతలు కూశాడూ? ఎంత అవమానించాడూ? ఔరా చలపతీ! నీ పెళ్ళయింతర్వాత గదట్రా నువ్వింత మారిపోతా?

చలపతి ఉపన్యాసం విన్న మీదట పెళ్ళయిన మరో రెండు శాల్తీలు సిగ్గుతో చచ్చిపోయి లేచి చక్కా వెళ్ళిపోయాయి.

ఆ రాత్రి మిత్రవర్గం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసింది. నే నన్నదాంటో తప్పులేదని బ్రహ్మచారులూ, చాలా దారుణంగా మాటాడితినని పెళ్ళయిన బ్రదర్సూ వాదించుకోడం మొదలెట్టారు. ఈ యుద్ధం చూచే ఓపికలేక విశ్వేశ్వర్రావ్, రాజూలతో సినిమాకి పారిపోయాను.

ఆ మర్నాడు తెలిసిందేవిటంటే చలపతిగాడి భార్యామణిగూడా నాకో చురక అంటించిందిట.

"అతనికేవిటీ, ఎన్నైనా అంటాడు మరి. ఇల్లా, ఇల్లాలా, పిల్లలా, బాదరబందీనా. ఏమీ లేవుగాబట్టి యిష్టమొచ్చినట్టు అనగలరు. అయినా యీయనగారికి వుండాల్లెస్తూ - ఎక్కడలేని స్నేహితులూ మనకే గావాలాయె మరి."

ఠోరున ఏడ్చేయాలనుకున్నాను గానీ పక్కనున్న రాజూ సముదాయించడంతో వూరుకున్నాను.

ఆ సాయంత్రం అందరూ ప్రయాణమయ్యారు. నేను హోల్డాలు సర్దుకుంటూండగా చలపతి వొచ్చేడు బిక్కుబిక్కు మంటూ. గదిలో ఇద్దరమే వున్నాము. వొచ్చినవాడు చుట్టూతా చూచి నెమ్మదిగా గొణిగాడు.

"క్షమించు. తొందరలోఏదో అనేశాను."

నవ్వాలనిపించింది. నవ్వేశాను. ఆపైన వాడిభుజం తట్టి "మనం స్నేహితులమోయ్" అన్నాను.

ఇదంతా మా సుబ్బారావుకి తెలీదనా? బాగా తెలుసు. ఆరోజున జరిగిన యీ గందరగోళం తాలూకు వివరాలన్నీ యీనాటికీ వాడికి గుర్తే. లేదన్నాడో - కోస్తున్నాడన్నమాటే మరి.

చలపతి మారినందుకు విచారించి వూరుకున్నాను. సుబ్బారావూ మారిపోతాడని నేనెప్పుడు అనుకోలేదు. మే నెలలో అతని పెళ్ళయింది. జూన్ నెలంతా మామూలుగానే వున్నాడు. రోజు విడిచి రోజు ఉత్తరాలూ, వారం వారం మా సమావేశాలూ అన్నీ సక్రమంగానే జరుగుతున్నాయి.

జూలై నెలలో ఒక శనివారం దారుణమైన రోజుగా నిలిచింది.

● దగ్గిర వస్తువులు సరిగా కనిపించక బాధపడే ఒక మిణుగురు పురుగు ఎవరో పారేసిన సిగరెట్టు పీకని పెళ్ళిచేసుకున్న సంగతి మీకు తెలుసా?

సరిగ్గా అప్పట్నుంచే యీ పెళ్ళయిన వాళ్ళమీద కసి చక్రవడ్డీలా పెరిగిపోతున్న దీని. ఆ శనివారం మామూలుగా బందరెళ్ళాను. రాజూవాళ్ళ మేడమీద మావాళ్లిద్దరూ లేరు. బిక్కు_బిక్కు_మంటూ మేడ మెట్లెక్కాను. రాజూ వాళ్ళమ్మగారు కనిపించేరు. ఆవిడ చెప్పారు_ రాజు తన ప్రేమ విషయ మేమిటో తేల్చుకోడానికి నిర్ణయించినవాడై, ఆరోజుయింట్లో పోట్లాడి, తిన్నగా 'వాళ్ళ' యింటికి వెళ్లాట్ట.

"పోనీండి పిన్నిగారూ_ అతని కోరికని కాదనకండి. మీకు మాత్రం అతని సుఖమే కదా కావలసింది." అని ఆవిడకి నచ్చ చెప్పి, తిన్నగా సుబ్బారావ్ గదికివెళ్లాను. అతనిగురించి అడిగేను. ఆయింటాయన నవ్వుతూ

"వాడు అత్తారింటికి వెళ్ళాడోయ్" అన్నారు.

ఆరిపిడుగా — వెడుతున్నట్టు ఉత్తరమైనా వ్రాశావుకాదే. ఎంత బందరైనా, ఎంత సొంతవూరైనా ప్రాణంపెట్టే మిత్రులిద్దరూ యిలా పరారైపోతే 'బోరు' కొట్టదుటండీ. అందుచేతనే ఎప్పుడూ లేనిది ఆదివారంఅర్థరాత్రి రైలెక్కి_బెజవాడ వెళ్లాను.

నెలలు దొర్లాయి.

రాజూ, సుబ్బారావూ యిద్దరూ ఉత్తరాలు వ్రాయడం మానుకున్నారు. బందరు వెళ్ళినా కనిపించేవారు కానేకాదు. రెండు మూడు సార్లు ఓపికతెచ్చుకుని వెళ్ళేనేగాని తర్వాత విసుగుపుట్టి మానుకున్నాను.

ఒక రోజున....

రాజూ పెళ్ళి అతని ప్రియురాలితో జరుగుతున్నట్టూ, ఆపెళ్ళికి రెండువైపులా పెద్దవాళ్ళ-వప్పుకున్నట్టూ శుభలేఖా, ఉత్తరమూ వచ్చేయి. ఆనందించాను. కానీ.... ఒక శంక పీడిస్తోనే వుంది. పెళ్ళయిన తర్వాత రాజుగూడా చలపతీ, సుబ్బారావుల్లా మారిపోతాడేమో? ఏమో....

నాలుగు రోజులు సెలవు తీసుకొని బందరు వెళ్ళేను. ముందస్తుగా సుబ్బారావు అద్దెగదికి వెళ్ళి అతనికోసం అడుగుతే ఆ యింటాయన భొళ్ళున నవ్వేసి,

"నీకింకా తెలీదుటోయ్. అతను కాపురం పెట్టాడు. ఇంగ్లీషుపాలెంలో యిల్లూ తీసుకున్నాడు." అన్నారు.

నే వాచ్చేస్తూండగా - ఆయన మళ్ళా నవ్వి మెల్లిగా అన్నారు.

"నువ్వూ ఓ యింటివాడివి కాకూడదటోయ్-"

— సుబ్బారావు సంసారి అయ్యాడు.

ఈ విషయమై ఉత్తరం రాస్తే నేమాత్రం సంతోషించనూ. అతను నన్నెందు కింత నిర్లక్ష్యం చేస్తున్నాడు? హుఁ....ఎవర్నని ఏం లాభంలే....


రాజూ పెళ్ళిలో సుబ్బారావు కనిపించాడు గాని, అతన్ని చూస్తూంటే అలనాటి చలపతే నయమనిపించేడు. దుఃఖాన్ని కడుపులో పెట్టుకుని వాళ్ళందరి ముందూ తిరిగాను.

రాజు పెళ్ళి నిర్విఘ్నంగా జరిగింది.

ఆఫీసు కొచ్చేశాను. అన్నీ మరచిపోయేందుకు సర్వ ప్రయత్నాలూ చేస్తున్నాను.

● ● ●

మీ రనుకునే చక్కటి ముగింపు వ్రాయడాని కిది కథకాదుగా. కాబట్టి జరిగింది జరిగినట్టు వ్రాయడం నా విధి.



రాజూ, వాళ్ళ శ్రీమతితోపాటు వొస్తున్నట్టు వైరిచ్చాడు. అతను నన్నింకా మరిచిపోనందుకు చాలా సంతోషించాను. అతను లోగడ అన్న మాటా గుర్తుకొచ్చింది. అతని పెళ్ళి కోరుకున్నవాళ్ళతో అయింది కాబట్టి ఒకరోజు నా గది వాళ్ళకి విడిది అవుతుందన్నమాట. జీవితంలో, దంపతులన్నవారికి ఆతిథ్యమివ్వడం యిది మొదటిసారి. కాబట్టి ఏ కోపమూ రాకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవడంలో మునిగిపోయేను.

వాళ్లు వొచ్చేరు. సాదరంగా ఆహ్వానించేను. ఆ తర్వాత రాలిన చిత్రాతి చిత్రమైన అతని మాటల తాలూకు కొన్ని ముత్యాలు.

"దుర్గాభవన్‌లో ఎయిర్ కండిషన్డ్ రూము లుంటాయిగదూ....".

వాళ్ళు తీసుకున్న ఎయిర్ కండిషన్డ్ గదిలో కాఫీ తాగుతూ అన్నమాటిది....

"అవునూ ...విశాఖపట్టణం వెళ్ళేందుకు ట్రెయిన్ టైమింగ్సేమిటో చెప్పగలవూ."

కళ్ళనిండా నీళ్ళు నింపుకుని తెలిసినంత వరకూ చెప్పాను.

"ఆల్‌రైట్. అవుతే రేపుదయం మెయిల్ మీద వెళ్లడమే హాయి. విశాఖలో మా బ్రదర్‌లా ఒకాయన కెజిహెచ్‌లో వున్నాడు."

వాళ్ళావిడ పక్కనుంది కాబట్టి రాజు బ్రతికిపోయాడు. లేకపోతే అతని చెంప, ఛెళ్ళు మనిపించేవాడిని. పైగా - భయం కలి

గించే అతని 'మిలట్రీ మీసాలు' యిప్పుడు లేవుగూడాను.

ఖాళీగావున్న నా కుడిచేతి గుప్పిటని మూస్తూ, కోపాన్ని దిగమింగుతూ, ఆ దంపతుల ఖబుర్లలో జోక్యం లేకుండా కూర్చున్నాను. తిరిగి తొమ్మిది గంటలకి నా అద్దె గదిని చేరుకున్నాను.

మరునాడుదయమే వాళ్ళు విశాఖపట్టణం వెళ్ళివుంటారు !

ఇది జరిగిన రెండోనాడు సుబ్బారావు దగ్గర్నుంచి ఉత్తరం వొచ్చింది. ఆత్రంగా చదివాను. ఆకర్షించిన వాక్యాలు యివి :

"బందర్లో బోరుకొడుతోంది. నువ్వొక్కసారి వొస్తే ఎంత బావుంటుందని. పైగా— నువ్వు నేనూ మనందరం మిస్సయిన సోఫియా లారెన్ పిక్చరొకటి విజయలక్ష్మిలో ఆడుతోంది. బందరులో యీ మధ్య సివిలిజేషన్ పెరిగిపోతోందయ్యోయ్. వొస్తావుగా."

సుబ్బారావు బొత్తిగా పూర్వకాలపు మనిషైనందుకు సంతోషించాను. అతన్ని యిన్నాళ్లు అపార్థం చేసుకున్నందుకు చింతించాను.

శనివారం బందరు వేళ్లాను. సుబ్బారావింటి దగ్గర రిక్షా దిగాను. నాకోసమే యెదురు చూస్తున్నట్టు అతను వరండాలో కాలుకాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. నన్ను చూడగానే 'హల్లో' అన్నాడు. ఆపైనఇంటికి తాళంవేసి నాతోపాటు రోడ్డు ఎక్కాడు. దార్లో అన్నాడు —

"త్వరలో నేను తండ్రిని కాబోతున్నానోయ్."

— దొరికింది. క్లూ దొరికింది. వాళ్లావిడ పుట్టింటికి వెళ్ళిందికాబట్టి సుబ్బారావు నాకు ఉత్తరం రాశాడుగానీ - లేకపోతే - నన్నుగానీ, సోఫియాలారెన్ పిక్చర్నిగానీ, విజయలక్ష్మి థియేటర్నిగానీ లెఖ్కచేయునా మా సుబ్బారావు? సుబ్రావ్ ! పోనిచ్చావ్ కాదోయ్ నీ పెళ్ళయిన పెద్దమనిషి బుద్ధి.


సినిమా అయింతర్వాత మా యింటి కెళ్ళాను. నిద్రపోయేముందు అక్కయ్య కూతురు గుర్తుకొచ్చింది. ఇంకా మా పెళ్లికి వాయిదా వేయడం భావ్యంకాదు. నిజానికి ఆ పిల్లేకదా నాకుదూరంకానినేస్తం: ☐☐☐

● ఒక ముంగిస ఒక పెద్ద హోటల్లోకి వెళ్ళి కాఫీ ఆర్డరిచ్చింది. తాగిన తరవాత కౌంటర్ దగ్గిరికి వెళ్ళి పదమూడు నయాపైసలు బల్లమీద పెట్టింది.

"కాఫీ ఇరవై పైసలండి" అన్నాడు హోటలతను.

ముంగిస జేబులోంచి ఇంకో ఏడు నయాపైసలు తీసి ఇచ్చింది. హోటలతను "థాంక్స్" అని నవ్వుతూ "మా హోటలుకి ముంగిస రావడం ఇదే మొదటిసారి" అన్నాడు.

"మీరిచ్చే కాఫీ ఇరవై పైసలైతే ఇదే ఆఖరిసారికూడాను." అంది ముంగిస.



వాన కురిసిన రోజు

టి.ఎస్.లక్ష్మి

టైమ్ము నాలుగు గంటలైంది. టిఫిన్ కాఫీలపని పూర్తిచేసి, వంటగది బయట కొచ్చింది రాధ బి. ఎ.

"నాకు కంచిపట్టు పరికిణీ కావాలి.... ఈ ...ఈ...." ఈ తో దీర్ఘాలాపన చేస్తోంది ఐదు సంవత్సరాల సుజాత.

"అమ్మా ః చింతపండు ..... అమ్మగోరూ, చింతపండు" పనిదాని కేకలు, మైలుదూరంనించి పిలుస్తున్నట్టు.

"అమ్మా ః బట్టలు లెక్కజూసుకోం డమ్మా ... ఆల్దీపోవాల" చాకలిదాని ఉదర.

"ఢాం ఢాం.... ఢాం" పౌడరు డబ్బాని నేలకేసి కొడుతూ, కిందపడ్డ పౌడరుని వళ్ళంతా పూసుకుంటున్న రెండున్నర సంవత్సరాల శీను.

రాధ గట్టిగా చెవులుమూసుకుని, గదిలో కెళ్ళి తలుపు గడియపెట్టింది. గాలిలో తేలి మోతలు, అరుపులు, ఏడుపులూ గదిలో ప్రతిధ్వనిస్తున్నాయి. అలి.న శరీరం మన

సుని నీరసపెట్టింది. కోపంతో వళ్ళు వేడెక్కింది. దబేలున తలుపుతీసుకుని మహాకాళిలా బయటకొచ్చింది. ఫెడీఫెడీ సుజా వీపు కందిపోయింది. అది వెక్కుతూ నేల మీద పడుకొంది. "బుద్ధిలేనిదానా! అలా అరుస్తావెందుకే? చింతపండూ లేదూ, సింగినాదంలేదూ మట్టివేసి తోము." ఈ ఉరుముకి హడిలిపోయింది ముసలి పనిమనిషి.

రివ్వు రివ్వున చాకలిదానిమీద కొచ్చింది.

"ఏవిటీ వీహడావిడి? ఎక్కడన్నా ఇళ్ళంటు కున్నాయా? పో అవతలికి? లెక్కాగిక్కా ఇప్పుడేం చూడను. రేపు దయచెయ్యి." చాకలిది గుడ్లు అప్పగించి చూస్తోంది.

"వెధవా! పొడరు తగలబెడుతున్నావా?" డబ్బా లాక్కొని వాడిని ఎత్తి కుదేసింది. "నాకు పంచదార పెత్తమ్మా" వాడు అల్లరికి ఇంకొక టాపిక్ ఎన్నుకున్నాడు పొడరు డబ్బా పోగానే. ఆరున్నొక్క రాగం మొదలుపెట్టాడు పంచదారకోసం.

రాధ కళ్ళు మూసుకుని మంచంమీద పడింది. పిల్లలిద్దరి ఏడుపులు తారస్థాయి నందుకుంటున్నాయి. చాకలి, పనివాళ్ళ సద్దుమణిగింది.

"అమ్మా పూలు తెచ్చానమ్మా" పూల కోసం పోయిన పనిపిల్ల తిరిగొచ్చింది. దాన్ని చూడంగానే రాధ ప్రాణాలు సగం తేరుకున్నాయి. బీరువాతెరిచి కంచి పరికిణీ, తీసి సుజా మీద పడేసింది. డబ్బా తీసి రెండు బిస్కట్లూ ఇద్దరికీ చెరొకటిఇచ్చింది. "నాకు ఇంకోతి...." వాడింకా దీర్ఘం తీస్తున్నాడు. రాధ నిస్పృహాయంగా ఇంకో బిస్కట్టు వాడి కిచ్చింది.

"ఒసేయ్ పిల్లా! వీళ్ళిద్దర్నీ కాసేపు అట్టా షికారు తీసుకుపో. గంట దాకా ఇంటికి తీసుకువచ్చావా వొళ్ళు వాతలు తేల్తాయ్ జాగ్రత్త!" పనిపిల్లమీద విరుచుకు పడింది. అది బిక్కుబిక్కుమంటూ పిల్లల్ని తీసుకుని బయటికి నడిచింది.

"హు". ప్రశాంతంగా ఉన్న ఇంటిని చూసి నీరసంగా నిట్టూర్చింది రాధ. కళ్ళు మూసుకు పడుకుంది. బయటి ఎండకి ఉక్కపోస్తోంది. లేచి ఫేను వేసుకునే ఓపికలేకుండా వుంది. తలలో తేనెటీగల్లాగా ఆలోచనలు ముసురుకుంటున్నాయి. మనసు మాట్లాడుతోంది.


"ఛా ఛా పాడుపిల్లలు! ఒక్కక్షణం విశ్రాంతిగా ఉండనీయరు. ప్రతి నిమిషం ఏదో ఒక దానికి పట్టుదల. ఏడుపులు. రోజంతా వీళ్ళకి సేవచెయ్యటంతోనే సరిపోతోంది. దానికి జడెయ్యటం, నీళ్ళుపోయటం, అంత కష్టమైనపని ఇంకోటుండదు. జడ క్కూర్చోని వొంగుంటుంది. పడుకుంటుంది. ఒకచే అడిపోతుంది. ఇంటి చుట్టూరా రన్నింగ్ రేస్‌లోకి మళ్లే పరుగు పెట్టితేగాని, స్నానానికి రాదు. అబ్బేబ్బే మరీ మొండి మొహంగా తయారయింది. ఇంక లాభంలేదు. దీనిసంగతి ఆయన్తో చెప్పాల్సిందే. అమ్మయ్యో లేకపోతే ఇది వంగుతుందా? చెపితే చావుదెబ్బలు కొడతారని చూస్తున్నాగానీ. బడికి పంపటానికి దాన్ని బతిమాలేటప్పటికి ప్రాణాలు కడబట్టిపోతున్నాయి. అడుగడుక్కీ అంచం పెడితేగానీ కదల్దయ్యే ఘటం. రోజూకొత్త బట్టలు ఎక్కడ తెచ్చివ్వను. ఛా ఛా విసిగించి చంపుతోంది.

ఈ వెధవ వేలెడున్నాడోలేదో వీడికెంత పట్టుదల? అది దెబ్బలు కొడితేనైనా వింటుంది. ఈ వెధవ కాస్త గట్టిగా మాట్లాడితే చాలు శృతి పెంచేస్తాడు తప్ప తగ్గటమంటూ వుండదు. కొంపలో వీడు చేసే అల్లరికి అంతుందా? బియ్యంలో బొగ్గులు పొయ్యటమేనా? పాలల్లో కిరసనాయిల్ పొయ్యటమేనా? వెధవ బోడిగుండుకి రిబ్బన్లుపెట్టి జడలెయ్యమని ఏడుస్తే జడలు నేనెక్కడ తెచ్చేది! డబ్బాలు తిరగదొయ్యటమేనా? ఛా ఛా. ఈ వెధవమేళంతో ఎక్కడికి పోవటానికీ వీలుండదు. సినిమాకి పోవటానికి లేదు. ఫ్రెండ్స్ ఇంటికి పోవటం లేదు. పోతే ఈ అల్లరిమూకనిగూడా వెంటపెట్టుకెళ్ళి నేనెక్కడ భరించగలను? ఛీ ఛీ. సరదాలన్నీ మాయమయ్యాయి. వీళ్ళిలా తయారయ్యారే. పాడుపిల్లలు లేకపోయినా బాగుండును. హాయిగా స్వేచ్ఛగా వుండచ్చు. జంటగా రోడ్డుమీద పోయేవాళ్ళని చూస్తే ఈర్ష్యపుడుతోంది ఇటువంటి బాదరబందీ వాళ్ళకి లేదుగదాని."

గడియారం గంటమోతతో ఆలోచనా ప్రపంచంనుంచి బయటపడింది రాధ. నాలుగున్నర గంటలైంది. బయట ఎండ మాయమై ఆకాశమంతా నల్లని మబ్బులు పరుగుతున్నాయి. చల్లటి గాలి వీస్తోంది. లేచి స్నానంచెయ్యాలి. రాధకు లేవాలనిపించటం లేదు. మనసు శరీరం అలిసివున్నాయి.

బయటనుంచి ఇంటావిడ కేక పెడుతోంది. "ఏమండోయ్ రాధాదేవి! మా డాక్టరు మరదలొచ్చింది. రండి! కూర్చుందురుగాని."

రాధ మనసు బాధతో మూలిగింది. చిన్నతనంనుంచీ తన పేరుపక్కన ఎం.బి.బి.ఎస్. డిగ్రీ చూసుకోవాలనేది రాధ జీవితాశయం. దానికి మధ్యలోనే విఘ్నం వాటిల్లింది. పరిస్థితులన్నీ కలిసి తనని వట్టి రాధ బి.ఎ., గా



చేశాయి వెధవ డిగ్రీ పొయ్యిలో పెట్టుకోనా? డిగ్రీ లేనిమనిషి కనిపించటంలా ఈరోజుల్లో. రాధ మనసులో మృదువయిన ముచ్చటయిన 'డాక్టరు రాధ' రూపం మెదిలి కళ్ళంబడి రెండశ్రుబిందువులు రాలాయి. చిన్న సంఘటన కళ్ళముందు కొచ్చి నుంచుంది. భద్రకాళి గుడికి వెళ్ళినరోజున తన పక్కన ఇద్దరు మెడికల్ స్టూడెంట్సు నుంచున్నారు. అందులో ఒకనమ్మాయి తన్నెందుకో అమితంగా ఆకర్షించింది. మాటలసందర్భంలో తెల్సింది మెడిసిన్ చదువుతోందని. ఆరాత్రి తన కళ్ళెంత దుఃఖాన్ని భరించాయో, ఎందుకోసమో తనకే తెలియదు. అది నిరంతర వ్యథ. జీవితాంతంవరకు అది తనకి గుండెలో కలతచేసే తీరనికోరిక. నిజంగా ఇంటావిడ డాక్టరు మరదలు ఎంత అదృష్టవంతురాలో! ఆవిడ హాయిగా డాక్టరు, భర్త ఇంజనీరట. అంతకంటె జీవితంలో కోరదగిందేమిటి?

కోరిన చదువు. పదవిగల భర్త. ఎందుకూ, తనూవుంది. దురదృష్టవంతురాలు. తన జీవితంలో అనుకున్న వాటన్నిటికీ విధి ఎదురైంది. తను డాక్టరుకాదు. పట్టి రాధ బి.ఏ.. తన భర్త ఇంజనీరు కాదు. గుమాస్తా. అదైనా కావాలని కోరిచేసుకున్నది. అందుకే తనిప్పుడు మనసు విప్పి తన వ్యథ ఎవరికీ చెప్పుకోలేదు. స్వయంకృతాపరాధం. ఆనాడు తన వివేచనాశక్తి ఎందుకంత నశించిపోయిందో తెలియదు. మరి బంధువులంతా తన్నెందుకంత మెచ్చుకుంటారు?

"రాధ క్షేమమ్మా. మంచి అదృష్టవంతురాలు. రూపం, గుణం, విద్య, కోరిన భర్త, గుణవంతుడు, ఆస్తిమంతుడు, పనసపండుల్లాంటి బిడ్డలు! ఇదీ తన బంధువుల నోటంట వచ్చే వాడుక మాట. వాళ్ళకెవరికీ తన బాధ అర్థంకాదు. వాళ్ళకి ఆ స్తీ, పిల్లలు వుంటే చాలు. మిగిలిన వేవీ అవసరంలేదు. తను పట్టి రాధ బి.ఏ.. గుమాస్తా భార్య. ఇద్దరు వేధించుకుతినే బిడ్డలతల్లి. మనశ్శాంతి లేని ఇల్లాలు. ఇదీ తనదృష్టిలో తన వ్యక్తిత్వానికి నిర్వచనం. దానివెనక ఎంత బాధ దుఃఖం దాగివుందో తనకే తెలియాలి.

కిటికీలోంచి విసరిన వానజల్లుకి రాధ మొహం తడిసిపోయింది. అప్పటికిగానీ తెలియలేదు. బయట వర్షం పడుతోందని. రాధ మెల్లగా లేచి తలుపులన్నీ గడియపెట్టింది. మనస్సంతా నిరుత్సాహంగాఉంది. ఇంటివాళ్ళ ఇంట్లోంచి హడావుడి. మర్యాదలూ వానలోంచి దూసుకొచ్చి వినబడుతున్నాయి. రాధ కిటికీ ఓరగా తెరచి చూసింది. ఇంటావిడ ఇంజనీరు తమ్ముడుకి, డాక్టరు మరదలుకి మర్యాదచేసే హడావిడి అదంతా. ఏదైనా అంతే. పదవిని బట్టే గౌరవ సత్కారాలు. రాధ మనసు ఈర్ష్యతో, నిరాశతో మౌనం వహించింది. "ఈయన ఆఫీసరయినప్పుడు, నే చూసినప్పుడు." నిరాదరణగా భర్త నుద్దేశించి గొణుక్కుంది.

నిముషాలు దొర్లిపోతున్నాయి. స్నానం చేసివచ్చిన రాధమనస్సులోని ఆవేశం కొంత ఉపశమించింది. మాలిన్యం అడుక్కుదిగిపోయి మనసుతేరుకుంటోంది. పేపరు వెతికి తెచ్చుకుంది చదువుదామని. బంతితో ఆడుతున్న ఇద్దరుపిల్లలు ఎడ్వర్టయిజ్మెంట్ బొమ్మలో నవ్వుతున్నారు. రాధకి హఠాత్తుగా సుజా, శీనులు గుర్తుకొచ్చారు. పేపరు క్రింద పారేసి తలుపు తెరిచి బయటకి చూసింది. కుండపోతగా వర్షం కురుస్తోంది. గాలికి తలుపులు కొట్టుకుంటున్నాయి భీకరంగా. రాధ వణకిపోయింది. ఎంత బుద్ధిలేనిది తను. ఇంతసేపటి నుంచి వర్షం వస్తుంటే తనకి పిల్లల విషయమే గుర్తులేకపోయింది. అయ్యయ్యో ఈ వర్షములో వాళ్ళు ఎక్కడ తడిసిపోతున్నారో ఏమో. ఆపని పిల్ల వట్టి తెలివి తక్కువమొద్దు. వీళ్ళనిఎక్కడకి తీసుకు పోయిందో ఏమో? వీళ్లు త్వరగా చేరుకుంటే బాగుండును. తన గుండె కుదుట బడుతుంది.

వర్షం జల్లును లెక్కచెయ్యకుండా రాధ వీధి గేటువైపే చూస్తోంది. వర్షంతగ్గే సూచనలు ఎక్కడా కన్పించటంలా. రానురాను హెచ్చవుతోంది. రాధ కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. "భగవాన్ ఒక్క పది నిముషాలు వాన రాకుండా ఆపు. నాబిడ్డలు ఇంటికి చేరుకునేవరకు" రాధ కళ్ళుమూసుకుని మనసులోనే భగవంతుని వేడుకుంది. తదేకంగా నీటి ధారలవంక చూస్తోంది.

నెమ్మదిగా వానజోరు తగ్గింది. సన్నటి చినుకులు పడుతున్నాయి. "అమ్మయ్యా. నువ్వు దయామయుడివి తండ్రీ!" రాధ నిశ్శబ్దంగా చేతులు జోడించింది.

పదినిముషాలు గడిచిపోయాయి. కన్నార్పకుండా రాధ వీధిగేటువైపే చూస్తోంది. ఎక్కడా పిల్లలజాడలేదు. వర్షం పూర్తిగా తగ్గింది. కాని నల్లని మేఘాలు తిరిగి ఆకాశమంతా పరుచుకొంటున్నాయి. రివ్వున చల్లని గాలివీస్తోంది. ఉన్నట్టుండి మెరుపులు. హఠాత్తుగా ఆకాశం బ్రద్దలయినట్టు పెద్దచప్పుడు. "అమ్మో పిడుగుపడింది". రాధ గజగజా వణికిపోయింది. గేటుతెరుస్తున్న చప్పుడు. రాధ మొహం సంతోషంతో ప్రఫుల్లమయి తిరిగి ముడుచుకుపోయింది. గేటు గడియవేసి లోపలికొచ్చిన ఇంటివారబ్బాయి విచిత్రంగా చెబుతున్నాడు: "అక్కయ్యగారూ! ఇందాక పిడుగుపడింది చూశారూ. అదేమో ఎలక్ట్రిక్ పోల్ మీద పడింది. ఎంత మంటనుకున్నారు. ఇవ్వాళ్టికి మనకు కరెంటు గోవిందః అదేగనుక మనిషిమీద పడితే ఏమవుతుందండీ?"

రాధకి వాడిని ఈడ్చి మొహంమీదకొట్టాలన్నంత కోపం వచ్చింది. దౌర్భాగ్యపు వెధవ. ఎప్పుడూ ఇటువంటి అపశకునపు వార్తలే తెస్తాడు. "ఒకవేళ ఖర్మవశాత్తు ఈ పిల్లలు ఆ పిడుగుపడ్డచోట లేరు గదా." అమ్మయ్యో. రాధగుండె కంపించిపోతోంది. వర్షంవెలిసి ఇంతసేపైనా వాళ్ళని తీసుకు రాలేదు. ఈ పాడుమొహం పనిపిల్ల ఏం ఏడుస్తోందో? రాధకోపం పనిపిల్లమీదకి తిరిగింది.

తిరిగి సన్నని వానజల్లు మొదలై క్రమంగా పెద్దదైపోతోంది. చెట్లు విరిగేటంత గాలి. గోడలు చిల్లులు పడేటట్లు వాన జోరు. రాధ నిశ్శబ్దంగా కుర్చీలో కూర్చుంది. తడిసి గజ గజా వణికిపోతూ దీనంగా చూస్తున్న సుజా, శీనుల మొహాలు కనబడుతున్నాయి కళ్ళముందు. ఎక్కడో 'అమ్మా,

---

● ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకున్న గ్రాడ్యుయేట్ కుర్రాడు పర్సనాలిటీ టెస్టుకి హాజరయ్యాడు. ఇంటర్వ్యూ చేసే వారిలో ఒక మనస్తత్వవేత్త కూడా వున్నాడు. అతడు ఒక కాగితంమీద పెన్సిల్‌తో త్రిభుజం గీసి "దీన్ని చూస్తే నీకేం జ్ఞాపకం వస్తుంది?" అని అడిగాడు.

"సెక్సు" అన్నాడు అభ్యర్థి. ఒకవృత్తం గీసి "ఇదిచూస్తే?" అన్నాడు.

"సెక్సు" అన్నాడు అభ్యర్థి.

ఇంటూ గుర్తుపెట్టి "ఇది?" అని అడిగాడు.

"సెక్సే" అన్నాడు మళ్లీ అభ్యర్థి.

మనస్తత్వవేత్త పెన్సిల్ కిందపెట్టి, "మిస్టర్! నీకు ప్రపంచంలో సెక్సు తప్ప మరేమీ లేనట్టుందే?" అన్నాడు.

అభ్యర్థికి కోపం వచ్చి "నాకా? సెక్సా? కాగితంనిండా మీరు బూతు బొమ్మలు గీస్తూను?" అని లేచి వెళ్ళిపోయాడు.

అన్న ధ్వని ఆలాపన. రాధ చేతిలో మొహం కప్పుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"భగవాన్ : నేనెంత పాపిష్టిదాన్ని. బల వంతంగా పిల్లల్ని ఇంట్లోంచి పంపించేశాను. వాళ్ళ అల్లరి భరించలేనంత ఓర్పులేనిదాన్నై పోయాను. ఈ వర్షంలో ఏమైపోయారో ఏమో. చలికి గజ గజా వణికిపోతున్నారు గాబోలు. శీను ఆకలితో 'అమ్మా పాలు' అని ఏడుస్తాడు. సుజా పాపం దిగులుగా బిక్క మొహం వేసుకు చూస్తుంది. ప ని పి ల్ల వాళ్ళిద్దర్ని పెట్టుకొని మొద్దులాగా వానలో నిలబడివుంటుంది. వ ర్షం వెలిసేవరకూ ఎవరింట్లోనన్నా కూర్చుందామన్న ఆలో చన తోచిందో లేదో దానికి."

గుండెలు ఝల్లుమనేట్లు ఉరుములు, మెరు పులు, వాన జోరు. "అమ్మో: ఇంతవర్షంలో తడిస్తే వాడికి మళ్ళీ ఎలాగూ నిమోనియా వస్తుంది. వాడికి వొళ్ళుకాలే జ్వరం, వూపిరి పీల్చటానికి పడేబాధ, తను చూడలేదు. ఛచ్చిపోదామనిపిస్తుంది. ఆ వొచ్చిన జబ్బు తగ్గుతుందో లేదో ? తగ్గకపోతే........

భగవాన్: ఆపై సంగతి నే నూహించ లేను. నన్నెందు కింత శిక్షిస్తున్నావు ? ఏం పాపం చేశాను ? నాతప్పులకు నాకు ఎంతటి శిక్ష విధించినా సహిస్తాను. నా బిడ్డలని మట్టుకు హింసించకు. వాడి చిలిపి అల్లరి చూడకుండా నే బ్రతకలేను. అది ఎంత తెలివిగల పిల్ల ? ఎంత చురుకయిందీ ? ఈ వానలో తడిసి ఏం సుస్తీ చేస్తుందో ఏమో ? శ్రీనివాసా ! నా బిడ్డలని సు ర క్షి తం గా వుంచు" రాధ వెక్కి వెక్కి ఏడుస్తూ వెంకట రమణుని విగ్రహం ముందు చేతులుజోడించి ప్రార్థించింది.

మెరుపు మెరిసినట్టు ఏదో స్ఫురించింది. గంటక్రితమేగా తను పాడు పిల్లలు లేక పోయినా బాగుండును హా యి గా వుండ వచ్చనుకుంది. "భగవాన్ ! అందుకనేనా నన్నింతగా శిక్షిస్తున్నావు ? మూర్ఖురాలనై ఆవేశంలో తొందరలోఅన్న మాటలను నిజం చేస్తావా? నా అ ప రా ధా న్ని క్షమించు. ఏడుకొండలవాడా: నాబిడ్డల భారం నీదే." రాధ మనసు గట్టిచేసుకుని పసిబిడ్డల భారం దేవుని మీద ఉంచి నిశ్చింతురాలవాలని ప్రయత్నిస్తోంది.

గడియారం ఆరుగంటలు వినిపిస్తోంది. రాధకి అప్రయత్నంగా అంతవరకు భర్త తిరిగి రాలేదని గుర్తుకొచ్చింది. పిల్లల గొడవలో అతనిసంగతే మర్చి పోయింది. ఇంతవరకు ఏం చేస్తున్నట్టు చెప్మా ? ఎంత వర్షంరానీ, గాలి రానీ ఐదున్నరగంటలకల్లా ఇల్లుజేరేమనిషి ఆరుగంటలయినా అయిపూ అజా లేదే: మూడురోజులక్రితం వర్షంలో లారీ, సైకిలు ఏక్సిడెంటయి ఒకమనిషి గుర్తు పట్టలేకుండా ర క్తంముద్ద అయ్యాట్ట. ఒక వేళ అట్లా ఏమయినా ... ఛీ ఛీ ఇవాళ ఏమి టిది ? తనకన్నీ ఇటువంటి చెడ్డ ఆలోచనలు వస్తున్నాయి ? ఎంత గ ట్టి గా మూసుకుని వద్దనుకున్నా రాధకళ్ళముందు పొద్దుటి భర్త రౌద్రాకారం మెదులుతోంది.

"ఛీ ఛీ మళ్ళీ ఈ వెధవకొంపలో కాలు పెడితే ఒట్టు" భర్తమాటలు చెవుల్లో హూరు మ్రోగుతున్నాయి. ఆయన అన్నమాట చెల్లించుకుంటారేమో.అమ్మో! అలాఅయితే ఇంకేమన్నా వుందా? రాధకళ్ళు నిండు కొచ్చాయి. ప్రొద్దుటి సంఘటన కళ్ళ ముందు మెదిలింది.

"రాధా, భోజనం పెడతావా ? : లేకపోతే మా దేవి వంటచెయ్యడం ఆలస్యం అయింది కనుక శలవు మంజూరు చెయ్యవలసింది అని శలవుచీటి పెట్టనా?" శేఖర్ పరిహాసం చేస్తూ వంటగది దగ్గరకు వచ్చాడు.

తోక తొక్కిన తాచులాగా ఖస్సుమంది రాధ. "ఇంతోటి వుద్యోగానికి శలవు పెట్ట కుండా మానేసినా పరవాలా".

శేఖర్ మొహం చిన్నబోయింది. రాధ వుద్దేశం ఆఫీసరయితేగాని ఉద్యోగస్తుని క్రింద లెక్కకాదని శే ఖ ర్ కి తెలుసు. అయినా దెబ్బతిన్న అహాన్ని అదుపులో పెట్టుకుంటూ మామూలుగానే అన్నాడు.

"సరే అన్నం వడ్డించు"

"చేసేపని అదే. నాకేం ప ది కాళ్ళు, పది చేతులు, పదిమంది వంట మనుషులు, పది కార్లు లేవు.' రాధ తన కోర్కెలను వ్యంగ్యంగా అరిచింది.

శేఖర్ ఓర్పు అంతమయింది.

"అయితే అవన్నీ వున్నవాడిని చేసు కోక పాపం నన్ను మెడకట్టుకున్నావేం?" క్రోధంతో కూడిన జాలి ప్రదర్శించాడు.


"బుద్ధిలేక!" రాధ జవాబు.

"సరే ఇంకనించి బుద్ధి తెచ్చుకో. తెలి సిందిగా"

"అలాగే" గర్వంగా రాధ సమాధానం.

"ఛీ, ఛీ, వెధవకొంప. వెధవమనుషులు ఇంక ఈ కొంపలో కాలుపెడితే ఒట్టు." విసురుగా డ్రెస్ వేసుకుని అభోజనంగా ఆఫీసుకి వెళ్ళిపోయాడు శేఖర్.

వెళ్ళిపోతున్న భర్తని వెనక్కి పిలవాలని రాధ మనసు తహ తహ లాడిపోయింది.



అహంభావం అడ్డువచ్చింది. ఊరికే చూస్తూ నుంచుంది. భోజనం మానేసి తన్ను తనని శిక్షించుకుంది. ఆసీరసం మీద పిల్లల అల్లరి, గొడవ. మధ్య ఈ వెధవ వర్షం. పిల్లలు రాలేదన్న ఆవేదన. భర్త రాలేదన్న బాధ.

తన తప్పులన్నీ వేయి రెట్లయి కళ్ళ ఎదుట నాట్యం చేస్తున్నాయి. రాధ పశ్చా త్తాపంతో క్రుంగిపోతోంది. ఛీ, ఛీ తనకింత తొందరేమిటి ? ఇంత అసహనవ్యక్తిగా తయారయిందేమిటి. శే ఖ ర్ లో ఎంత సహనం, ఓర్పు, వివేకం. తను వేటిలోనూ అతనిని సరిపోలదు. అయినా తన్నెంత ప్రేమిస్తాడు: అతని హృదయంలో తనకెంత ఉన్నతస్థానం ఉందో త న కి మా త్ర మే తెలుసు. అయినా ఎందుకలా హింసిస్తోంది. అతనిలో, తనకి కావల్సింది పదవీ గౌరవా లే నా? ప్రేమాదరణలు విలువలేనివయ్యాయి తనకి : ప్రేమలేని పదవిని తనేం చేసుకో గలదు? ఆదరణలేని బ్రతుకు విలువెంత ?

"భగవాన్ నన్నెందుకింత తెలివితక్కువ దాన్నిగా చేశావు? నా అపరాధాన్ని దయతో క్షమించు. వివేకం ప్రసాదించు. అతనూ, పిల్లలూ ఇంటికి క్షేమంగా తిరిగి వచ్చేట్లు చెయ్యి. నీ పాదాల సాక్షిగా ఇంకెప్పుడు తొందరపడి వాళ్ళని బాధపెట్టను." రాధ కన్నీటితో శ్రీనివాసుని ముందర నిశ్చల మనస్సుతో ప్రార్థించింది.

బయట వర్షం జోరు కొద్దిగా తగ్గింది.... వాన మోతలో తలుపుతట్టిన చప్పుడు. రాధ ఆత్రుతగా తలుపు తెరిచి చూసింది. తడిసి ముద్దయిన శేఖర్ లోపలికి వస్తున్నాడు. రాధ మనసు సంతోషంతో పొంగిపోయింది. వర్షంలో తడుస్తున్న సంగతికూడా మర్చిపోయి గేటుదగ్గిరికి పరుగుపెట్టింది. సైకిలు మీద సుజా శీనూలు. వెనుక పనిపిల్ల.

"పిల్లు అల్లరి చేస్తున్నారని బయటికి తరిమేశావుటగా? అరెరే ఎక్కడికి వర్షంలో తడుస్తూ? మేం వొస్తున్నాంగా లోపలికి" శేఖర్ చిరునవ్వుతో రాధని పరిశీలించాడు. ఎర్రబడిన కళ్ళు, వడిలిన పద్మంలాంటి మొహం రాధ మనస్సుని ప్రతిబింబిస్తున్నాయి. ఆమె మౌనంగా శీనూని ఎత్తుకుని కొద్దిగా తడిసిన తలని పమిట చెంగుతో అద్దుతూ లోపలికి దారితీసింది. శేఖర్ సుజాని తీసుకుని వెనకనే నడిచాడు.

"వాన వొచ్చేప్పటికి బంగారు పడిపోయ్యావుగదూ! వస్తుంటే దోవలో ఎవరిదో వరండాలో నుంచుని వున్నారు. అందుకని తీసుకొచ్చేశాను" శేఖర్ మృదువుగా రాధ గడ్డం పైకెత్తి ఆమె కళ్ళల్లోకి చూశాడు చిరునవ్వుతో. మంత్రముగ్ధవలె రాధ మౌనంగా కృతజ్ఞతతో కళ్ళెత్తి చూసింది. ఆ స్పర్శ, ఆ చూపు రాధకి విలువ కట్టలేని దీవెనలు. "ప్రభూ! ఈ దీవెనలు నాకు అక్షయంగా ప్రసాదించు తండ్రీ!"

అది రాధ హృదయపూర్వక ప్రార్థన. □



"ఇరువురిదీ పునర్జన్మే"

చిత్రరథుని

చైత్రయాత్ర

"పునర్జన్మ" లోని ప్రత్యేకాత్మ

ప్రసాద్ ఆర్ట్సు పిక్చర్స్‌వారి పతాకాన్ని నాల్గవసారిగా అత్యున్నతస్థాయిలో వెలయించగల చిత్రం 'పునర్జన్మ'. విలక్షణమైన కథ నిర్మించ సాహసించినందుకు నిర్మాత ఎ. వి. సుబ్బారావు, బహుళ జనాదరణీయంగా ఒక పిచ్చివాని కథను సాధించినందుకు దర్శకుడు ప్రత్యగాత్మ అభినందనీయులు, అనుకరణీయులు, అనుసరణీయులుకూడా.

ఈ చిత్ర కథకు ఆధారం గుల్షన్‌నందా వ్రాసిన ప్రఖ్యాత హిందీ నవల 'పత్థర్ - కీ హోంట్' అంటే "రాతి పెదవులు". సుమారు పదేళ్ళగా ఎల్. వి. ప్రసాద్‌గారి దగ్గర వున్న కథను తీసుకొని పి. ఏ. పి. వారు నిర్మించడమువావహామేగాని, అసలుకథకూ 'పునర్జన్మ' కథనానికీ వున్న సంబంధం ప్రాతిపదికలోనే గాని భావైక్యంలోగాదు. అయినా ఈ నవల ఆంధ్రదేశంలో అట్టే ప్రచారం పొందలేదు కాబట్టి ఈ అంశం విచారణీయం కానేరదు.

ఇప్పుడు చెప్పినట్టు "పునర్జన్మ" లో ప్రత్యగాత్మ ప్రతిభ తెలుస్తున్నది కాని, నవలా రచయిత ప్రతిభ కాదు. సినిమాలో వున్న కథ యిది. ఒక కళాకారునికి ప్రమాదవశాత్తు మతి భ్రమిస్తుంది. మనస్తత్వవేత్తల ఆదేశానుసారం వానికి చేదోడువాదోడుగా వుండటానికి, వికలమైన వాని మనసు సంగీత నృత్యాల ద్వారా కుదుటపరచడానికీ ఒక వ్యక్తిని, ఒక వేశ్యను నియమిస్తారు. ఎలా ఆ వేశ్య స్త్రీ అయినదీ, ఆ స్త్రీ యెలా ఒక పెద్దింటికోడలయినదీ, యెలా తన కార్యం సాధించినది మిగిలిన కథ.

"పునర్జన్మ"లో అడుగడుగునా ప్రత్యగాత్మ ప్రత్యేకాత్మ శతవిధాలుగా కనబడుతుంది. ఈ చిత్రానికి సినేరియో తయారు చేసి దర్శకత్వం వహించడమే కాక, చాల మట్టుకు సంభాషణలు వ్రాసిందీ ప్రత్యగాత్మే. కొన్ని సంభాషణలు — నాలుగైదు దృశ్యాలలోవి మాత్రం ఆత్రేయవి. ఎవరు వ్రాసినా చిత్రమైనది వాటిలో ధ్వనించిన ఏకత్వం. ఒకే లక్ష్యంతో, ఒకే గమ్యం వైపు, కటువుగా, నిరంకుశంగా ప్రవహిస్తాయి. నూటికి తొంభైతొమ్మిది పాళ్ళు యివి కొనియాడదగిన గుణాలైనా ఒకటి రెండుచోట్ల ఈ అతి సునిశిత లక్షణం, తత్ఫన్నివేశంలో భావపోషణకు సరిగా ఉపకరించలేదేమో అనిపిస్తుంది.



రాజ్యం పిక్చర్స్‌వారి ''నర్తనశాల'' లో అర్జునుడుగా.



బృహన్నలగా ఎన్. టి. రామారావే!

ఆ సంభాషణలో కావలసిన భావం లేక కాదు. కావలసినంతగా భావవిస్తరణ లేక కాని చిత్రం మొత్తంమీద యిటువంటి లోపం రెండుసార్లే కనబడుతుంది.

ఒక కథను తీసుకొని, అదే పునాదిపై సినిమా కనువైన చిత్ర కథను మలచడంలో ప్రత్యగాత్మ చూపిన ప్రజ్ఞావిశేషం మెచ్చుకోదగినది. నిజానికి సినిమాలో కథకన్న సంఘటనలకు ప్రాముఖ్యం యెక్కువ. ఈ సంఘటనలకు చిన్న చిన్న పిలవలు పలవలు అల్లి, నిజకథా ప్రవాహంలో ఇవి చెత్తలాగా ఒడ్డున పడకుండా, ఆ వాహినిలో ఒక భాగమై తేలియాడించడం అతి ఉత్తేజకరమైన వాస్తవం.

ఇక దర్శకుడుగా ప్రత్యగాత్మ చూపిన నైపుణీలాఘవం భావానికి తగిన రూపకల్పన చేయటం. ఇందులో ఛాయాగ్రాహకుని (సెల్వరాజ్) అండ యెంతైనా వుంది. ఎక్కడా ("నీకోసం" రెండవసారి వినపడిన ఒక్కమారుతప్ప) ప్రేక్షకునికి విసుగెత్తకుండా, మందగమనంలోనే చిత్రాన్ని నడిపించారు. ఇటువంటి చిత్రాలకు మెల్లని నడక ఒక సుగుణమే. మరొకటి — యేపాత్ర యెటువంటి పరిస్థితిలో కూడా

మరొక పాత్రకు అన్యాయం చెయ్యక పోవటం. ఈ మూడు గుణాలు ఒక ఉత్తమ దర్శకుని అత్యుత్తమ శ్రేణిలోకి చేర్చగలి గిన యోగ్యతా పత్రాలు.

పిచ్చివాడుగా నాగేశ్వర్రావు జీవించా డనడం పాతకాలపు పొగడ్త. పిచ్చివాడు ఒకటి రెండుచోట్ల నాగేశ్వర్రావులా సిసలైన కళాకారునిలా కనిపించాడనడం ఈనాటికి. ఈ పాత్ర నిర్వహణకు తగిన వ్యాఖ్య. కృష్ణ కుమారి పాత్ర ఉన్నంతమేరకు అతిచక్కగా నటించింది. అతిచక్కగా కనిపించింది. మొదటి రెండు నృత్యాలు లేడిపిల్లలా చేసింది. గుమ్మడి గుమ్మడి నటించవలసిన స్థాయిలోనే నటించాడు. మతిమరుపు రాము డిగా రమణారెడ్డి (అమ్మాయి పుట్టిందా? ఎప్పుడు? ఎంతసేపయింది?)? సొసైటీ లేడీగా సూర్యకాంతం (ఈ యశోదాదేవిగారి పేరులేని పేపరు దేశం మొత్తంమీద లేనే లేదు). వెఱ్ఱిచేష్టల వెకిలి తిమ్మన్నగా పద్మ నాభం (అద్భా నొప్పి). కాకతాళీయంగానే (?) వంచ్ లైన్సన్నీ కొట్టేసిన ప్రభాకర రెడ్డి (ఈ కాలంలో కూతురుకన్నా తల్లే యెక్కువ పడుచుదనం ఒలకబోస్తున్నది – ఇన్నాళ్ళకైనా నూ నాన్న స్వర్గానికి దారి తెలుసుకున్నాడు - తెల్లవారిందా పతివ్రత లకు?) మోతాదు మించని సున్నితమైన హాస్యం అందించాడు. వాసంతి, సంధ్య, హేమలత, రాజుబాబుకూడా బాగానే చేశారు. ముప్పాతిక డైలాగు తొడుక్కొని నవ్వించి ముప్పతిప్పలు పెట్టాడు వేణుమాధవరావు.

చలపతిరావు ప్రత్యక్ష సంగీతం పరోక్ష సంగీతం ఉత్తమంగా, అత్యుత్తమంగా వున్నాయి. దృశ్యంలో ప్రతి భావానికి అను గుణ్యంగా పలికిన నేపథ్య సంగీతంగల చిత్రాలుచాలా అరుదు. అందులో "పునర్జన్మ" ఒకటి. "అందగాడా" (దాశరథి) వీటి రచనలోను, వరసలోను అందంగావున్నది. ఏదో ఒక కారణంచేత ప్రజాదరణ పొంద బోయేవాటిలో "ఎవరివో", "దీపాలువెలిగే" "నీకోసం" (శ్రీశ్రీ, దాశరథి, సి. నా. రె.) హైటిల్ మ్యూజిక్ బాగాలేదు. పసుమర్తి నిర్వహించిన 'పిచ్చి' డాన్సు భలేగా వుంది.

మొత్తంమీద తెలుగు చిత్రసీమకు మరొక ఆశాకిరణం.


జగపతి చిత్రం

క్రిందటినెల చివరవారంలో జగపతి యూనిట్ ఊటీలో ఔట్‌డోర్ జరిపివచ్చారు. చిత్రానికి పేరు యింకా నిర్ణయించలేదు. కాని విజయవంతమైన వంగచిత్రం 'అగ్ని సంస్కార్' దీనికి మాతృకన్న విషయం తెలినదే. నాగేశ్వర్రావు, బి. సరోజాదేవి, జగ్గయ్య, కన్నాంబ యిందులో ప్రధాన భూమికలను ధరిస్తున్నారు.

ఊటీలోమూడుపాటలు, కొన్నిదృశ్యాలు చిత్రీకరించ బడతాయని నిర్మాత రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. వి. మధుసూధనరావు ఈ చిత్రానికి దర్శకుడు. "ఆరాధన"లో ప్రేమసన్నివేశాలనూ, "రక్తసంబంధం"లో విషాదఘట్టాలనూ, "లక్షాధికారి" హాస్య దృశ్యాలను నభూతోనభవిష్యతి అనే పద్ధతిని తెరకెక్కించిన ఈ దర్శకుడు ఈచిత్రంలో మూడూ ఆఅంతస్తులోనే చూపెడతారని ఆశ

పాటలు, సంభాషణలు ఆత్రేయ వ్రాశారు. ఇప్పటికి పన్నెండు రీళ్ళు తయా రయిన ఈ చిత్రం జనవరికి వాణీద్వారా విడుదల కాగలదని సూచన.

కె. వి. మహాదేవన్ ఈ చిత్రానికి సంగీత దర్శకులు. "చిన్నవాడా" అంటూ సరోజా దేవి (సుశీల) పాడుతూ ఆడినఘట్టం వింత ధోరణిలో సాగిందని షూటింగ్ చూసిన వారి అభిప్రాయం. ఇందులో జమునారాణి, ఘంటసాల పాడిన యుగళ హాస్యగీతం ఆంధ్ర ప్రజానీకపు నాల్కలపై ఆనంద తాండవం చేయగలదని అప్పుడే యిక్కడ గ్యారంటీ యిచ్చేస్తున్నారు.



"కలవారి కోడలు" స్క్రిప్టుమీద హేమాంబరధరరావు, గోపాలకృష్ణ.

ఈ చిత్రంలో మరొకపాట నాయికా నాయకులపై పూర్తిగా వర్షంలోనే చిత్రీకరిస్తా మని మధుసూదనరావు తెలిపారు. మరొక రెండుపాటలు, ఒకటి సుశీల, ఘంటసాల స్వప్నగీతం. మరొకటి మహమద్ రఫీ పాడబోయేది, (పతాక సన్నివేశానికి) ఈ నెలలోనే రికార్డవుతాయి.

కలవారి కోడలు

రఘురాంవారి "కలవారి కోడలు" వీనస్, న్యూటోన్ స్టూడియోలలో అతి త్వరితంగా ముగింపు ముస్తాబు చేసుకుంటున్నది. దర్శ కుడు కె. హేమాంబరధరరావు ఆధ్వ ర్యాన, ఇటీవల నాయికానాయకులు రామా రావు, కృష్ణకుమారి ఉన్న ఆసుపత్రి దృశ్యాలు కొన్ని చిత్రీకరించబడినవి. ఒక ఆపరేషన్ దృశ్యం ఈ సన్నివేశంలో ప్రధానమైనది గనుక ఆ విధానాలు సక్ర మంగా చిత్రీకరించడానికి తోడ్పాటుగా సెట్టు మీద సలహాదారునిగా డాక్టర్ ఎం. డి. కె. రెడ్డిని నియమించారు. క్లోజప్ తీసినప్పు డంతా వారి సలహాల ననుసరించారు.

ఈ చిత్రంలో ప్రత్యేకాకర్షణలు: నార్ల చిరంజీవి వ్రాసిన "మంచి మనసు తెలిపేది స్నేహము." కల్యాణిరాగంతో చిత్రం మొదట్లోనే వినిపిస్తుంది వీణపాట. ఈ పాటకు వాద్యగోష్ఠిలో వీణాపాణులు చిట్టి బాబు, మూరెళ్ళ రంగారావు ప్రభృతులు నలుగురు పాల్గొన్నారు. సుశీల పాడిన "విరిసిన పూవును నేను". రచన సి. నారా యణరెడ్డి. ఈ నెల మధ్యలో నందీహిల్స్‌లో ఔట్‌డోర్‌లో చిత్రీకరించబడుతున్న రెండు పాటలు. వాటి గాత్రధారులెవరైనా పాత్ర ధారులు మాత్రం రామారావు, కృష్ణకుమారి తారాగణంలో తక్కిన ముఖ్యులు గీతాంజలి, గిరిజ, చలం, పద్మనాభం. వీరి హాస్య

దృశ్యాలు అతి సొంపుగా వున్నాయని ఒక సహాయదర్శకుని ఉవాచ. సంభాషణలు నార్ల చిరంజీవి.

ఈ చిత్రానికి సంగీతం చలపతిరావే. సహ నిర్మాత. అట్లూరి పూర్ణచంద్రరావు. సహాయదర్శకులు ము. గోపాలకృష్ణ. లక్ష్మీ నారాయణ.

వచ్చేదే
"జ్యోతి"
దీపావళిసంచిక
వెల రూపాయి మాత్రమే
విలువ? మీరే నిర్ణయించాలి.

రహస్యం

లలితా శివ జ్యోతివారు నిర్మిస్తున్న సంపూర్ణ వర్ణచిత్రం "రహస్యం" కోసం మల్లాది రామకృష్ణశాస్త్రి "తిరుమలగిరివాసా, దివ్యమందహాసా" అన్న శ్రీనివాసస్తోత్రాన్ని వ్రాయగా ఘంటసాల వరుసచేసి పాడారు. ఇంతకుముందు ఘంటసాల.మల్లాది ఎందుటో కలిశారో గుర్తుందా? అతి మధురమైన సంగీతం వినిపించిన వినోదావారి "చిరంజీవు"ల్లో. ఈనాటికీ గాయకులనోట. రసికుల మనసుల ఆ పాటలు. "తెల్లవారగ వచ్చె తెలియక నా స్వామి. "మనసునీదే. మమత నీదే." "కనుపాప కరవైతే కనులెందుకు" మెదలుతున్నవే.

"రహస్యం" హాస్యగీతాలు సదాశివ బ్రహ్మం వ్రాస్తారనీ, తక్కినవి మల్లాది వ్రాస్తారని తెలుస్తున్నది.

మల్లాది రచనలనే రెండింటిని— యుటీవల తిరిగి ఆరంభించబడిన శ్రీరామావారి "దేశద్రోహులు" కోసం రాజేశ్వరరావు వరసచేసి రికార్డు చేయించారు.

"బొబ్బిలియుద్ధం" లో రంగారాయుడు, మల్లమ్మ





"వాణి నారాణి" అని అలనాడు ఒక ఆంధ్రకవి సగర్వంగా చెప్పుకున్నాడు. "అందమైన, మధురమైన, శ్రవణ సుభగమైన బాణీ నారాణి" అని ఈనాడు చెప్పుకోగలిగిన ఆంధ్ర చలన చిత్ర సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు.

తన గీతం తన జాతి జనులు పాడుకునే మంత్రంగా మ్రోగాలంకంటె ఏ సంగీత కారుడైనా కోరుకునే దేముంటుంది? ఆంధ్రదేశంలో ఆబాల గోపాలం పాడుకునే సినిమా పాటలలో ఎక్కువభాగం పెండ్యాలవే. స్వచ్ఛమైన దేశీయ ఫణతులలో అందరూ సులభంగా, సరదాగా పాడుకొనడానికి వీలుగా వుండే స్వరసలతో తాము కట్టిన పాటలు వూరూరా, నోనోటా మారుమ్రోగుతున్న కీర్తికి వారసులైన కొద్దిమందిలో పెండ్యాల ఒకరు. శ్రోతలలోని సుప్త స్వరాలను మేల్కొలిపి సప్తస్వరాల వరాలడోలలో ఉయ్యాల లూగించే శక్తి ఆయనలో పుష్కలం.

లోక వ్యవహారంలో ఆయన నాగేశ్వరరావే కాని, సంగీత లోక వ్యవహారంలో ఆయనపేరు రాగేశ్వరరావు. అంతే కాదు; ఓర్పు, నేర్పు, కూర్పులకు ఆయన పెట్టింది పేరని శ్రీనివాస్ తీర్పు. ఇకపేజీ తిప్పి చదవండి.

సప్తస్వరాల ఉయ్యాల

పి. బి. శ్రీనివాస్

ఆంధ్రా ఫిలింపొలంలో, సంగీతక్షేత్రాన్ని "హార్మొనీ" అనే హలంతో దున్ని, సప్తస్వరాలనే విత్తనాలను చల్లి, ఏటేటా ఏపుగా చక్కని పాటల పంటలు పండిస్తున్న శ్రీ పెండ్యాల నాగేశ్వరరావుగారి గురించి రాయబోవడం, సూర్యుడిని దీపంతో చూపించడమే అవుతుంది.

"పెండ్యాల సప్తస్వరాల ఉయ్యాల" అని ఊరికే అన్నారా మరి! పిక్చర్ల క్రెడిట్ టైటిల్స్‌లో పెండ్యాల పేరురాగానే, ప్రజలకి పిక్చరు చూడక మునుపే నమ్మకం కలిగిపోతుంది - పసందైన సంగీతం వినబోతున్నామని. "స్వరాల మధ్య నెయ్యం, కయ్యం, వియ్యం, నేర్పుతో నెరపుతూ, మంచి సంగీతం అందించాలంటే దెయ్యంలా పనిచెయ్యాలి" (work like a devil) అనే వారిలో శ్రీ నాగేశ్వరరావుగారొకరు. ఏదో యాదాలాపంగా, బుర్రకి తట్టినదీ, నోటికి వచ్చినదీ నచ్చిపోయి, ప్రతీదీ మంచి ట్యూనే అనేసుకుని, తేలికగా, టూకీగా, ఓకే చేసేసుకునే స్వభావం కలవారుకారు. తాపీగా (కవి భీష్ములనుకునేరు స్మండీ) ఆలోచించి, సంగీత కూపస్థ నిక్షిప్త సుప్త సప్తరస స్వరాల కూపీ లాగి, మేల్కొలిపే దాకా హాపీగా ఫీలవరు. సాధారణంగా ఫీలవరు. పాటలోని పదాల బరువునితూచి, ఆ బరువుకి సర్వవిధాలా సరితూగే వరాల స్వరాలు తోచేవరకూ వేచి, నిదానంగా కూర్పుని ఏరుకుని మరీ వరుస కూర్చుకుంటూ పోతారు. నచ్చకపోతే నచ్చేదాకా మార్చుకుంటూ పోతారు. వరుస కట్టడం నిర్మాణం సంపూర్ణమైన అనంతరం కూడా, అప్పుడప్పు డక్కడక్కడ మేధావీధిని మెరిసే మెరుపుల వెలుగుల మెరుగులుకూడా తీర్చుకుంటూ, దిద్దుకుంటూ, చేర్చుకుంటూ పోతారు. పక్కనున్న పదిమందీ విని బాగుందని మెచ్చుకున్నా, గబుక్కున అర్జంటుగా తృప్తిపడిపోరు. ఒకప్పుడు తనకినచ్చినా ఎదటివారికి నచ్చకపోతే వారిని సంతృప్తి పరచేదాకా నిద్రపోరు.

పాటలోని, ఒకమాటకి "దపమా" అని మనసులో స్థిరపరచుకున్న వెనక, ఆ "దపమా," అనుమాన రహితంగా తా నను



పెండ్యాల నాగేశ్వరరావు

కున్న విధాన వచ్చే వరకూ వదలరు. తా నెదురు చూచిన ఫలితం పాటలో వచ్చి నప్పుడు వీరు పొందే ఆనందం అనిర్వచ నీయం. ఆత్రేయగారి 'తిరపతి' నాటకంలో నేనూ, జానకిగారూ కలిసి తొలిసారిగా వీరి దర్శకత్వంలో పాడిన "ఇదేకదా తొలి రేయీ" గీతికలో, కాలము నినుగని నవ్వి నదీ" అనే వాక్యంలో నవ్వినదీ అన్న పదం పైన చిన్న నవ్వు నవ్వమని వారు కోరిన రీతిని నవ్వి నేను పాడినప్పుడు, వికసించిన వారి ముఖపద్మాన్ని చూసి తీరాలి. "పాట కులు" తనకు నచ్చేరీతిగా పాడగలిగినప్పుడు మనసులోంచీ మెచ్చుకోవడం, పాడలేక పోయినప్పుడు ముభావంగా వూరుకుని, "మ్చెమ్చె" అని తనలో తానే నొచ్చు కోవడం వీరి స్వభావం.

స్వప్నంలో కూడా స్వరాలతోనే సరస సల్లాపలాడుకుంటూ వుంటారేమో అనిపి స్తుంది. ఏ స్వరాన్ని ఎటుమార్చి, ఆ స్వరంపైన మరోస్వరం పేర్చి, ఎలాగ వరసకి, రసపుష్టి చేకూర్చడమా అనేదే అనవరతం వీరి తాపత్రయం. అలాగని వట్టి "పర్మ్యుటేషన్స్, కాంబినేషన్స్'' మీదే ఆధారపడితే మ్యూజిక్ కూడా మేథమేటిక్స్‌లాగే శుద్ధ గణనాత్మకమై వూరుకుంటుంది. భావౌచిత్యం, సందర్భ శుద్ధీ, మూడ్, మెలడీ వగైరా ఇతరఅంశాలు కూడా గమనించుకోవాలి" అని వీరి అభి ప్రాయము.

అయినా, సంగీతానికి, గణితానికీ అవినా భావ సంబంధముందన్న విషయం మనం కాదనలేం! తాళప్రకరణం అంతా గణిత శాస్త్రప్రకారమేగా వుంటుంది ? గణితశాస్త్రం

మీద ఆధారపడని దీప్రపంచంలోనే వుండ దని ప్రఖ్యాత నిర్మాత వాల్ట్ డిస్నీ ఈ మధ్యే ఒక కార్టూను చిత్రంతీసి చూపారు.

శ్రీ నాగేశ్వరరావుగారికి పాత సంప్ర దాయాలూ, పద్ధతులూ అంటే భక్తి ప్రప త్తులు మెండు. సంగతులన్నా బిరకాలన్నా మక్కువ ఎక్కువే కాని, ఎక్కడెక్కడ వాడితే సంగీతం అందగిస్తుందో అక్క డక్కడ మాత్రమే వాడతారు. ఒక్క ముక్కలో వక్కాణించాలంటే, తను పట్టు బట్టి కట్టినమట్టు డెఫినిట్టుగా హిట్టు అవు తుందని తను మనస్ఫూర్తిగా అనుకోగలిగే దాకా, విసుగు విరామం లేకుండా తంటాలు పడుతూనే ఉంటారు.

ఇట్టి "దీక్ష"యే తనకు సదా శ్రీరామ రక్ష కాగా, వీరు "దీక్ష" "ద్రోహి" చిత్రాల లతో పేరు గడించి, ఘన విజయం సాధించారు. "ద్రోహి" చిత్రం మొట్టమొద టిది. "మొదటిరాత్రి, దీక్ష" తరువాతవి. ఇలా తొలిచిత్రంలోనే విజయం సాధించ డం అనేది అందరికీ అందుబాటులో వుండదు. దానికి "భాగ్యరేఖ" అవసరం. ముమ్ముందు, తన పేరుగల ఫిల్ముకి, వీరు సంగీతం ఇవ్వవలసిన యోగం ఉందని తెలుసుకొనే కాబోలు, 'భాగ్యరేఖ' వీరిని ప్రథమ చిత్రంలోనే వరించింది.

ఓర్పుకు మారుపేరు

ఓర్పుకి వీరు పెట్టింది పేరు. ఆ ఓర్పుని నేర్పుతో ఎలా సమయానుకూలంగా ఉప యోగించుకోవాలో వీరికి బాగా తెలుసు. మొత్తానికి, ఇంత నిదాన ప్రధానమైన స్వభావం కలిగిఉండడం చాలా కష్టం.



సంగీతకర్తతో వ్యాసకర్త

కొంతమంది ఓర్పుని తెచ్చిపెట్టుకుంటారు. ఏదోనాడు ఏదో విషయంలో తేలిపోయి బయటపడిపోతారు. కాని నాగేశ్వరరావు గారు గోతుల్యమయిన సాధు స్వభావం కలవారు. ఎంతటి చండప్రచండమైన ఆగ్రహావేశంలోనైనా, విషధరధరుడు, గర శాన్ని గళంలోనే మిళితంచేసుకున్న రీతిని, గప్‌చిప్‌గా కోపాన్ని మింగేస్తారు. పైకి రానివ్వరు. ఇదందరికీ సాధ్యమా? వీరి భూషణం శాంతం.

ఈ ఒక్క సుగుణమే చాలు, వీరందరి తోనూ మంచిగానే వుంటూ నెగ్గుకు రాగలుగు తున్నారంటే గల కారణమనడానికి. ధూమ పానం, మందవిషసేవనం (కాఫీ త్రాగడం), వంటి పట్టుకుంటే జిడ్డులా వదలని అల వాట్లు, బాగా అలవాటై పోయిన మీదట గూడా, గుండె నిబ్బరంతో మాని వేయ గలిగిన వీరి ఆత్మసంయమనం అసదృశం. అనుకరణీయం.

ట్యూనుల సెలెక్షన్‌లో వీరు చూపే శ్రద్ధా సక్తులు తిలక్ గారి కంపెనీలు - అనగా "అనుపమా"లు. రాత్రిళ్ళు రికార్డింగులు జరిగేటప్పుడు గూడా పాడిన మేమూ, వాయి ద్యాలు బజాయించిన ఆర్కెస్ట్రా బృందం, అలిసిపోయి ఇంటికి దొడు తీసినా, తెల్లవారి పోతున్నా సరే, ఇసుమంతయు విసు

గొందక, చేయించిన ఇరవై ఓకులా విని, ప్రతీ ఓకులోనూ, తనకి నచ్చిన తునకలు (Bits) అన్నీ గుర్తించి పెట్టుకుని, వాటి నన్నిటినీ కలిపి, మొత్తం మీద నీటైన ఓ కొకటి తయారించు కుంటారు. పందొమ్మిదో ఓకులో ఫ్లూటు బిట్టూ, ఎనిమిదో ఓకులో ఎకార్డియన్ పీసూ, పదో ఓకులో పల్లవీ, అయిదో ఓకులో అను పల్లవీ, మూడో ఓకులో మేండొలిన్ పోర్షన్, చివరి ఓకులో చరణం, ఇలా తుంచిన తుండులన్నీ ఏరుకుని, మంచి పండు లాంటి ఓకు తయారు చేసుకోవడం అంటే మాటలా! ఈ ఓపిక వీరికే చెల్లింది.

"అత్తా ఒకింటి కోడలు" చిత్రానికి, జిక్కీ గారు నేనూ బృంద సహాయంతో ఆలపించిన "పైలా పైలా పచ్చీసు" పాటే దీనికి తిడగులేని తార్కాణం. ఆ రోజున ఖర్మం కొద్దీ ఒక్క ఓకు కూడా పూర్తిగా తృప్తిగా రాలేదు. "రిదం"లో కాంప్లికేషన్ వల్ల నైతేనేం, నిద్రా ముద్రితాలైన ముఖాలతో జోగుతూ వుండడంవల్ల నైతేనేం, తాళంలో ఒకరు చేరితే మరొకరు చేరేవారు కారు. ఎలాగో యిసకలోంచి నూనె పిండి నట్టుగా, కొన్ని ఓకులు ఓకాము. ఏమైనా, మంచి పాట చెడిపోయిందనే బాధతోనే బయలుదేరాము యిళ్ళకి. కాని, చివరికి ఏంచేశారో, ఎలా సాధించారో కాని, మేము పిక్చర్లో ఆ పాట విన్నప్పుడదరి పోయాం. ఇంత చక్కని ఓకెక్కడ దొరికింది ఈయనకి, అని. డిఫెక్ట్సు అన్నీ ఎఫెక్ట్సుగా మారిపోయాయి వీరిచేతిలో.

ఒకనాడు, "నిత్యకళ్యాణం పచ్చతోరణం" చిత్రానికని చలానికి పాడిన, "ఎవరికి వారే యమునా తీరే- ఇకలేనేలేరోయీ, నా అనువారే" అనే ఆరుద్రగేయం భరణిలో రికార్డింగు జరుపుతున్నాం. ఆనాడు, నిమ్మకాయ రసం సేవించినందువల్లనో, కొబ్బరికాయపచ్చడి కొట్టేసినందు వల్లనో, పెరుగుమీది మీగడ మింగినందు వల్లనో, మరేకారణం చేతనో జ్ఞాపకంలేదు గాని, నాగొంతు పలకవలసిన విధంగా పలకలేదు చాలాసేపటిదాకా. ఎంత ప్రయత్నించినా, రెండుకీ, నాలుక్కీ మధ్య, అంటే మూడు (Mood) లోకి రాలేకపోయాను. పెండ్యాల ప్రాణం విసిగిపోయింది. బలేబాధ పడిపోయారు. అంతటి చింతలో కూడా, "ఈ పాట ఖర్మ ఇంతే, మనం ఏం చెయ్యగలం చెప్పండి, ఒక్కొక్క పాట జాతకమే అంత" అని ఆవేదనతో వేడివేడి నిట్టూర్పు విడిచారేతప్ప, సూటిగాగాని, చాటుగాగాని, ఎవరినీ ఏమీ అనలేదు. అప్పటికీ, నాకు ప్రోత్సాహమిస్తూనే, నాచేత, చేతనయినంత వరకూ, ఆ పాట, అదేరోజున, బాగా పాడించుకున్నారు.

బాల పెండ్యాల

6-3-1917 తేదీన, కృష్ణాజిల్లాలోని కాటూరు గ్రామంలో వీరు జన్మించారు. వీరిని ప్రపంచానికి ప్రసాదించినవారు శ్రీ సీతారామయ్యగారు. వారు గూడా . గొప్ప హార్మోనియం విద్వాంసులే. కనుక 'హార్మోనీ' విద్య, నాగేశ్వరరావుగారికి పిత్రార్జితంగా లభించిందనుకోవచ్చు. హార్మోనియం వాయించడమేగాక, బాల్యం లోనే వీరు చాలా మనోహరంగా పాడేవారట. గొంతు సన్నంగా, అచ్చంగా అమ్మాయి గొంతులాగ ఉండేదిట. ఆడవేషాల కనువైన, ముచ్చటైన ముద్దుగొలిపే ముఖాకృతి వుండేదిట. ఇవన్నీ చూసే, శ్రీ దైతా గోపాలంగారు వీరిని సక్కుబాయి వేషానికి సెలెక్టు చేసుకున్నారట. మొదట్లో బెజవాడ నాట్యమండలిలో దైతావద్ద ఈ వేషం తుంగల చలపతిరావు వేసేవారట. ఆ టీమ్ కామ్‌గా విడిపోయి, కంపెనీ కరిగిపోయే (డిసాల్వ్) టైమ్‌లో పెండ్యాల గారు దొరికారు దైతాగారికి. తుంగలస్థానే వీరిని ఎన్నుకున్నారంటే, వీరు బాల్యంలో ఎంత బాగా పాడుతూ ఉండి వుండాలో మనం వూహించుకోగలం. అనుభవ నిధులైన దైతా దర్శకత్వంలో అభినయాది లలితకళలలో బాగా తర్ఫీదుపొంది వుండడము, ఉత్తరోత్తరా వీరి కెంతైనా లాభించింది. మా రిహార్సల్సూ వగైరా పని ముగించుకున్నతర్వాత కొంతసేపు నాగేశ్వరరావుగారు తమ చిన్ననాటి ముచ్చట్లు కొన్ని వినిపిస్తూ వుంటారు. అందులో కొన్ని ముఖ్యమైనవి మాత్రం క్లుప్తంగా వ్రాస్తున్నాను.

డ్రామాల పెండ్యాల

డ్రామాల్లో పాల్గొనే రోజుల్లో, వీరోసారి "గయోపాఖ్యానం"లో సహదేవుడి వేషం వేయవలసి వచ్చిందట. రంగూ అదీ బాగా ముందే ముఖాన రుద్దుకుని రెడీగా కూర్చున్నారట - నాటకం ప్రారంభించడానికి ఇంకా చాలా టైముందనగా. వేచి వేచి ఎంతసేపు చూసినా, నాటకం మొదలవలేదు. అసలు, గయుడుగారి పత్తాయే దొరకలేదు - "గయోపాఖ్యానం" ఏమాడతారు? "సహదేవోపాఖ్యానం" ఆడుకోవలసిందే. అర్జున పాత్రధారి అయిన కపిలవాయి రామనాథ శాస్త్రిగారూ, మరి కొందరు ఆర్టిస్టులూ?- తమకింకా "మనీ విటమిన్" ముట్టలేదని కొంత మందీ, మరో కారణంచేత మరికొంతమందీ గైరుహాజరయ్యారట. బహుశా ఇది తెలిసే అయివుంటుంది, తనని కాపాడవలసిన అర్జునుడే రాకపోయినప్పుడు, తానొంటరిగా వచ్చేస్తే, కృష్ణపాత్రధారి తను వేసిన వేషంలో లీనమైపోయి, మైమరచిపోయి, తనే కృష్ణుడూ, వెల్లంకే గయుడూ, అని పూర్తిగా, నమ్మకంగా నమ్మేసి, తనచేతిలో ఉమ్మేసిన గయుడి పై కలిగినకోపం కారణంగా, గయ పాత్రధారి అయిన వెల్లంకి (వెంకటేశ్వర్లు) సంహారానికి పాల్పడితే, ప్రమాదం సంభవించే ప్రమాదం వుండవచ్చని భయపడ్డారో ఏమో, వెల్లంకి గారు బెల్లం కొట్టిన రాయిలా ఎక్కడో ఎవరికి తెలియనిచోట కూర్చుండి పోయారుట. అసలు, నాటకం ఏర్పాటుచేసిన కంట్రాక్టరు గారే, వసూళ్ళునిండిన గల్లా పెట్టెతో సహా పరదేశానికి పలాయన మంత్రం పఠించారని విని, వచ్చిన నటీనట నట వర్గంకూడా వచ్చిన జాడతెలియకుండా గప్చుప్‌గా మాయమవుదామనుకునే లోపుగా, రాత్రి పదకొండు గంటలప్పటికే దాటిపోయిన కారణాన, ప్రాణం విసిగిన ప్రేక్షకులు, చేతికి దొరికిన ఆయుధాలు అనగా విరిగినవీ విరగ్గొట్టినవీ, కుర్చీలూ బెంచీలూ అందుకుని, రంగస్థలాన్ని రణరంగ స్థలంగా రూపొందించారట. దొరికిన నటకుల్ని

చీతగ్గొట్టడానికి నడుం కట్టారట. సహదేవుడు దేవుడి సహాయంకోసం ప్రార్థిస్తూ, గలాటా దారుల వారినుండి శ్రీ నందుల లక్ష్మీ నారాయణ గారి సహాయంతో తప్పించుకునే సరికి తాతముత్తాతలు దిగొచ్చారట. మొత్తాని కెలాగో బయటపడి, ఆ నాడు రైల్వేలో పనిచేస్తున్న శ్రీ సిహెచ్. నారాయణరావు (హీరో) గారి పుణ్యమా అని బెజవాడ చేరుకోగలిగారు.

మరో రోజుని ఇదే విధంగా మాటల సందర్భంలో ఎవరో వీరిని అడిగారు. "మీరు రిహార్సల్సులో శ్రద్ధ మరీ ఎక్కువగా తీసుకుంటారేం మాష్టారూ" అని.

"దానికి నా ఒకానొక అనుభవమే కారణం శిష్యా" అన్నారు వీరు. ప్రశ్నకర్త తనను మేష్టారూ అని సంబోధించగానే, ఈయన అతనిని తన శిష్యకోటిలో జమ కట్టేయడం ఎంతైనా సమంజసంగా వుంది కదూ? కాని, తమిళ కంపెనీలలో వేరే ఆచారం వుంది. ఒకరు మరొకరిని చూడగానే, ఆప్యాయం ఒలకబోస్తూ కావిలించుకుని, "ఎన్న అణ్ణే సౌక్కియమా" అంటారు. దానికి మరొకరు "సౌక్కియం దాన్ అణ్ణే" అని సమాధాన మిస్తారు. వారిని వీరూ, వీరిని వారూ ఒకరి నొకరు 'అన్నా' అనేసుకుంటూ వుంటారు. అన్నట్టు మరి తమ్ముళ్ళేమైనట్టు? అందరూ పరస్పరం అన్నలే అయితే, తమ్ముడనే పదమే అసలు అనవసరమైపోతుంది" అని ఒకాయన ఆక్రోశించారట. కనుకనే, పెండ్యాల మేష్టారు, ఎదటివాడు తనని మేష్టారూ అని పిలవగానే "శిష్యా" అని సంబోధించారు చమత్కారంగా.

ఇంతకీ, ఎక్కువగా రిహార్సల్సులోనే జాగ్రత పడుతుండడానికి కారణం ఏమని సెలవిచ్చారంటే, ఒకనాడు ఒక ఆర్టిస్టు మొదటి రిహార్సలులోనే, హావభావాలన్నీ పసందుగా ప్రదర్శిస్తూ, తల యిటూ అటూ వూపుతో తాళం ఝుమాయించి వేసేస్తూ, ఇక వేరే రిహార్సలెందుకూ అనిపించేసేటంత అద్భుతంగా, పాడుతున్నట్లు అభినయిస్తూ ఏకసంతాగ్రాహి అంటే ఇతనే అన్నంతగా ఇంప్రెస్ చేసేసి, మేష్టార్ని ఇట్టే సంతృప్తి పరచాడట. తీరా టేకు తీసి వినేసరికి, తను చేసిన ట్యూను షేపే మారిపోయిందిట. "అప్పట్నుంచీ ఇలా చేయవలసి వచ్చింది నాకు," అన్నారు బుల్లి నవ్వు నవ్వుతూ. ఈ సంగతి విన్న శ్రోతలు కొద్దిగా నవ్వుకునేసరికి, "దీనికే ఇలా నవ్వుతున్నారు. మరి ఇది వినండి" అని చెప్ప సాగారు.

ఏదో కంపెనీలో రిహార్సలు చేస్తూండగా, ఒక జంటిల్ మేన్ కోటూ సూటూ, హేటూ బూటూ నీటుగా ధరించి, గోటుగా టిప్ టాప్‌గా రూములోకి ఎంటర్ అయాడట. ఆడిషన్ ఇవ్వడంకోసం వచ్చానని ఇంగ్లీషులోనే తెలియబరచాడట. మాష్టారు అతన్ని ఎంత శృతి పెట్టమన్నారూ అని మర్యాదగా అడిగారట. మంచి పోజొకటి పెట్టి కాలరూ అదీసద్దుకుని, "ఎంత శృతైనా పరవాలేదనుకోండి, అయినా కొంచెం వుండండి. పాడుకు చూచుకుని చెబుతాను" అని ఏదో రాగం లో లోపలే గొణుగుకుని, గొంతు సవరించుకుని, నాలుగు శృతి ఐతే ఎక్కువై, మూడైతే తక్కువౌతుందని భయపడ్డాడో ఏమో, మూడున్నర పెట్టేయండి



"భగవాన్ బాలాజీ" చిత్రం రికార్డింగ్ సందర్భంలో
మన్నాడే, దీపక్, పెండ్యాల

అని దర్జాగా దబాయించాట్ట. అతన్ని చిన్న బుచ్చడ మెందుకనే సదుద్దేశంతోనే నాగేశ్వరరావు గారు నాలుగో రీడూ, మూడో రీడూ రెండూ కలిపి ఒక్కసారిగానొక్కి, సగటు శృతి పట్టి, వినిపించారట. భయంకరంగా వుంటుందా ధ్వని. అది విని, అతను సిగ్గుపడి తెల్లపోయాట్ట. "తమ్ముడు గారూ! మూడున్నర శృతి అనేది వుండదు" అని అనుకంపతో అనునయిస్తూ, మెత్తగా నచ్చచెప్పి, "పోనీ రెండు శృతిలో పాడండి" అని రెండో రీడు నొక్కిపట్టుకున్నారట. శృతిలో చక్కగా చేరిందనుకుంటూనే, అతను ఆ శృతికి సరిగ్గా నిషాదాన్ని శృతి చేసుకుని పాట అందుకున్నాట్ట. పోనీ అని ఆయన అనిషాదంలోకే శృతి చేరుస్తూ, ఒకటిన్నర శృతి చూపించారుట. వెంటనే అతను తిరిగి ఆశృతికి నిషాదమైన ఒకటి శృతిలో, పాట పూర్తిగా పాడి మరీ వదిలాట్ట. "ఒక రకంగా చూస్తే, శృతిలో చేరకుండా పాట పూర్తిగా అలా చలనం లేకుండా పాడ గలగడం గూడా బ్రహ్మాండమైన సాధకమే, పెద్ద ఫీటే అననిపించింది నాకు" అన్నారు హాతో. మాకు నవ్వాగిందికాదు.

నాగేశ్వరరావు గార్ని డ్రామా సీమలోంచి చిత్రసీమలోకి లాక్కొచ్చిన ఘనత శ్రీ కడారు నాగభూషణరావుగారిది. వారి 'తల్లి ప్రేమ' 'సుమతి' చిత్రాల్లో

వీరు హార్మోనిష్టుగా కుదిరారు. కొన్నాళ్ళు గడిచిన పిదప, యింటికిపోయి, కొన్నాళ్ళు ముదినేపల్లి ఎక్సెల్షియర్ డ్రామెటిక్ ఎసోసియేషన్‌లో చేరారు. నేటి అన్నపూర్ణా సంస్థ అధినేత శ్రీ దుక్కిపాటి, నాటి ఈ డ్రామా సంస్థకు సెక్రటరీగారట. హీరో అక్కినేని కూడా అక్కడే పనిచేసేవారట. ఆ రోజుల్లో, ఈ నాగేశ్వరద్వయం నాలుగేళ్ళు కలిసి వున్నారట అక్కడ.

వీరు తిరిగి చిత్రరంగంలో అడుగు పెట్టి ప్రకాశరావుగారు దర్శకత్వం వహించిన స్వతంత్రా వారి "ద్రోహి"కి సంగీత దర్శకుడుగా ప్రప్రథమంగా పనిచేశారు. "ద్రోహి" అనగానే ఒక సంఘటన జ్ఞాపకాని కొచ్చింది.

శ్రీ పెండ్యాల బెజవాడలో వుంటూ వుండేటప్పుడు ఒక నటీ మణికి, నటనలోను, సంగీతంలోనూ తర్ఫీదు ఇచ్చేవారట.

ఒకరోజు సాయంత్రం, అయిదుగంటలకు వారిలా ఆమెచేత రిహార్సలు చేయిస్తూన్న సమయాన, ఆ గదిగుమ్మం వద్ద ఒక మెరుపు మెరిసిందట. నిజంగా మెరుపనుకునేరు సుమా! మెరుపులా చురుకైన పది పద్నాలుగేళ్ళ బాలిక అని నా అభిప్రాయం. రావడంతోనే "ఎవరండీ ఇక్కడ హార్మోనీమేష్టారు. నాగేశ్వరరావుగారట. వారివద్ద నేను సంగీతం నేర్చుకోవాలి." అని ధీమాగా అడిగిందిట. ఆమె ధైర్యానికీ ఆవేశానికీ ఆశ్చర్యపడి మేష్టారు 'నేనేనమ్మా' అని చెప్పి మర్నాటి నుంచే పాఠం ప్రారంభించారట. సక్కుబాయి డ్రామాలో కృష్ణుడి పక్కన రాధవేషం వేయించారట. "ప్రేమనాథ అనురాగ: బంధమున" అని దేశితిలక్ రాగంలో పాట నేర్పించి పాడించారట. అంత చిన్న వేషమయినా, ఈ పాట చక్కగాపాడి, ప్రేక్షకుల ప్రశంసల నందుకుని, మార్కు కొట్టేసిందట, ఆఅమ్మాయి. మళ్ళీ ఈ అమ్మాయికే తను మునుముందు తన ప్రథమచిత్రం 'ద్రోహి'లో పాట నేర్పవలసివుంటుందని ఈయనా అనుకొని వుండరు. నేర్చుకోవలసి వుంటుందని ఆ అమ్మాయీ అనుకొని వుండదు. ఆమె మరెవరోకాదు. సాటిలేని మేటినటీమణి శ్రీమతి జి. వరలక్ష్మి.

సినిమాల పెండ్యాల

"ద్రోహి" చిత్రంతోనే పెండ్యాల పేరు మంచి సంగీత దర్శకుల జాబితాలోకి చేరుకుంది. క్రమంగా పేరుకుంది. ఘనీభవించి స్థిరపడింది. ఒక్కొక్క చిత్రానికొక్కొక్క తరహాసంగీతం అందిస్తూ, చక్కని చిక్కని చల్లని వెన్నెలలో, స్వసంగీతసరోవరంలో, రసికుల మానసహంసలను హాయిగా విహరింపచేస్తూ, తన కీర్తి కిరీటంలో చిత్రానికొక వజ్రం చొప్పున చేర్చుకుంటూ పోతున్నారు.

ద్రోహి, దీక్ష, దొంగరాముడు, ముద్దుబిడ్డ, అక్కచెల్లెళ్ళు, ఎం. ఎల్. ఎ, భట్టివిక్రమార్క, భాగ్యరేఖ, వాగ్దానం, వెంకటేశ్వరమహాత్మ్యం, వెలుగు నీడలు, కాళిదాసు, తిమ్మరుసు, శ్రీ కృష్ణార్జున యుద్ధం, జగదేకవీరునికథ, పరువుప్రతిష్ఠ, అత్తా ఒకింటి కోడలే, నిత్యకళ్యాణం పచ్చతోరణం, బావామరదళ్ళు, భక్తశబరి, జయభేరి, శ్రీకృష్ణగారడి, కృష్ణప్రేమ, ఈడూజోడూ, అనురాగం, ఆదిగాగల అనేక చిత్రాలకు వీరు సర్వజనరంజకమైన సంగీతం సమకూర్చారు. ప్రజాహృదయాలను చూరగొన్నారు. ఈ పైవాటిలో, అధోరేఖాంకితాలైన (అండర్‌లైన్డు) చిత్రాలలో పాడేఅవకాశమే నాకు లభించింది. వీరి వద్ద నేను పాడినపాటల్లో గాత్రగాంభీర్యంలో గగ్గయ్య గార్ని మరిపించిన శ్రీ జగ్గయ్యగారికి పాడిన "రమ్మంటే వచ్చారు అమ్మాయిగారు" "హైలా హైలా పచ్చీసు"; చలానికి ఈడూ జోడూలో పాడిన "సూర్యునిచుట్టు తిరుగుతుంది భూగోళం" "పంచరు పంచరు" చలానికే 'నిత్యకళ్యాణం పచ్చతోరణం' లోనూ 'అనురాగం' లోనూ పాడిన 'ఎవరికివారే యమునాతీరే', 'అసలు నీవు రానేల, 'ఖుషీఖుషీగ నాతో రావే' రామకృష్ణకుపాడిన 'నీమదిపాడెను ఏమని' శబరిలో నాగయ్యగారికి పాడిన "రానైయున్నాడు' "ఏమి రామకథ"; "బావామరదళ్ళ"లో నేనూ జమునా రాణీ పాడిన "గంగమ్మతల్లి కరుణించెరా" శ్రీ కృష్ణ గారడిలో నారదుడికిపాడిన "ఎంత ఘనుడవయ్యా యదునందనా ఆనందమోహనా" బహుశా రాయడం మరిచిపోయినవి మరి కొన్ని, మంచి పాప్యులర్ హిట్స్ ఐనాయి.

ప్రతిభావంతులైన ప్రతిభాశాస్త్రి గారి అధ్వర్యంలో తయారైన "జయభేరి"లో మంచి ఎక్స్పెరిమెంటొకటిచేసిసక్సెడయారు. జయభేరి మ్రోయించారు. విజయానంద మహారాజుని మెప్పించ గలిగేలాగ హీరో శ్రీ ఎ. ఎన్. ఆర్ పాడవలసిన సందర్భంలో పాట బాగా రక్తి కట్టేటట్టు చేయాలనే సంకల్పంతో, ఏవేవో వూహాలల్లుకుని, కొసకి, ఆరోహణంలో ఒక రాగచ్ఛాయ, అవరోహణంలో మరో రాగచ్ఛాయ కలిపి, నూతనరాగ నిర్మాణంకోసం, కృషిచేసి, కృతకృత్యులయ్యారు. ఈ రాగానికి, అనురాగంతో, శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి గారు "విజయానంద చంద్రిక" అని నామకరణం చేశారట. ఉత్తరాది రాగాలైన భైరవ్, బహార్‌లకి ప్రతిబింబాలనదగిన, చక్రవాక, కానడరాగాల సముచిత సమాగమ సంజనిత మీ "విజయానంద చంద్రిక".

"జగదేకవీరుని కథ"లో జగదేక వీరులైన హీరో శ్రీ ఎన్. టి. ఆర్. ఏక కాలంలో, వివిధ వాద్యాలను వాయిస్తూ జగన్మోహనంగా, గీత మాలపించవలసిన ఘట్టానికి ఘనమైన మట్టు కట్టవలసివచ్చిందిట. దర్శకులు శ్రీ కె. వి. రెడ్డిగారు పెండ్యాలతో "ఈ ఘట్టంలో నాయకుని గానానికి శిల కరిగిపోవలసివుంది. మీరెలా కరిగిస్తారో మరి. మీ చేతిలోనేవుంది ఈ సన్నివేశం

మద్య తరగతి

మద్య ప్రదేశ్ రాజధానిలో ఇద్దరు మిత్రులు కలిసి ఒక సీసా ఖాళీ చేశాక—

ఒకడు: "నాకు గొంతిక మండి పోతోందోయ్."

మరొకడు: "ఏదీ, కాస్త నోరు తెరు. సిగరెట్టు వెలిగించుకుంటా."

రక్తికట్టే బాధ్యత!" అన్నారట. ఈ బాధ్యత ఎలా నిర్వహించడమా అని. అహర్నిశలూ ఆలోచించి. ఆలోచించి. నాగేశ్వరరావు గారి మస్తిష్కం శుష్కించి శోయేటంత పనైందిట. పాటని ఏవేవో రాగాలలో అని చూచుకుని. చివరికి. దర్బారీ కానడ. ఘూర్జరీతోడి. శంకరా రాగాల నేరుకున్నారుట. ఈ మూడింటిలో కే. వీ. గారికి మొదటిదే నచ్చిందిట. అదే రాగంలో. రాగాలాపనా. స్వర ప్రస్తారం. పల్లవి. అనుపల్లవి. చరణం. నెరవు. తానం, ఇత్యాది లక్షణ లక్షితమైన "శివ శంకరీ" పాట రూపొంది. శిలలు ద్రవించేలా తయారైంది.

వీరు కర్నాటక. హిందూస్తానీ సంప్రదాయాలను రెండింటినీ అభిమానిస్తారు. వాటిని సమపాళంలో మేళవించి సమయసందర్భాలననుసరించి. కర్ణపేయమైన స్వర్ణమయ స్వరార్ణవం ప్రవహింపచేస్తున్నారు. అందం కోసం. అన్యస్వరాలను అప్పు డప్పుడు వాడే అలవాటున్నా. సన్నివేశం శుద్ధశాస్త్రీయ సంగీతాన్నే కోరినప్పుడల్లా. రాగాలను యథాతథంగా సంకర రహితంగా ప్రయోగించడాన్నే సమర్థిస్తారు. వీరి గేయాలలో వినిపించే రకరకాల రాగాలలో ముఖ్యమైనవి కొన్ని : భీంపలాస్, పీలూ, కళ్యాణి. సింధుభైరవి, రీతి గౌళ, జయ జయవంతి, దర్బారీ కానడ, మాల్కోస్. పట్‌దీప్ వగైరాలు. జానపద సంగీతాని క్కూడా తగిన ప్రాధాన్యమిస్తారు. "నీ ఆస అడియాస" "కొమ్ములుతిరిగిన మగవారు", కన్నెపిల్ల సొగసు చూడ", "గంగమ్మ తల్లి కరుణించెరా" వంటి వీకోవకు చెందినవే.

ద్రోహిలో "మనోవాంఛలు", "పూవు చేరి పలుమారు తిరుగుచూ" అనే జి. వి. లక్ష్మి గారు జి. వి. రావు గారు (నేటి ఘంటసాల) ల పాటలూ, లక్ష్మిరాజ్యం గారికి జమునారాణి గారు పాడిన పాటలూ, "యిదియేనా నీ న్యాయమూ" అని యమ్. ఎస్. రామారావు గారు పాడినదీ, అన్నిటికన్నీ ఆంధ్రదేశంలో మారుమ్రోగాయి. 'దీక్ష'లో మాష్టరు వేణు పాడిన "ఏమౌతుందో" ఎనలేనిది. 'కన్నతల్లి'లో ఘంటసాల గీతం "ఎంతమంచిదానవో యమ్మా" చారుకేశిరాగంలో చిరకాలం జీవిస్తుంది. "దొంగ రాముడు"లో 'చిగురాకులలో చిలకమ్మా' 'అనురాగము విరిసేనా' రెండూ రెండు నిండు జ్యోతుల్లా సదా వెలుగుతూ వుంటాయి. 'బావా మరదళ్ళు'లో 'పయనించే మన వలపుల బంగారునావ" మన్ని కూడా తనలో శయనించి పయనింపచేస్తుంది. అదే చిత్రంలో "నీలి మేఘాలలో" తేలించే ఘంటసాల, గానకీగార్ల(సారీజానకి) గానం సుధారసపానం.

"భాగ్యరేఖ"లో "నీసిగ్గే సింగారమే" రాజాగారు పాడినదీ, 'నీవుండే దాకొండపై' సుశీలగారు పాడినదీ, రెండూ ఒకే కొమ్మ (ట్యూను) ను పూచిన రెండు బంగారు పూవులు. శ్రీనివాస్సుశీలల "సుధామధురమూ, కళాలలితమూ" (కృ ష్ణ ప్రే మ). "నీమదిపాడెను ఏమని" (నిత్యకల్యాణం పచ్చతోరణం). ఏమి రామకథ అండ్ రామన్యాయమూ (శబరి). వగైరా గీతాలు అమృతోపేతాలు. "జయభేరి"లో "మది శారదాదేవి మందిరమే" (ఘం ట సా లా నేనూ పాణిగ్రాహీ పాడినది) మరువరానిది. "వెంకటేశ్వరమహాత్మ్యం" లో వెంకటేశ్వరావుగారిచేతా, దాని తమిళవెర్షన్ అయిన "శ్రీనివాస కళ్యాణం"లో శ్రీనివాస్‌చేతా,

సమంజసంగా పాడించడం వీరి ప్రత్యేకత. ఈ చిత్రంలో "క ల గా కమ్మనికలగా" భీంప్లాస్‌లో ఏ క్లాస్‌గా చేశారు. "శేషశైలవాసా శ్రీ వెంకటేశ" అని రీతి గౌళలో చక్కని రీతిని. తిరుమలేశుని ప్రీతితో కొనియాడారు. శ్రీ ఘంటసాల. తన పాటకు తానే ఓష్ఠచాలనము (lip movement) గావిస్తూ, బాలాజీ భక్తకోటిలో ఒకరుగా అద్భుతంగా అభినయిస్తూ మైమరచి ఆలపించి. ఆలకించిన మనల్ని మైమరపించారు. "మహామంత్రి తిమ్మరుసు"లో "శివరంజని" రాగంలో "చరిత్ర ఎరుగని మహాపాతకం" గీతం, శ్రీమతి పి. లీలగారు అవలీలగా, అద్భుతంగా. ఒడలు గగుర్పొడిచే విధాన ఆలపించారు. కామెడీ సాంగ్సులోకూడా వీరు సిద్ధహస్తులే. "అనురాగం"లో "షోకైన ఎద్దు"పాట విన్నవారు పొట్టచెక్కలయ్యేట్టు నవ్వవలసిందే. హాస్య (గీత) చక్రవర్తు లనదగిన పిఠాపురం, మాధవపెద్ది జంట ఈ పాటకి ప్రాణంపోసింది.

"నీదయరాదా ఈదాసిపైన", "ఏమి రామకథ", ద్విజయవంతిలోను;"నీకై వేచితినయ్యా" "ప్రభుగిరిధారీ" పీలూలోనూ "చూడాలని వుంది", మిశ్రశ్రీరాగం లోనూ; "కలకానిదీ, విలువైనదీ" కంభావతిలోనూ, "ఎందుకు వేసిన వేషమయా" అమీరుకళ్యాణిలోనూ; "అలిగితివా సఖీప్రియా" భాగేశ్వరిలోనూ; "జయవాణీ చరణ కమల" "మాల్కోస్ లోనూ," నా మనసెంతో నాజూకు" హిందూస్థానీ భైరవిలోనూ; "నిన్ను జూచు నందాక" "ఎంత ఘనుడవయ్యా" కానడలోను; "అనరాదా శ్రీరామయనీ" కేదారాది రాగ మాలికలోనూ. ఇలా ఎన్నో పాటలు ఎన్నో రాగాలలో రచిస్తూ, రసికుల్ని రంజింప జేస్తున్నారు. ఆనంద భైరవిలో హాస్యగీతం అందించడం అరుదైనవిషయం. బి. గోపాలం. స్వర్ణలతల యుగళ గీతం "అం చె లం చె లు" ఈ రాగంలోనే తయారైంది.

"భక్తశబరి"లో రానైయున్నాడు. రాగమాలికలో (ఆనందభైరవి. కేదార. నాటకురంజి) నాగయ్య గారి గాత్రాని కనువుగా కుదిర్చారు. నేను పాడేటప్పుడు నాగయ్య గార్ని మనసులో పెట్టుకుని మరీ పాడానీపాట. నాగయ్య గారికే స్వంతమైన సంగతులూ. వూపులూ కొన్ని వున్నాయి. చిన్నప్పుడే (కాలేజీలో), స్వర్గసీమలోని "హాయి సఖీ" చెంచులక్ష్మిలోని "నీదే భారముగాదా," దేవా "ధన్యుడరా నే నరసింహా" మొదలైన పాటలు, నాగయ్య గార్ని అనుకరిస్తూ నేను పాడినప్పుడల్లా, మా కాలేజీ మేట్సంతా నన్ను చూడక ముందు, నాగయ్య గారే పాడుతున్నారనుకునేవారట. నాతో చెప్పేవారు. "అనరాదా శ్రీరామయనీ" అనే ఈ పాట నాగయ్య ఎలా పాడతారో వూహించుకుని. ఎక్కడెక్కడ ఎలాటి వూపులిస్తారో, అక్క

పమిట: సినిమాతారలు కొద్దిగా జారవిడవడానికి వేసుకొనేది.

దువ్వెన : కొందరు యువకులు జుట్టు అందంగా చెరుపుకోడానికి ఉపయోగించేది.

దక్కడ నేనూ ఇచ్చుకుంటూ పోయాను. సినీమాలో నాగయ్య. నే నెక్క డెక్కడ ఎలా వూగుతూ పాడతారనుకున్నానో, తుచ తప్పకుండా అలాగే అభినయించారు. నాగేశ్వర్రావు గారి గురించి రాస్తూ, నాగయ్య గారి గురించి రాయడం న్యాయమే గాని, నా గురించి రాసుకోడం. నాకూ నచ్చలేదను కోండి. అయినా, మాటవరసకి మెన్షన్ చేశానంతే. నాగేశ్వరరావు,, నాగయ్య. నా గురించి, అనే ఈ మూడు పదాలలోనూ నాగశబ్దముందిగా కామన్‌గా. అందుచేత నా గురించి రాసినా రగడ లేదులేండి.

"శబరి"కి, "నిన్నుజూచునందాక" రికార్డింగు జరుగుతున్నరోజున, సుశీలగారు, ఆ రోజున తన శారీరం సరిగాలేదని అనుకుని, ఆవేళవద్దనీ, మరోరోజున పాడతాననీ అన్నారు. కాని పెండ్యాలగారూ పాలగుమ్మి పద్మరాజుగారూచేరి, ఇప్పుడున్న వాయిస్ శబరి కారెక్టర్‌కి చాలా చక్కగా సూటవుతుందని ఆమెచే ఆ రోజునే రికార్డు చేయించారు. ఆవిడకూడా "హస్కీ"గా. ముసలి భక్తురాల్ని మనసులో వుంచుకుని. మంచి ఫీలింగుతో పాడారాపాట. దాని ఫలితం రసికులందరికీ తెలిసినదే. శబరే పాడుతోందా అనిపించిందందరికీ. ఇలా ప్రతికూల పరిస్థితుల్ని కూడా తమ కనుకూలంగా తిప్పుకోగలిగే ప్రతిభ వీరిలో వుంది.

"వెంకటేశ్వర మహాత్మ్యం" హిందీ అనువాదమైన "భగవాన్ బాలాజీ" ద్వారా ఇదివరకే హిందీరంగంలో పదార్పణం చేశారు. ప్రస్తుతం, "చక్రవర్తి విక్రమాదిత్య" (హిందీ)లో దీపక్ సాహిత్యానికి సంగీతం జతచేర్చారు. ఈ చిత్రంలో శ్రీ కాంతారావుగారికి నేనుకూడా పాడాను ఈమధ్య. హిందీచిత్ర సంగీత దర్శకులలో వీరి ప్రీతిపాత్రులు బర్మన్, నౌషాద్‌లు.

వెండితెరవెనకనే వుండిపోకుండా వీరు వెండి తెరపై కూడా కొన్ని చిత్రాల్లో, చిన్నపాత్రల్లో, ప్రేక్షకుల దృష్టి నాకర్షించారు. "దీక్ష"లో పనిపాటాలేక గప్పాలు కొట్టే, గాస్ మాష్టరైన పల్లెటూరి రైతులుగా, మిక్కిలినేనితో కలిసి నటించారు. "కన్నతల్లి" లో కూడా రైతు పాత్రే కాని తంపులమారి స్వభావంగల వేషం. "మొదటి రాత్రి"లో ఆయుర్వేదం, అల్లోపతీలు రెండూ కలిపి వైద్యం చేసే నాటు డాక్టరు. పెంకి పెళ్ళాంలో భావకవి. ఫ్రెంచికటింగు మీసంతో విలసిల్లుతూ, గ్లాస్గోదో సిల్కుదో జుబ్బా తొడిగి, సన్నైన తెల్లని పంచ ధరించి, నిత్యజీవితంలో కూడా భావకవి రూపంలోనే దర్శన మిస్తూ వుంటారు వీరు తరుచుగా. నటనాశక్తి భావయుక్తంగా సంగీతం సమకూర్చడానికి, కొంత సహకరిస్తుందనిపిస్తుంది.

వీరి "తిమ్మరుసూ" "కాళిదాసూ" ప్రభుత్వ రజత పతకాల నందుకున్నారు. అనేక పత్రికల బాలట్‌ల ద్వారా ఉత్తమ దర్శకులుగా ఎన్నుకోబడ్డారు శ్రీ పెండ్యాల. ఇలాటి గౌరవాలూ, సన్మానాలూ, ఇంకా ఎన్ని కాచుక్కూచున్నాయో వీరి కోసం. □



మానసోల్లాసమ్

వి.ఎ.కె. రంగారావు

ప్రియా!

నీవు నాకు కావాలి. నీవు నీవుగానే కావాలి.

నీ గమనంలో హంసయానం నాకొద్దు. నీ పెదాలపై పులుముకొన్న కెంజాయవర్ణం నాకు అవసరంలేదు. మునిమాపువేళ వేసుకొన్న తమలపాకుల చాయవుంటే చాలు. నీ నడకలో నన్ను చేరాలనే తొందరపాటు వుంటే చాలు.

నీ కందోయి, నీ పలువరస దివ్య జ్యోతులు వెలగనక్కరలేదు, ముత్యాల కాంతులు క్రమ్మింగనక్కర లేదు. నాపై కోరికను రుజువు చేస్తే చాలు.

నీ కేశాలు నింగినీలిమను బోలనువద్దు, నేలనుండనూవద్దు. తొందరపాటు కలిగించే ఆ క్షణంలో చేతికందితే చాలు.

నీ పలుకుల్లో తేనెలూ, సోనలూ, గుదిగుచ్చిన సుందర పదజాలాలూ నాకు వద్దనే వద్దు. అవ్యక్తంగా, అర్థం లేకుండా 'దగ్గరకు ర'మ్మని పదేపదే చెవిలో వేడిగా నిట్టూర్చితే చాలు,

నీచేతిగోళ్ళకు రంగు వుండొద్దు.

క్రౌర్యం వుండాలి.

నీ చేతకు అర్థంవద్దు. ఆవేశం వుండాలి.

నీకు కారణంవద్దు. నీవే కారణమవాలి.

నేను నీకుకాకపోయినా. నీవునాకుకావాలి.

ప్రేయసీ!

ఏ పుస్తకంలోనో, యే సినిమాలోనో, చదివిన, విన్న ఛలోక్తులు నాకు చెప్పవద్దు. నీవు నీకై తెలుసుకున్న ఒక సాధారణ సత్యాన్ని చెప్పు.

ఎవరో, యెక్కడో, యెప్పుడో అనుభవించిన ఆనందాన్ని గురించి నీవు నాకు చెప్పడమెందుకు? నీ కన్నీరుతో తేలిక పడిన ఒక విషాదఘట్టం వినిపించు. ఆ బాధను పంచుకోలేక పోయినా మనసులో ఉంచుకుంటాను.

ఏ అనామకుడో ప్రాణాలు తెగించి సాధించిన అమూల్య రత్నాన్ని వేనకువేలు పోసికొని నాకివ్వకు. స్వేచ్ఛా విహంగం లాగా యే నదివొడ్డునో తిరుగాడుతున్నపుడు త్రుటికాలం నీ కంటిని తన క్షణిక దీప్తితో ఆకర్షించిన ఒక గులకరాయి, దాన్ని నాకియ్. పదిలంగా దాచుకుంటాను.

నీలో వాత్సల్యానుభూతులు కలిగించిన వారిగురించి నాతో మాట్లాడు. వారిని ద్వేషించను. నీకు అంతగా ఆనందాన్ని యిచ్చారే అని వారిని లోలోన గౌరవిస్తాను. అంతేగాని నావలన నీకు కలిగిన ఆనందం గురించి యితరులకు చెప్పకు. నాతోనూ అనకు.

తెచ్చిపెట్టుకున్న సిగ్గులు నాదగ్గర ఒలకబొయ్యకు. ఆ ఉత్సవం నాటిరాత్రి ఒక మూడు మాటలు నాతో అప్రయత్నంగా అని, యిన్ని సంవత్సరాలుగా ఆమాట నీవిదే మొదటిసారి అనటం అని నేనంటే దిగ్గుమని సిగ్గు పడ్డావే, అటువంటి సిగ్గుతో నన్ను మళ్ళీ మళ్ళీ మురిపించు.

నేను ప్రేమించాననుకున్న వారిని నీవు ప్రేమించవద్దు, ఆ బంధాన్ని నేను పంచుకోలేను. ఆప్రేమ సంగతి నీకు తెలిసీ తెలియనట్లుగా వుండు. ఏదో ఒక వేళలో, నీతో వున్నపుడు, నీలో వున్నపుడు అనుకోకుండా ఆపేరు, యుగాలుగా భూగర్భంలో నున్న జలలాగా పెల్లుబికి బయల్పడుతుంది. విను, కాని ఆశ్చర్యం నటించకు. నిండు హృదయంతో నవ్వు. మరికొంచెం దగ్గరికి వచ్చి, "నేనూ, తను కాదు." అని మందలింపుగా అను. అక్షణంలో నువ్వైవెంత దగ్గిరమరెవ్వరు కారని, కాలేరని గ్రహించు. అబ్బే, కాదని నేను చెప్పే కుంటిసాకు నీ పెదాలలోనే ఆపివేయి.

ప్రేమికా !

నాలో అందాన్ని చూసి నా వద్దకు రాకు నాలో అందాన్ని అన్వేషిస్తున్నావా ! నాలో ఆనందాన్నిచ్చే శక్తినీ, ఉపాయాన్నీ ఊహిస్తూ, అనుభవించినదాన్ని గుర్తుచేసుకుంటూ, రా !

నిన్ను ప్రేమిస్తున్నానని చెప్పుతూ, నన్ను ప్రేమించమని అడుగుతూ వెగటు కలిగించకు. అది ప్రేమకాదు. అసహ్యం, జుగుప్స కలిగించే అధికార ప్రకోపం. సహృదయంతో, సద్భావంతో నన్ను సహించు.

నామంచితనాన్ని గురించి వెర్రి కలలు కనవద్దు. నా మనిషి తనాన్ని అర్థం చేసుకో.

నన్ను ఈ సమాజపు కుహనా సంస్కారాల కటకటాల్లో పెట్టి బంధించకు. నా స్వేచ్ఛా విహారానికి మరింత దోహదం చెయ్యి.

నీలాటివారు నాకింతకు పూర్వంవున్నారు. ఇకముందూ వుంటారు. అది తెలుసుకొని మసలుకో.

నా విశ్రాంతి వేళల్లో శాంతి, చీకటి సమయాల్లో కాంతి, ఔత్సాహిక క్షణాల్లో ఉద్వేగం, ప్రేమకు తగిన వేళల్లో అనురాగం యివ్వటానికి ప్రయత్నించు.

అప్పటికికూడ నిన్ను ప్రేమిస్తానని మాటివ్వలేను. బహుశః ఎప్పటికీ ప్రేమించలేనేమో ! కాని, నాహృదయాధి దేవతగా ఆరాధిస్తాను, ఆ వల్లకృష్ణుని తరువాత రెండవ పూజ నీకే చేస్తాను, నీతోనే వుంటాను. నీవై పోతాను,

అందుకే

నీ వెంత దూరాన్నున్నా,

ఆ క్షణంలో

ఈ ఆనందంతో అనుభవించిన

ఆ ఆనందాన్ని మరువలేవు.

ఆ అనుభూతిని నీ జీవన భాగస్వామివై, అర్థాంగమైవున్న వ్యక్తికూడ యివ్వలేదు. ఆ నాటి హాయిని, మరచిన గొలుసును చూచి మళ్ళీ వస్తాననుకున్నావే, ఆరేయి హాయిని నాతో తప్ప నీ వెవ్వరితోను పంచుకోలేవు.

అదీ నా అదృష్టం.

ఆ అదృష్టమే నా గర్వానికి కారణం.

ఏం ! ఒప్పుకుంటావా ? □□□

చైత్రయాత్ర


బొబ్బిలి యుద్ధం

భారీ (కళాసంపత్తిలోను, స్తోమతలోను, పేరు ప్రతిష్ఠలలోను) తారాగణంతో రిపబ్లిక్ సీతారాం తయారుచేస్తున్న "బొబ్బిలియుద్ధం" జయప్రదంగా కొనసాగుతున్నది, రామారావు, భానుమతి, రంగారావు, జమున, బాలయ్య, సురభిబాలసరస్వతి, ధూళిపాళ, జూనియర్ శ్రీరంజని, రాజనాల, ముక్కామల, పద్మనాభం, నర్తకీమణులు స్వర్ణ, గీతాంజలిలతోబాటు నిర్మాత, దర్శకుడు అయిన సీతారాం వెంగళ్రావు పాత్ర ధరిస్తున్నారు.

సంగీత రాజేశ్వరరావు సంగీతం నిర్వహిస్తున్నారు. పాటల రచన ఆరుద్ర, కొసరాజు, సి. నారాయణరెడ్డి, శ్రీశ్రీ. పాటలన్నీ విన్నాను. శ్రీ శ్రీ వ్రాసిన "నిను జేర మనసాయె" అన్న జావళి అతిమధురంగా మంజీర రవళిలా ఉన్నది. శ్రీ శ్రీ ఈ పాట వ్రాశారంటే ఆశ్చర్యం కలిగింది. వారు వ్రాయగలిగారా అని కాదు. అటువంటి పాటకు నిర్మాతలు శ్రీ శ్రీ ని రప్పించారే అని. నిర్మాతలకు పరిపాటేగదా, శృంగార గీతం అయితే నారాయణరెడ్డినో, దాశరథినో, సంఘంపై విసుర్లయితే కొసరాజునీ, ప్రబోధాత్మకమైతే శ్రీ శ్రీ ని, చమత్కారంతాలు గల సరదా పాటయితే ఆరుద్రనీ, ఈ విభాగాల కందని పాటకైతే మల్లాదినీ, సముద్రాలనీ పిలిపించడం ! అంతమాత్రాన

[118 వ పేజీ చూడండి, సార్]

''బొబ్బిలియుద్ధం'' లో జమున, సీతారాం.







దాచాలంటే దాగదులే
దాగుడు మూతలు సాగవులే
వలపుల సంకెల బిగిసేదాకా
వదలను వదలను వదలనులే

నీ సన్నని మీసంలో విలాసం వన్నెలు చిలికింది
నీ నున్నని బుగ్గలపై పున్నమి వెన్నెల మెరిసింది
నీ ఓర చూపులను గని — బంగారు తూపులనుకొని
మురిసిపోతానూ — పరవశించేనూ

రవీంద్ర ఆర్టువారి "లక్షాధికారి" లో


సుశీల పాడిన సుందర గీతం

గీత రచన : సి. నారాయణరెడ్డి

సంగీత రచన : టి. చలపతిరావు







నీ కన్నులు రమ్మని పిలిచేదాకా
కదలను కదలను కదలనులే
పొదలలోన వున్నా పూలగంధాలు దాగలేవు
మట్టిలోన వున్నా మణుల అందాలు మాసిపోవు

నీలోని రూపమును గని — రతనాల దీపమునుకొని
మదిని నిలిపేనూ — జగము మరిచేను
నీ పెదవుల నవ్వులు విరిసేదాకా
విడువను విడువను విడువనులే





[113 వ పేజీ తరువాయి]

కొసరాజు ప్రేమగీతం వ్రాయనట్టా? "ఎంత మంచి వాడవురా" (నమ్మిన బంటు). యేమయ్యింది? సి. నారాయణరెడ్డి నిర్వేద గీతాలు వ్రాయలేదా? "నే నొంటరినై పోయాను, ఇక యింటికి యేమనిపోను" (గులేబకావళి కథ). దాశరథి వ్రాసినవన్నీ ప్రేమగీతాలేనా? అయితే "శిలలపై శిల్పాలు చెక్కినారు" (మంచి మనసులు) యేమిటి? మల్లాది సరదా పాటలూ వ్రాశారు. "గొప్ప గొప్పోళ్ళ యిళ్ళలో లడాయి బడాయి" (చిన్నకోడలు) చక్కటి ఉదాహరణ. వీరందరు అన్నిరకాల పాటలూ వ్రాశారు, వ్రాయగలరు. కాని కొందరు నిర్మాతలు వీరికి ఫలానా పాటల రచయిత అని ముద్ర వేశారు. మరొక రకం పాటలకు పిలిపించక తమకు తామే అన్యాయం చేసుకుంటున్నారు. ఆ ఊబిలో సీతారాం దిగబడనందుకు సంతోషం.



ఇక జావళీగురించి. పాడింది సుశీల. నృత్యకల్పన చేసినది వెంపటి సత్యం. నృత్యం చేసింది ఎల్. విజయలక్ష్మి. ఈ చిత్రంలో మరొక అందమైన సంగీత సన్నివేశం శ్రీనాధుని పద్యమూ, శ్రీ శ్రీ గీతమూ, వినిపించే సుభద్రా, వెంగళ్రావుల ప్రేమకలాపం. రచన, వరుస రెండూ చక్కగా అమరాయి. భానుమతి పాడిన "శ్రీకర కరుణాలవాల" మరొక మణిపూస.

ఈ చిత్రం జనవరి 26 న విడుదలచేయాలనే సంకల్పం వుందని సీతారాం అన్నారు.

బాలయ్య

బాలయ్య పై చిత్రంలో ధర్మారాయుని పాత్ర ధరించడమే కాక మరి రెండు చిత్రాలలో ప్రముఖ పాత్రలు నిర్వహిస్తున్నారు. నాయక వేషం వేస్తున్నది కనకమేడల "సుజాతచిత్ర" పతాకలో నిర్మిస్తున్న ఒక సాహసోపేత గాథలో. పేరింకా పెట్టలేదు. మొట్టమొదటి షూటింగ్ కార్యక్రమం ఈ మధ్యనే మొదలయింది. రాజనాల, మిక్కిలినేని, హేమలత పాల్గొన్నారు.

ఏనాడో సూర్యకుమారి పాడిన జాతీయ గీతం "మాతెలుగు తల్లికీ మల్లెపూదండా," గుర్తుందా? అది వ్రాసిన సుందరాచారి పై చిత్రానికి మరొక పాట వ్రాశారు. రెండవ పాట వ్రాసింది కనకమేడల. ఈ రెండుపాటలు స్వరపరచినది బి. గోపాలం. పాడినవారు సుశీల, మాధవపెద్ది.

బాలయ్య ధరించిన వేషం, సోమయ్య ఊహించినది, బాగా వున్నది. సెట్టుకూడా భారీయైనదే.

బాలయ్య మూడవ చిత్రం తాజుద్దీన్ బాదా వారి "గుణశీలుని కథ" ఇందులో నాయ



"మూగమనసులు" లో మధురసన్నివేశం

కుడు కాంతారావు. రేలంగి, గిరిజ, నాగయ్య, కృష్ణకుమారి, ఎల్. విజయలక్ష్మి కూడా ఉన్నారు. సంగీతం: ఎస్. రాజేశ్వరరావు. హైద్రాబాదులో సారథీ చిత్రాలన్నిటికీ మేకప్ నిర్వహించిన పోతరాజు ఈచిత్రానికి పనిచేస్తున్నారు.

"కాశీమహాత్మ్యం", ఇటీవలనే మొదలైన మరొక చిత్రంలోకూడా బాలయ్య ఉండవచ్చునని వార్తలు.

లక్షాధికారి

రామారావు, కృష్ణకుమారి ప్రధానభూమికలు ధరించిన రవీంద్రార్ట్ వారి "లక్షాధికారి" సంగీత దర్శకుడు టి. చలపతిరావు. "పునర్జన్మ" లో సంగీతానికి దీనికీ యే మాత్రం పోలికేలేకుండా, ప్రజామోదమే ప్రథమ లక్ష్యంగా అంచే ప్రధానోద్దేశంగా తయారు చేశారు. వారి ఉద్దేశం నెరవేరగలదు. ఒక పాట రషెస్ వేసుకుంటున్నపుడు వినటం తటస్థించింది. ఆ పాటకు కారకులు జమునారాణి, ఘంటసాల, మాధవపెద్ది, కొసరాజు, చలపతిరావు. "అద్దాలమేడవుంది– అందాల భామవుంది,– మత్తైనమందువుంది – మనసైతే రమ్మంది" ఇందులో యెంత మత్తున్నదంటే, విన్ననాటి మధ్యాహ్నమంతా అలా తల తిరుగుతూనే ఉంది.

ఈచిత్రంలో తక్కినపాటలు వ్రాసింది కొసరాజు, ఆరుద్ర, సి. నారాయణరెడ్డి. సి. నాగేశ్వరరావు ఛాయ ఆహ్లాదకరమనీ. వి. మధుసూదనరావు దర్శకత్వం అతినవ్యమనీ నమ్మదగ్గ వార్తలు.

గుడి గంటలు

వి. మధుసూదనరావు దర్శకత్వం నెరపుతున్న మరొక చిత్రం రాజలక్ష్మీవారి "గుడి గంటలు". తమిళంలో విజయఢంకా మ్రోగించిన "ఆలయమణి" యీ చిత్రానికి ఆధారం. రచన ముళ్ళపూడి వెంకటరమణ. నార్ల చిరంజీవి, ఆత్రేయ, ఆరుద్ర యింతవరకు ఒక్కొక్క పాట వ్రాశారు. జానకి, ఘంటసాల పాడారు. సంగీతం ఘంటసాలదే. రాఘారావు, కృష్ణకుమారి, జగ్గయ్య, రేలంగి, గిరిజ, వాసంతి మొదలైనవారు తారాగణంలో ముఖ్యులు.

ఈ చిత్రం షూటింగ్ సెప్టెంబరు మొదటి తేదీన బ్రహ్మాండమైన సెట్టులో (కృష్ణారావు) మొదలైనది. పన్నెండు రోజుల పనిలో దాదాపు నాలుగురీళ్ళు సిద్ధమైనవి. పైన చెప్పినవారందరితోబాటు ...లినేని, శాంతకుమారి, రమణారెడ్డి ఈ షూటింగ్‌లో పాల్గొన్నారు.

సుందర్లాల్ నహతా, డూండీ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సంక్రాంతికి విడుదలవుతుందనీ, రాజలక్ష్మీవారి చిత్రం కనుక, దాన్ని సహజంగానే ధనలక్ష్మి వరిస్తుందని నమ్మకం.

సిరామచంద్ర

అద్వితీయ ప్రజ్ఞా ధురంధరుడు, సంగీత దర్శకుడు, నిర్మాత అయిన సి. రామచంద్ర సంగీత పరిమళం మరల త్వరలో మనల నలరించబోతున్నది. ఇప్పుడు రామచంద్ర మద్రాసులో తయారవుతున్న నాలుగు చిత్రాల్లకు సంగీత సౌరభాన్ని యిస్తున్నారు. మీనా పిక్చర్స్ వారి "బహూరాణి" (రాగిణీవారి "అర్థాంగి" కథ) త్వరలో విడుదలవబోతున్నది. చక్కని పాటలుగల రెండు రికార్డులు అప్పుడే విడుదల అయినవి (G E. 33570,33571). ఈ చిత్రంలో ప్రధానభూమికలు గురుదత్, మాలాసిన్హా నిర్వహిస్తున్నారు. దర్శకత్వం టి. ప్రకాశరావు. రషెస్ చూసిన ప్రత్యగాత్మ చాలచక్కగా వుందని అన్నారు.

సి. రామచంద్ర రెండవ, మూడవ చిత్రాలు రాఘవన్, కేశవన్ ప్రొడక్షన్స్‌వారి హిందీ, తమిళ చిత్రాలు. ఈ తమిళచిత్రంలో "స్వరల హరిదాసు" శ్రీనివాసు ఒక పాట పాడారు.

మరొక మద్రాసు హిందీ చిత్రం ఇ. వి. ఆర్. వారు "కొడుత్తు వైత్తవన్" ఆధారంగా తీయబోయేది. దీనికి సాహిర్ పాటలు వ్రాస్తారు.

స్వంతంగా మరాఠీలో "ఛఫాయిచే పూలే" అన్న చరిత్రాత్మక చిత్రాన్ని మధుకర్ పథక్ దర్శకత్వాన నిర్మించటానికి ప్రథమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు సి. రామచంద్ర.

మిగతా వివరాలు దీపావళి సంచికలో శ్రీనివాస్ వ్రాయగా చదవండి. □□□

● ముఖస్తుతి : మీ వెనక చెప్పుకోని విషయాలు మీ మొహంమీదే చెప్పేసెయ్యడం.


STUDIO Roopkala
ఎన్.టి.రామారావు
రేలంగి
గుమ్మడి
రమణారెడ్డి
నాగయ్య
మిక్కిలినేని
కృష్ణకుమారి
గిరిజ
సూర్యకాంతం
రవీంద్ర ఆర్ట్ ప్రొడక్షన్స్
లక్షాధికారి
ఆంధ్ర,నైజాం...పూర్ణా
సీడెడ్...భాస్కర్
దర్శకత్వం
వి.మధుసూదనరావు
నిర్మాతలు
డి.వి.రెడ్డి
తమ్మారెడ్డి కృష్ణమూర్తి
REVATHI